www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 2-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 3 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం తిథి: పంచమి రా.11.50 తదుపరి షష్ఠి నక్షత్రం: కృత్తిక ఉ.8.50 తదుపరి రోహిణి, వర్జ్యం: రా.11.38-రా.1.06, దుర్ముహూర్తం: ఉ.11.54-మ.12.43, అమృతఘడియలు: ఉ.6.39-ఉ.8.06, తె 4.04-5.33, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.12, సూర్యాస్తమయం: 6.25 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సమసిన హెచ్‌సీఏ వివాదం!

ఉదయం విజిలెన్స్ విచారణ.. సాయంత్రం రాజీ

సన్‌రైజర్స్‌తో పాత ఒప్పందానికే హెచ్‌సీఏ అంగీకారం

సీఎం రేవంత్ ఘాటు హెచ్చరికతో సర్దుకున్న పెద్దలు

వివాదం సద్దుమణిగిందంటూ సంయుక్త ప్రకటన

సీఎంకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ కృతజ్ఞతలు

ఉప్పల్ స్టేడియంలో విజిలెన్స్ అధికారుల విచారణ

అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందిని ప్రశ్నించిన అధికారులు 3

మినహాయింపుల్లేవ్

ప్రతీకార సుంకాలకు వేళయింది.. అన్ని దేశాలపైనా విధిస్తాం

అధ్యక్షుడు ట్రంప్ దీనిపై నేడు ఒక ప్రకటన చేస్తారు

మా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం సుంకాలు

కెనడా, జపాన్, ఈయూ దేశాలూ భారీగా విధిస్తున్నాయ్

తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తిన వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ

నా వ్యూహం సరైనదే.. సుంకాన్ని ఈయూ 2.5% తగ్గించింది

భారత్ కూడా సిద్ధమైంది.. మరిన్ని దేశాలూ అదే దారిలో: ట్రంప్



వాషింగ్టన్, ఏప్రిల్ 1: తమ ఉత్పత్తులపై భారీగా దిగుమతి సుంకాలు విధిస్తున్న అన్ని దేశాలపైనా ప్రతీకార సుంకాల విధింపునకు సమయం ఆసన్నమైందని.. ఈ విషయంలో తగ్గేదే లేదని, ఏ దేశానికీ మినహాయింపులు ఇచ్చే ప్రసక్తే లేదని అమెరికా తేల్చిచెప్పింది. "అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం, పాల ఉత్పత్తులపై ఈయూ దేశాలు 50 శాతం, బియ్యంపై జపాన్ 700 శాతం, వెన్న, చీజ్‌పై కెనడా 300 శాతం చొప్పున సుంకాలను విధిస్తున్నాయి" అంటూ కొన్ని దేశాల పేర్లు చెప్పి మరీ వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కారొలిన్ లెవిట్ అత్యంత తీవ్రమైన పదజాలంతో ధ్వజమెత్తారు. ఇవే కాక ఇంకా చాలా దేశాలు తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం ద్వారా అనుచిత వాణిజ్య విధానాలకు పాల్పడుతున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధిక సుంకాల కారణంగా ఆయా మార్కెట్లలోకి అమెరికా ఉత్పత్తుల దిగుమతి అసాధ్యంగా మారిందని.. దీనివల్ల కొన్ని దశాబ్దాలుగా ఎంతో మంది అమెరికన్లకు ఉపాధి లేకుండా పోయిందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో.. ఇకపై ఆయా దేశాలపై రంగాల ఆధారిత సుంకాలు విధిస్తామని ఆమె తేల్చిచెప్పారు. "దురదృష్టవశాత్తూ ఈ దేశాలన్నీ చాలా కాలంగా మా దేశాన్ని దోచుకుంటున్నాయి. ట్రంప్ విధించే కొత్త సుంకాలు అమెరికా వాణిజ్య బంధాల్లో చరిత్రాత్మక మార్పు తెస్తాయి." అని కారొలిన్ పేర్కొన్నారు. ప్రతీకార సుంకాల అమలు నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్టు అధ్యక్షుడు (ట్రంప్) స్పష్టం చేశారని.. దీనిపై బుధవారం ఆయన ఒక ప్రకటన చేస్తారని ఆమె

మిగతా 2వ పేజీలో...



మార్కెట్లో ట్రంప్ సుంకంపం

భారీ నష్టాలతో 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం 11

సెన్సెక్స్ 1,390 పాయింట్లు పతనం

23,200 దిగువ స్థాయికి జారిన నిఫ్టీ

రూ.3.44 లక్షల కోట్ల సంపద ఉఫ్

ఆ భూములు సర్కారువే

వాటిపై పూర్తి చట్టబద్ధమైన హక్కులు మాకే



విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

అక్కడ అభివృద్ధితో పెద్దఎత్తున ఉద్యోగ కల్పన

400 ఎకరాలపై సుదీర్ఘ చర్చలో ప్రభుత్వం స్పష్టీకరణ

మంత్రులు, పర్యావరణవేత్తలతో ముఖ్యమంత్రి సమీక్ష

అడవి అనగల అర్హతలన్నీ ఆ భూములకున్నాయి

యథాతథంగా ఉంచాలి: హెచ్‌సీయూ, పర్యావరణవేత్తలు

యూనివర్సిటీ ఇంచు భూమినీ ప్రభుత్వం గుంజుకోలేదు

కొంతమంది కోసం రాష్ట్ర సంపదను తాకట్టు పెట్టం: భట్టి

బీఆర్‌ఎస్ హయాంలో ఆ భూములపై కుట్ర: పొంగులేటి

వర్సిటీ భూములకు టైటిల్ డీడ్ యోచన: శ్రీధర్‌బాబు

42% ఆమోదం కోసం నేడు ఢిల్లీలో బీసీల గర్జన

హాజరు కానున్న రాహుల్, రేవంత్, అఖిలేశ్, కనిమొళి, అసద్

ఢిల్లీకి చేరుకున్న ముఖ్యమంత్రి, మంత్రులు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై ప్రతిపక్షాలు, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, పర్యావరణవేత్త నర్సింహారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాదానికి కారణమైన భూమిపై కూలంకషంగా చర్చ జరిగింది. అటు ప్రభుత్వం, ఇటు హెచ్‌సీయూ అధికారులు భూమికి సంబంధించి తమ వద్ద ఉన్న రికార్డులు, పత్రాల ఆధారంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆ భూమిపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయని ప్రభుత్వం వాదనలు వినిపించింది. అక్కడ అభివృద్ధి పనులు చేపడితే ఉద్యోగ కల్పనకు

మిగతా 13వ పేజీలో...

'చలో హెచ్‌సీయూ' ఉద్రిక్తం..

నిరసనకారులను అడ్డుకున్న పోలీసులు

ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్ట్

బీజేఎల్పీ నేత ఏలేటి గృహ నిర్బంధం

హెచ్‌సీయూ ఆక్రమణను అడ్డుకోండి

పచ్చని అటవీ భూములను రక్షించండి

కేంద్ర విద్య, పర్యావరణ మంత్రులకు.. తెలంగాణ బీజేపీ ఎంపీల వినతి

అర్ధరాత్రిళ్లు కబ్జాలు దుర్మార్గం: కిషన్‌రెడ్డి

సర్కార్.. కోర్టు ధిక్కరణ: బండి సంజయ్

ప్రజలను హింసించే పాలన: కేటీఆర్

కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిల్.. నేడు విచారణ 13

ఆ భూములు వర్సిటీ స్వాధీనంలోనే ఉన్నాయా!?

సర్వే నంబరు 36, 37ల్లో ఉన్నదెంత? పంచిందెంత!? 13



నల్లగొండ జిల్లా కనగల్ మండలం జి.యడవల్లిలో సన్న బియ్యం లబ్ధిదారుల సంతోషం

సన్నబియ్యం సంబరం

రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన పంపిణీ

ఉదయం నుంచే బారులు తీరిన లబ్ధిదారులు.. తొలిరోజు బియ్యం తీసుకున్న 8.30 లక్షల మంది

18 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అందజేత.. పలు చోట్ల పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రేషన్ షాపులకు చేరిన లక్ష టన్నుల బియ్యం.. మరో రెండు రోజుల్లో మిగిలిన బియ్యం సరఫరా

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) రేషన్ షాపుల్లో సన్నబియ్యం సంబరం మొదలైంది. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల పలు చోట్ల సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైంది. తొలి రోజు 8.30 లక్షల మంది లబ్ధిదారులు సన్నబియ్యం తీసుకున్నారు. 18 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మొదటి రోజు పంపిణీ జరిగినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పలుచోట్ల బియ్యం పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొత్త పథకం కావడంతో చాలా చోట్ల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల పరిధిలో

మిగతా 12వ పేజీలో...

సన్నాలకు సై!

ఈ ఖరీఫ్‌లో 50 లక్షల ఎకరాలు దాటే అవకాశం 12

సన్నరకాలపై రైతుల ఆసక్తి

సన్నబియ్యం పంపిణీ ప్రారంభంతో మరింత ధీమా

'ఎల్‌ఆర్‌ఎస్' పొడిగింపు!

ఈ నెలలో కూడా కొనసాగనున్న 25 శాతం రాయితీ.. నేడు ఉత్తర్వులు!

ఏప్రిల్ 1న ఫీజు చెల్లించిన వారికీ రాయితీ ఇచ్చిన అధికారులు 12

బర్డ్‌ఫ్లూతో ఏపీలో రెండేళ్ల చిన్నారి మృతి

నరసరావుపేట పట్టణంలో ఘటన

అనారోగ్యం కారణంగా గత నెలలో మంగళగిరి ఎయిమ్స్‌లో చిన్నారి చేరిక

చికిత్స పొందుతూ మృత్యువాత

శాంపిల్స్‌ను పరీక్షించి బర్డ్‌ఫ్లూగా నిర్ధారించిన వైద్య అధికారులు 14



బుల్డోజర్ న్యాయం అమానవీయం

అంతరాత్మను కలచివేసేది 2

'నిలువ నీడ' ప్రాథమిక హక్కులో భాగం

అధికారుల చర్య దౌర్జన్యపూరితం

నోటీసులు రిజిస్టర్ పోస్టులో పంపాలి

బాధితులకు 10 లక్షల చొప్పున పరిహారం

యూపీ సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశాలు

అక్రమబద్ధీకరణకు రెక్కలు!



కుంట్లూరు ఎక్స్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ భూమి (మార్క్ చేసిన భాగం)

200 కోట్ల ప్రభుత్వ భూమి కొట్టేసే ప్లాన్

కుంట్లూరు ఎక్స్ రోడ్డులో రెండెకరాలకు ఎసరు

2015లో 600 చదరపు గజాల క్రమబద్ధీకరణ

2022లో మరో 3,635 చ.గజాలకు దరఖాస్తు

నిర్మాణాల్లేకపోయినా అప్పటి సర్కారు గ్రీన్‌సిగ్నల్

క్రమబద్ధీకరణ కోసం ఫీజు కూడా వసూలు

ప్రభుత్వం మారిపోవడంతో అటకెక్కిన ఫైలు

తాజాగా ఓ ఎమ్మెల్యేతో క్రమబద్ధీకరణకు పావులు

భూమి రెగ్యులరైజేషన్‌కు లైన్ క్లియర్!?

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అది రెండెకరాల ప్రభుత్వ భూమి! దాని విలువ దాదాపు రూ.200 కోట్లు! పేదల కోసం తీసుకొచ్చిన జీవో 59ను అడ్డు పెట్టుకుని దీనిని కొట్టేసేందుకు కొంతమంది పెద్దలు ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నారు! గత ప్రభుత్వ హయాంలో కొంత భూమిని అక్రమంగా క్రమబద్ధీకరించుకున్నారు! మిగిలిన భూమినీ క్రమబద్ధీకరించుకునేందుకు పావులు కదిపారు! అ'క్రమబద్ధీకరణ'కు రెవెన్యూ అధికారులు ఫీజులూ తీసుకున్నారు! కానీ, కన్వేయన్స్ డీడ్ ద్వారా కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి చేతులు మారే సమయంలో ప్రభుత్వం మారింది. రేవంత్ సర్కారు రావడంతో క్రమబద్ధీకరణ ఫైలు అటకెక్కింది! కానీ, 'రంగారెడ్డి' జిల్లా ఎమ్మెల్యేను మచ్చిక చేసుకోవడంతో ఇప్పుడు మళ్లీ ఈ అ'క్రమబద్ధీకరణ'కు రెక్కలు వచ్చినట్లు తెలుస్తోంది. హయత్ నగర్ సమీపంలోని కుంట్లూరు ఎక్స్ రోడ్డుకు ఆనుకుని సర్వే నంబరు 24లో జరుగుతున్న భూ బాగోతమిది!

హయత్ నగర్ నుంచి కుంట్లూరుకు వెళ్లే మార్గంలో నాలుగు రహదారుల కూడలి (కుంట్లూరు ఎక్స్ రోడ్డు)లో ఎడమ వైపు రెండెకరాల ప్రభుత్వ భూమి ఉంది. అది ప్రస్తుతం ఖాళీగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో

మిగతా 10వ పేజీలో...



క్రమబద్ధీకరణకు ఒకచోట దరఖాస్తు చేసి మరోచోట నిర్మించిన భవనం



మంగళవారం లోక్‌సభలో నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష సభ్యులు

వక్ఫ్‌పై ఢీ అంటే ఢీ!

నేడే లోక్‌సభలో బిల్లు

చర్చకు 8 గంటలు కేటాయింపు

బీఏసీ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్

మైనారిటీల్లో అనవసర భయాలు సృష్టిస్తున్నారన్న మంత్రి రిజిజు

బిల్లు రాజ్యాంగ విరుద్ధమని సభలోనే చెబుతా: ఒవైసీ

ఎంపీలకు బీజేపీ, కాంగ్రెస్ విప్ జారీ

బిల్లుపై మద్దతుకు నితీశ్ షరతులు

వక్ఫ్ బిల్లుకు టీడీపీ మద్దతు

పార్టీ సూచించిన సవరణలకు ఆమోదం నేపథ్యంలో నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుపై అధికార, ప్రతిపక్షాలు అమీతుమీకి సిద్ధమయ్యాయి. ఈ బిల్లును కేంద్రప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. వెంటనే చర్చ కూడా జరుగుతుంది. స్పీకర్ ఓం బిర్లా ఇందుకు 8 గంటల సమయం కేటాయించారు. అయితే బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు.. మంగళవారం జరిగిన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశం నుంచి వాకౌట్ చేశాయి. ముస్లింల హక్కులను లాక్కునేందుకే బీజేపీ ఈ బిల్లును తీసుకొస్తోందని, ఇది రాజ్యాంగవిరుద్ధమని

మిగతా 2వ పేజీలో...



2

900 ఔషధాల ధరల పెంపు

ఫార్మా కంపెనీలకు ఎన్‌పీపీఏ అనుమతి

జాబితాలో గుండె జబ్బులు, మధుమేహం, ఇన్‌ఫెక్షన్లకు చికిత్సను అందించే మందులు

విదేశీ యువతిపై అత్యాచారం

హైదరాబాద్‌లో దారుణం

స్నేహితునితో కలిసి సంతను చూసేందుకు వెళ్లగా వారితో మాటలు కలిపిన నిందితుడు

నిర్మానుష్య ప్రాంతానికి యువతిని తీసుకెళ్లి రేప్

యాకత్పురాకు చెందిన నిందితుడి అరెస్టు

గత నెలలో జర్మనీ నుంచి వచ్చిన బాధితురాలు

హైదరాబాద్‌సిటీ/పహాడీషరీఫ్/సరూర్ నగర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చూద్దామని హైదరాబాద్‌కు వచ్చిన విదేశీ యువతిపై ఓ కారు డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మాయమాటలు చెప్పి కారులో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. సోమవారం సాయంత్రం ఈ అఘాయిత్యం జరగ్గా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన

మిగతా 14వ పేజీలో...



చైనాలో ఎగిరే ట్యాక్సీలు!

వాణిజ్యపరంగా వినియోగించేందుకు రెండు సంస్థలకు ప్రభుత్వం అనుమతి 2

ముద్దుకు రూ.50 వేలు

- వ్యాపారిపై వలపు వల.. రూ.17 లక్షలు వసూలు
- చాట్ డిలీట్ చేసేందుకు అర కోటి డిమాండ్
- ప్రీస్కూల్ నిర్వాహకురాలు, ఇద్దరు రౌడీషీటర్ల అరెస్టు



బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారిపై వలపు వల విసిరి.. డబ్బు కోసం బెదిరించిన ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ సహా, ఇద్దరు రౌడీషీటర్లను బెంగళూరు సీసీబీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.బెంగళూరు మహాలక్ష్మి లే అవుట్‌లో శ్రీదేవి అనే యువతి ప్రీ స్కూల్ నిర్వహిస్తోంది. ఇదే ప్రాంతానికి చెందిన వ్యాపారి తన పిల్లలను 2023లో ఆ స్కూల్లో చేర్చారు. ఈ క్రమంలో ఆయనతో శ్రీదేవికి పరిచయమైంది. పాఠశాల నిర్వహణ, ఇతర అవసరాలకు అతని నుంచి రూ.2 లక్షలు అప్పుగా తీసుకుని, 2024లో తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చింది. ఆ తరువాత వారి మధ్య స్నేహం కాస్త ముందుకెళ్లింది. మొదట్లో ఒక ముద్దు పెట్టేందుకు శ్రీదేవి ఏకంగా రూ.50 వేలు వసూలు చేసింది. అప్పుగా తీసుకున్న మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని ఈ ఏడాది జనవరిలో వ్యాపారి అడగడంతో ఏం కావాలో చెబితే.. ఒకేసారి ఫైనాన్స్ వ్యవహారాలు సెటిల్ చేసుకుందామని శ్రీదేవి ప్రతిపాదించింది. లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉందామని చెప్పి.. అత్యవసరంగా రూ.15 లక్షలు అడిగి తీసుకుంది. ఫిబ్రవరిలో మరోసారి డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో విసుగు చెందిన వ్యాపారి ఆమెకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో మార్చి 12న వ్యాపారి భార్యకు శ్రీదేవి ఫోన్ చేసి, 'మీ పిల్లల టీసీలు ఇస్తాం. మీ భర్తను పంపండి' అని సూచించింది. ఈ మేరకు ఆయన పాఠశాల వద్దకు వెళ్లేసరికి బిజాపూర్‌కు చెందిన రౌడీషీటర్లు గణేశ్ కాలె, సాగర్ మొరె అక్కడ ఉన్నారు. వాగ్వాదం తరువాత వ్యాపారి ఇంటికి వెళ్లి కోటి రూపాయలు డిమాండ్ చేశారు. చివరకు రూ.20 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.1.90 లక్షలు తీసుకుని వదిలేశారు. మార్చి 17న వ్యాపారికి శ్రీదేవి ఫోన్ చేసి రూ.50 లక్షలు ఇస్తే అశ్లీల వీడియోలు, చాటింగ్ డిలీట్ చేస్తానని, లేదంటే నీ భార్యకు పంపుతానని బ్లాక్ మెయిల్ చేసింది. దీంతో వ్యాపారి నేరుగా సీసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు, ప్రీస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవితోపాటు గణేశ్ కాలె, సాగర్ మొరెను అరెస్టు చేశారు.

బాణసంచా గోదాముల్లో పేలుళ్లు.. 29 మంది మృతి.. 9 మందికి గాయాలు

పాలన్‌పూర్/కోల్‌కతా, ఏప్రిల్ 1: గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు బాణసంచా ప్రమాదాల్లో 29 మంది మృతిచెందారు. 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా దీసా పారిశ్రామిక ప్రాంతంలోని ఓ బాణసంచా గోదాంలో బాయిలర్ పేలి భారీగా మంటలు చెలరేగాయి. మంగళవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో 21 మంది మృతిచెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారంతా మధ్యప్రదేశ్‌కు చెందిన వారని ఎస్పీ అక్షయరాజ్ మక్వానా తెలిపారు. గుజరాత్ సీఎం భూపేంద్ర మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. మరో ఘటన పశ్చిమ బెంగాల్ దక్షిణ 24 పరగణా జిల్లాలో జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మరణించగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. పత్తర్ ప్రతిమా ప్రాంతంలోని చంద్రకాంత్ బెనిక్ అనే వ్యక్తికి చెందిన బాణసంచా కర్మాగారంలో సోమవారం రాత్రి ఈ పేలుడు సంభవించింది.

రాజకీయాలు నాకు ఫుల్‌టైం జాబ్ కాదు!

- పార్టీ నన్ను యూపీ సీఎంగా కూర్చోబెట్టింది: యోగి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఓవైపు ప్రధాని మోదీ రిటైర్మెంట్‌పై ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా తన రాజకీయ భవిష్యత్ గురించి మాట్లాడారు. భావి ప్రధాని మీరేనా అని మంగళవారం ఓ విలేకరి అడుగగా.. రాజకీయాలు తనకు పూర్తికాలపు ఉద్యోగం (ఫుల్‌టైం జాబ్) కాదని ఆయన బదులిచ్చారు. 'నేను రాష్ట్ర సీఎంగా ఉన్నాను. ఉత్తరప్రదేశ్ ప్రజల కోసం పార్టీ (బీజేపీ) నన్నిక్కడ కూర్చోబెట్టింది. రాజకీయాలు నాకు ఫుల్‌టైం జాబ్ కాదు. వాస్తవానికి నేనో యోగిని. కానీ ఇక్కడున్నంత కాలం పనిచేస్తూనే ఉంటా. అయితే దీనికీ ఓ కాలపరిమితి ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. కాగా.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని 80 స్థానాలకు గాను బీజేపీ 33 సీట్లే గెలవడం.. గతం కంటే 29 తగ్గిపోవడంతో యోగిపై ఆ పార్టీ అధిష్ఠానం తీవ్ర అసంతృప్తితో ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ అంశాన్ని ఆయన వద్ద ప్రస్తావించగా.. అధిష్ఠానంతో తనకెలాంటి విభేదాలూ లేవని యోగి స్పష్టంచేశారు.

బుల్డోజర్ న్యాయం అమానవీయం

- బాధితులకు 10 లక్షల చొప్పున చెల్లించాలి: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్లను కూల్చివేస్తూ బుల్డోజర్ న్యాయం అమలు చేస్తున్నందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై మంగళవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టబద్ధంగా తగిన ప్రక్రియను పాటించకుండా ఇళ్లను కూల్చివేయడం 'అమానవీయం, అక్రమం' అని వ్యాఖ్యానించింది. ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు వంతున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ప్రయాగ్‌రాజ్‌లోని లుకేర్‌గంజ్‌లో ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీడీఏ) ఇళ్లను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. "ఇలాంటి కేసులు మన అంతరాత్మను షాక్‌కు గురిచేస్తాయి. అధికారులు దౌర్జన్యపూరితంగా వ్యవహరించి నివాసాలను కూల్చి వేశారు. శిథిల భవనం వద్ద ఓ చిన్న బాలిక దీనంగా నిల్చొని ఉన్న వీడియో వైరల్‌గా మారింది. ఇలాంటి దృశ్యాలు కలచివేస్తాయి. నిలువ నీడను కలిగి ఉండే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో పొందుపరిచిన ప్రాథమిక హక్కులో అంతర్భాగం" అని వ్యాఖ్యానించింది. ఇదిలా ఉండగా, ప్రార్థనా స్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలయ్యే కొత్త వ్యాజ్యాలను స్వీకరించబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకే అంశంపై పలు విచారణలను అంగీకరించబోమని తెలిపింది.

త్వరలోనే భారత్‌కు వస్తా: సునీతా విలియమ్స్

న్యూయార్క్, ఏప్రిల్ 1: అంతరిక్షం నుంచి చూస్తే భారత్ అద్భుతంగా ఉందని నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ చెప్పారు. త్వరలో తన తండ్రి పుట్టిన భారత్‌కు వెళ్లి అక్కడి ప్రజలతో తన అంతరిక్ష అనుభవాలు పంచుకుంటానని తెలిపారు. తాజాగా ఆమె విల్మోర్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. అంతరిక్ష కేంద్రం నుంచి భారత్ ఎలా కనిపిస్తోంది? అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆమె.. "అద్భుతంగా ఉంది. హిమాలయాల పైనుంచి మేం వెళ్లిన ప్రతిసారి విల్మోర్ ఫొటోలు తీశారు. ఆ పర్వతాలు అత్యద్భుతం. నా తండ్రి జన్మించిన దేశం వెళతాను. అక్కడి ప్రజలతో మమేకం అవుతాను. త్వరలో చేపట్టే యాక్సియమ్ మిషన్‌లో భారతీయుడు శుభాంశు శుక్లా భాగస్వామి కావడం అద్భుతంగా అనిపిస్తోంది. అతన్ని ఏదో సమయంలో కలుస్తాను. మా అంతరిక్ష అనుభవాలు అందరితో పంచుకుంటాం" అని విలియమ్స్ చెప్పారు. గుజరాత్‌కు చెందిన సునీతా విలియమ్స్ తండ్రి దీపక్ పాండ్యా.. 1958లో మెడిసిన్‌లో రెసిడెన్సీ శిక్షణకు, ఇంటర్న్‌షిప్ కోసం అమెరికాలోని ఓహియోకు వెళ్లారు. సునీతా విలియమ్స్ అక్కడే జన్మించారు.

వాణిజ్య సిలిండర్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.41 మేర తగ్గించాయి. అలాగే ఏటీఎఫ్(ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్) ధరలను 6.1%(లీటర్‌కు రూ.5,870.54 ల) మేర తగ్గించాయి. ఏప్రిల్ 1 నుంచే ఈ ధరల తగ్గింపు అమల్లోకి వచ్చింది. ధరల తగ్గింపు తర్వాత వాణిజ్య సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,762, ముంబైలో రూ.1,868.50, చెన్నైలో రూ.1,921.50 లకు తగ్గింది.

వక్ఫ్‌పై ఢీ అంటే ఢీ!



వక్ఫ్ బిల్లును స్పీకర్ ఓం బిర్లాకు సమర్పిస్తున్న జేపీసీ సభ్యులు(ఫైల్)

(మొదటి పేజీ తరువాయి)

అవి ఆరోపిస్తుండగా.. అలాంటిదేమీ జరుగదని.. ముస్లింలలో లేనిపోని భయాందోళనలు సృష్టిస్తున్నారని బీజేపీ విరుచుకుపడుతోంది. గత ఏడాది తీసుకొచ్చిన ఈ వక్ఫ్ సవరణ బిల్లు-2024ను ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి నివేదించిన సంగతి తెలిసిందే. బీజేపీ ఎంపీ జగదంబికా పాల్ నేతృత్వంలోని ఈ కమిటీ పలు సార్లు సమావేశమైంది. ముస్లిం సంఘాలతో, ప్రముఖులతో చర్చించింది. జేపీసీలో విపక్ష సభ్యులు పలు సవరణలు ప్రతిపాదించగా తిరస్కరించింది. టీడీపీ, జేడీయూ సహా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ప్రతిపాదించిన 14 సవరణలను బిల్లులో పొందుపరిచింది. నివేదికను ఇటీవలే స్పీకర్‌కు సమర్పించింది. కొన్ని మార్పులతో సవరణ బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ అంశంపై మంగళవారం స్పీకర్ అధ్యక్షతన బీఏసీ సమావేశమైంది. తమ గొంతు నొక్కుతున్నారంటూ విపక్షాలు వాకౌట్ చేశాయి. ప్రతిపక్షాలు చర్చకు అధిక సమయం కేటాయించాలని అడిగాయని.. మణిపూర్ పరిస్థితి, ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డుల అంశంపైనా చర్చించాలని కోరాయని.. ప్రభుత్వం పట్టించుకోలేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ ఆరోపించారు. అయితే చాలా పార్టీలు 4 నుంచి 6 గంటలు చర్చించాలని కోరాయని.. విపక్షాలు 12 గంటలన్నాయని.. చివరకు సభాపతి 8 గంటలు కేటాయించారని.. అయితే సభ కోరితే సమయాన్ని ఆయన పొడిగిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వెల్లడించారు. చర్చ నుంచి పారిపోవడానికి రకరకాల సాకులు వెతుకుతున్నాయని విపక్షాలపై మండిపడ్డారు. బుధవారం ప్రశ్నోత్తరాలు పూర్తికాగానే.. మైనారిటీ వ్యవహారాల మంత్రి హోదాలో సభలో తానీ బిల్లును ప్రవేశపెడతానని చెప్పారు. బిల్లుపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేసి సమాజంలో అశాంతిని రేకెత్తించేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఈ బిల్లును క్రైస్తవ సంస్థలు కూడా సమర్థిస్తున్నాయని తెలిపారు. కాగా.. బిల్లును వ్యతిరేకించేందుకు అనుసరించాల్సిన సంయుక్త వ్యూహంపై చర్చించేందుకు 'ఇండీ' కూటమి నేతలు మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో సమావేశమయ్యారు. బిల్లుపై చర్చలో క్రియాశీలంగా పాల్గొనడమే గాక దానికి వ్యతిరేకంగా ఓటేయాలని కూటమి నిర్ణయించినట్లు ఆర్ఎస్పీ ఎంపీ ఎన్కే ప్రేమ్‌చంద్రన్ మీడియాకు చెప్పారు. బుధవారం సభకు హాజరయ్యే ముందు రాహుల్ కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం కానున్నారు. వక్ఫ్ బిల్లు ఎలా రాజ్యాంగ విరుద్ధమో తన అభిప్రాయాలను పార్లమెంటు ముందుంచుతానని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. ముస్లింల మతస్వేచ్ఛను హరించేందుకే ఈ బిల్లును తీసుకొస్తున్నారని ఆరోపించారు. 543 మంది సభ్యుల లోక్‌సభలో ప్రస్తుతం 542 మంది ఎంపీలు ఉండగా.. ఎన్డీఏకి 293 మంది, ఇండీ కూటమికి 238 మంది ఉన్నారు. వైసీపీ, ఎంఐఎం సహా ఇతర పార్టీలకు 11 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యసభలో మొత్తం 245 మంది సభ్యులు ఉండగా.. 9 ఖాళీల కారణంగా 236 మందే ఉన్నారు. వీరిలో ఎన్డీఏ ఎంపీలు 125 మంది కాగా.. ఇండీ కూటమికి 88 మంది, వైసీపీ, బీజేడీ, బీఆర్ఎస్ సహా ఇతరులకు 23 మంది సభ్యులున్నారు. స్వతంత్రుల మద్దతు కూడగట్టేందుకు కేంద్ర మంత్రులు రంగంలోకి దిగారు. తమ ఎంపీలంతా బుధవారం లోక్‌సభకు హాజరు కావాలని బీజేపీ విప్ జారీచేసింది. బుధవారమే గాక గురు, శుక్రవారాల్లో తప్పక సభకు రావాలని కాంగ్రెస్ కూడా తన ఎంపీలను ఆదేశించింది.

అలాగైతేనే నితీశ్ మద్దతు?

జేడీయూ సూచించిన మార్పులను జేపీసీ ఆమోదించినా.. ఆ పార్టీ అధినేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ వక్ఫ్ బిల్లుకు మద్దతుపై ఇంకా తన వైఖరిని స్పష్టం చేయలేదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. దీనిపై జేడీయూ ఎంపీ సంజయ్ ఝా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 19 ఏళ్లుగా నితీశ్ ముస్లింల సంక్షేమానికి కృషిచేస్తున్నారని.. వారికి ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలనూ ఆయన అంగీకరించరని స్పష్టంచేశారు. వక్ఫ్ వ్యవహారాల్లో గతంలో జరిగిన వాటిని తవ్వితీయకూడదని ప్రభుత్వానికి స్పష్టంచేశామని తెలిపారు. ఇందుకు కేంద్రం అంగీకరిస్తేనే మద్దతిస్తామని జేడీయూ షరతు విధించినట్లు సమాచారం.

బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు

జేపీసీలో సభ్యుడిగా ఉన్న టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు బిల్లులో మూడు మార్పులను ప్రతిపాదించారు. వాటిని ఆమోదించి సవరణ బిల్లులో పొందుపరచినందున ఆ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బిల్లుకు మద్దతు తెలిపేందుకు సభకు హాజరు కావాలని టీడీపీ చీఫ్ విప్ హరీశ్ తమ ఎంపీలకు విప్ జారీచేశారు. పార్లమెంటులో వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలపాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా తమ ఎంపీలను ఆదేశించారు.

దానధర్మాలకు 3,800 కోట్లు

- వీలునామాలో రాసిచ్చిన రతన్ టాటా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా తన ఆస్తుల్లో సింహభాగం సామాజిక సేవకు, దానధర్మాలకు కేటాయించారు. తన మొత్తం సంపదలో రూ.3,800 కోట్లను తాను నెలకొల్పిన రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్(ఆర్‌టీఈఎఫ్), రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్ట్ (ఆర్‌టీఈటీ)కు కేటాయించారు. టాటా సన్స్‌లో రతన్ టాటాకు ఉన్న వాటాలో 70% ఆర్‌టీఈఎఫ్‌కు, మిగిలిన 30% ఆర్‌టీఈటీకి వెళ్తుంది. 2022 ఫిబ్రవరి 23న టాటా గ్రూప్ అధినేత తన చివరి వీలునామాను సిద్ధం చేశారు. టాటా సన్స్‌లో తన వాటాలను ప్రస్తుత వాటాదారుకు తప్ప వేరొకరికి బదిలీ చేయడానికి లేదా విక్రయించడానికి వీల్లేదని తన చివరి వీలునామాలో రతన్ టాటా స్పష్టం చేశారు. బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, వాచీలు, పెయింటింగ్‌లతో పాటు ఇతర ఆస్తుల్లో మూడోవంతును తన ఇద్దరు సవతి సోదరీమణులు షిరీన్ జెజీభోయ్, దీనా జెజీభోయ్ పేరున రాశారు. వాటి విలువ దాదాపు రూ.800 కోట్లు ఉంటుందని అంచనా. టాటాతో అత్యంత సన్నిహితంగా మెలిగిన మాజీ ఉద్యోగి మోహినీ ఎం దత్తా పేరు కూడా వీలునామాలో ప్రస్తావించారు. టాటా, టాటాయేతర కంపెనీలు, గృహాల్లో వాటాలను మినహాయించి, మిగిలిన ఆస్తుల్లో మూడో వంతు వాటాను దత్తా అందుకోనున్నారు. ఆభరణాలతో పాటు తండ్రి నావల్ టాటా నుంచి వారసత్వంగా వచ్చిన జుహూ బంగ్లాలో సగం యాజమాన్య హక్కులను జిమ్మీ టాటా(సోదరుడు) సొంతం చేసుకుంటారు. కాగా, టాటా చివరి వీలునామా ప్రామాణికతను ధ్రువీకరించి, అందులో పేర్కొన్న విధంగా ఆస్తి నిర్వహణకు అనుమతులు కోరుతూ బాంబే హైకోర్టులో గత వారం పిటిషన్ దాఖలైంది.

లోకం తీరు



మినహాయింపుల్లేవ్

(మొదటి పేజీ తరువాయి)



వెల్లడించారు. అయితే, ఈ తరహా దూకుడు విధానం అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని ట్రంప్ విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీకార సుంకాలకు సంబంధించి 'విమోచన దినం' పేరిట తాను విధించిన డెడ్‌లైన్ (ఏప్రిల్ 2) సమీపిస్తుండడంతో.. భారతదేశం కొన్ని సుంకాలను గణనీయంగా తగ్గించేందుకు సిద్ధమైందని ట్రంప్ మంగళవారం పేర్కొన్నారు. తాను విధించే ప్రతీకార సుంకాలు.. అమెరికా మిత్రపక్షాలను చైనాకు దగ్గర చేసే అవకాశం ఉందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. తాను అనుసరిస్తున్న వ్యూహంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని.. అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న కార్లపై సుంకాన్ని 2.5 శాతం మేర తగ్గిస్తూ యూరోపియన్ యూనియన్ ఇటీవలే తీసుకున్న నిర్ణయమే ఇందుకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. మరికొన్ని దేశాలు కూడా అదే బాటలో నడవబోతున్నాయని ట్రంప్ అన్నారు.

ట్రేడ్ బారియర్స్ నివేదిక..

ఇతర దేశాల ఉత్పత్తుల దిగుమతులను నిరుత్సాహపరిచేలా పలు దేశాలు అనుసరిస్తున్న పన్ను, పన్నేతర విధానాలు, విధిస్తున్న నియమనిబంధనల జాబితాతో కూడిన 397 పేజీల నివేదికను ట్రంప్ సర్కారు విడుదల చేసింది. '2025 నేషనల్ ట్రేడ్ ఎస్టిమేట్ రిపోర్ట్ ఆన్ ఫారిన్ ట్రేడ్ బారియర్స్' పేరిట రూపొందించిన ఈ నివేదిక ప్రకారం..అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాల జాబితాలో భారత్ ఉంది. కొన్నిరకాల మద్యాలు, వాల్‌నట్స్ తదితరాలపై భారత్ 100-150% సుంకాలు విధిస్తున్నట్టు అందులో వెల్లడించారు. అర్జెంటీనా, మెక్సికో, తదితర దేశాలు విధిస్తున్న విలువ ఆధారిత పన్నులు అమెరికా దిగుమతులకు భారంగా మారాయని వెల్లడించారు.



చైనాలో ఎగిరే ట్యాక్సీలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఆ ట్యాక్సీలు దూసుకెళ్లేది రోడ్డు మీద కాదు.. రెక్కలు తొడుక్కొని.. రివ్వున గాల్లోకి ఎగిసి.. ప్రయాణికులకు ప్రత్యేక అనుభూతిని మిగుల్చుతూ గమ్యస్థానాలకు చేరవేస్తాయి! మన దేశంలో ఇంకాస్త సమయం పడుతుందేమో గానీ చైనాలో అధికారికంగా ఈ ఎగిరే ట్యాక్సీలు వచ్చేశాయి. వీటికి పైలెట్ అవసరమే లేదు. డ్రోన్ సాయంతో గాల్లో ప్రయాణిస్తాయి. ఈ ఎయిర్ ట్యాక్సీలను కమర్షియల్ ప్యాసింజర్ సర్వీసుల కోసం వినియోగించుకునేందుకు ఈ హ్యాంగ్, హెఫెయి అనే రెండు ఎయిర్‌లైన్స్ సంస్థలకు చైనా ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ఈ రెండు కంపెనీలకు ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికెట్ జారీ చేసింది. రోడ్డు మార్గం సరిగా లేని మారుమూల ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ ఎయిర్ ట్యాక్సీలు ఎంతో అనుకూలం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

900 ఔషధాల ధరల పెంపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ పరిధిలోని 'జాతీయ ఔషధ ధరల సాధికారసంస్థ' (ఎన్‌పీపీఏ) 900కిపైగా ఔషధాల ధరల పెంపునకు అనుమతించింది. మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిర్ణయంతో.. గుండె జబ్బులు, మధుమేహంతో పాటు పలు కీలక ఇన్‌ఫెక్షన్లకు చికిత్సను అందించే ఔషధాల ధరలు గరిష్ఠంగా 1.74% మేర పెరగనున్నాయి. ఈ వివరాల్ని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో లిఖితపూర్వకంగా వెల్లడించారు. ధరలు పెరగనున్న ఔషధాల జాబితాలో అజిత్రోమైసిన్, అమోక్సిసిలిన్, డైక్లోఫెనాక్, ఇబుప్రొఫెన్, డాపాగ్లిఫ్లోజిన్, మెట్‌ఫార్మిన్ హైడ్రోక్లోరైడ్, గ్లిమ్‌పైరైడ్, అసిక్లోవిర్, హైడ్రాక్సీ క్లోరోక్విన్ మొదలైనవి ఉన్నాయి.

600 మంది ఉద్యోగులపై జొమాటో వేటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించింది. ఏడాది క్రితం విధుల్లోకి తీసుకున్న వారిలో దాదాపు 600 మంది కస్టమర్ సపోర్ట్ అసోసియేట్స్‌పై హఠాత్తుగా వేటు వేసింది. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఒక నెల జీతాన్ని పరిహారంగా చెల్లించి సాగనంపింది. పేలవమైన పని తీరు, సమయపాలన పాటించకపోవడాన్ని కారణంగా చూపి వేటు వేసింది. హైదరాబాద్, గురుగ్రామ్‌లోని కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో మిగిలిన సిబ్బంది కూడా ఉద్యోగ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జొమాటో అసోసియేట్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్(జడ్ఏఏపీ) కింద ఏడాది క్రితం 1500 మందిని జొమాటో ఉద్యోగంలోకి తీసుకుంది. వారిలో 600 మందిపైనే ఇప్పుడు వేటు వేసింది. జొమాటో వృద్ధి రేటు మందగించడం, జొమాటో అనుబంధ విభాగం బ్లింకిట్ నష్టాలు పెరుగుతుండడంతో వాటిని తగ్గించుకునేందుకు జొమాటో ఉద్యోగుల సంఖ్యను తగ్గించిందని కథనాలు వెలువడ్డాయి. కస్టమర్ సపోర్ట్ విభాగాల్లో ఏఐ వినియోగంతో నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవాలనే ఆలోచనతోనే జొమాటో సిబ్బందిపై వేటు వేసిందని పేర్కొన్నాయి.

బాల్యం శిథిలం!

మయన్మార్ భూకంప మృతుల్లో 1,600 మంది చిన్నారులే



- మరో 3 వేల మందికి గాయాలు
- ఆందోళన వ్యక్తం చేసిన యునిసెఫ్
- మాండలే, సికాయ్‌లో మళ్లీ భూకంపం

నేపిదా(మయన్మార్), ఏప్రిల్ 1: భూప్రకోపంతో విధ్వంసాన్ని చవిచూసిన మయన్మార్‌లో బాల్యం ప్రమాదంలో పడిందని ఐక్య రాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ-- అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి(యునిసెఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. మార్చి 28 నాటి భూకంపం.. తదనంతర ప్రకంపనలతో జరిగిన విధ్వంసంలో మరణాల సంఖ్య 3,756కు చేరగా.. మృతుల్లో 1,600 మందికి పైగా బాలలు ఉన్నారని యునిసెఫ్ తెలిపింది. మరో 3,400 మంది చిన్నారులు గాయాలపాలైనట్లు పేర్కొంది. "మయన్మార్ బాలలు ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గత ఏడాది నుంచి విపత్తులు బాలల పాలిట శాపంగా మారాయి. గత ఏడాది వచ్చిన యాగీ తుఫాను, ఆ తర్వాత థాయ్‌లాండ్, వియత్నాం వరదలతో మయన్మార్ అతలాకుతలమైంది. అంతర్యుద్ధం కూడా బాల్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మయన్మార్‌లో చిన్నారులను కాపాడాల్సిన అవసరం అంతర్జాతీయ సమాజంపై ఉంది" అని యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేథరిన్ అన్నారు.

నిత్యావసరాలకు కటకట

భూకంప ప్రభావిత మాండలే, సికాయ్ తదితర ప్రాంతాల్లో ప్రజలు రోడ్లపక్కన ఫుట్‌పాత్‌లపై, పార్కుల్లో తాత్కాలిక గుడారాలు వేసుకుని, నివసిస్తున్నారు. అయితే.. తాగునీరు, ఆహారం, ఔషధాలు అందక ఇక్కట్లపాలవుతున్నారు. నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడంతో.. చిన్నారుల ఆకలి తీర్చేందుకు ఒక కోడిగుడ్డు కూడా కొనలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. వివిధ దేశాలు పంపుతున్న సాయం తమకు అందడం లేదని పేర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా లేక.. రాత్రిళ్ల ప్రజలు పాముకాట్లకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సికిన్ నగరంలో ఆరుగురు పాముకాట్ల బారిన పడ్డారు. కాగా.. మాండలే, సికాయ్ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 4.7 తీవ్రతతో మరోమారు భూకంపం సంభవించింది. మరోవైపు, అల్పపీడనం తీరాన్ని తాకడంతో.. మయన్మార్‌లో వర్షాలు కురుస్తున్నాయి.

నలుగురు ఖైదీల మృతి

భూకంపంతో ఓబో జైలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే..! ఈ ఘటనలో చాలా మంది ఖైదీలు చనిపోయి ఉంటారని వార్తలు వచ్చినా.. నలుగురు మృతిచెందారని మిలటరీ సర్కారు మంగళవారం ప్రకటించింది. అయితే.. మాండలేతోపాటు మిగతా జైళ్లలో రాజకీయ ఖైదీల పరిస్థితి ఏమిటని ప్రభుత్వ మాజీ అధినేత అంగ్‌సాన్ సూకీ ప్రశ్నించారు. మరోవైపు, అస్త్రాలు లేకుండా యుద్ధం చేస్తున్నట్లుగా పరిస్థితి ఉందని సహాయక బృందాలు వాపోతున్నాయి. థర్మల్ ఇమేజింగ్, థర్మల్ డిటెక్షన్ కెమెరాలు, రాడార్లు, డ్రోన్లు లేకుండానే శిథిలాల కింద అన్వేషణను కొనసాగిస్తున్నట్లు తెలిపాయి. దీంతో సహాయక చర్యలు మందకొడిగా సాగుతున్నాయని, మిలటరీ సర్కారు ఆంక్షలు కూడా ఇబ్బందికరంగా మారాయని పేర్కొన్నాయి. కనీసం శిథిలాల్లో ఎవరి జాడనైనా కనిపెడితే.. వారికి ఆక్సిజన్ అందజేసే వెసులుబాటు కూడా లేదని వివరించాయి.

కొత్త సంవత్సర వేడుకల రద్దు

భూకంపం నేపథ్యంలో బౌద్ధుల కొత్త సంవత్సర(తింగ్‌యాన్) వేడుకలను రద్దు చేస్తున్నట్లు మయన్మార్‌లోని మిలటరీ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఏటా వారం రోజులపాటు నూతన సంవత్సర వేడుకలు జరుగుతాయి. ఈనెల 17న తింగ్‌యాన్ ఉండగా.. 13 నుంచి 16వ తేదీ వరకు వసంతోత్సవాలు, ఇతర వేడుకలను షెడ్యూల్ చేశారు. సర్కారు తాజా నిర్ణయంతో ఈ వేడుకలు రద్దయ్యాయి.

విధ్వంసంపై ఇస్రో ఫొటోలు



మయన్మార్ భూకంపం సృష్టించిన విధ్వంసానికి సంబంధించి కార్టోశాట్-3 ఉపగ్రహం తీసిన ఫొటోలను ఇస్రో తాజాగా విడుదల చేసింది. భూకంపానికి ముందు, తర్వాత తేడాలను ఆ చిత్రాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. మార్చి 28న భూకంపం సంభవించగా.. కార్టోశాట్-3 మార్చి 29న మయన్మార్‌లోని మాండలే, సగాయింగ్ నగరాలపై నుంచి ఈ ఫొటోలు తీసింది. వాటితోపాటు మార్చి 18న ఇదే ప్రాంతంపై నుంచి కార్టోశాట్-3 తీసిన చిత్రాలను పక్కపక్కన ఉంచిన ఇస్రో విపత్తుకు ముందు, తర్వాత ఈ ప్రాంతం ఎలా ఉందో స్పష్టంగా తెలియజేసింది.

నిత్యానంద సజీవ సమాధి?

ప్రకటించిన మేనల్లుడు సుందరేశ్వరన్



చెన్నై, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు స్వామి నిత్యానంద రెండు రోజుల క్రితం సజీవ సమాధి అయినట్లు ఆయన మేనల్లుడు సుందరేశ్వరన్ ప్రకటించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిత్యానంద ప్రాణత్యాగం చేసి, సమాధి చెందారని సామాజిక మాధ్యమాల ద్వారా వివరించారు. నిత్యానంద అధికారిక వెబ్‌సైట్ గానీ, యూట్యూబ్ చానల్ గానీ సుందరేశ్వరన్ ప్రకటనను ఖండించకపోవడంతో ఆయన భక్తగణం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అదే సమయంలో నిత్యానంద వేంకటేశ్వర మూర్తి భావసమాధి దర్శనం పేరుతో శ్రీవారి వేషంలో ఆయన దర్శనమిస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వెలువడటం కలకలం రేపుతోంది. కేసుల నుంచి తప్పించుకునేందుకే ఈ సజీవ సమాధి ప్రకటన అంటూ నెటిజన్లు దుయ్యబడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా నిత్యానందకు అభిమానులు, భక్తులు, అనుచరులు పెద్దసంఖ్యలో ఉన్నారు. తిరువణ్ణామలై, బిడది, అహ్మదాబాద్ తదితర 41 ప్రాంతాల్లో ఆయనకు ఆశ్రమాలున్నాయి. 15ఏళ్ల క్రితం నిత్యానంద ఒక ప్రముఖ నటితో సన్నిహితంగా ఉన్న వీడియో సంచలనం సృష్టించింది. వందలాది మంది మహిళా శిష్యురాళ్లను తప్పుదారి పట్టించడం, మనీలాండరింగ్‌కు పాల్పడటంతో పాటు భూకబ్జాలకు సంబంధించి ఆయనపై పలు ఆరోపణలున్నాయి. బెంగుళూరు, అహ్మదాబాద్‌లో మహిళలపై నిత్యానంద అత్యాచారం చేసినట్లు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో 2020లో దేశం వదిలిపోయిన నిత్యానంద.. పసిఫిక్ దీవుల్లో 'కైలాస' పేరుతో దేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటించారు.

ఆ ఆస్తులన్నీ రంజితకేనా..?

స్వామీజీ అవతారంలో ఉన్నప్పటికీ నిత్యానంద విలాసవంతమైన జీవితాన్నే అనుభవించారు. రూ.వందల కోట్లతో కైలాస దీవి కొనుగోలు చేసినట్లు సన్నిహిత భక్తులు చెబుతున్నారు. ఆయన ఆస్తుల విలువ దాదాపు రూ.4వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పుడు ఆయన మరణించినట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో.. ఆ ఆస్తులన్నీ ఎవరికి చెందుతాయనే చర్చ మొదలైంది. సుదీర్ఘకాలంగా నిత్యానంద శిష్యురాలిగా, భాగస్వామిగా ఉన్న నటి రంజితకే అవన్నీ చెందుతాయని శిష్యగణం చెబుతోంది. వాటి నిర్వహణ బాధ్యతలు కూడా చూస్తున్నారని భక్తులు చెబుతున్నారు.

కాంగ్రెస్ హామీల అమలేది?

- ఇంకెన్నిసార్లు మోసం చేస్తావ్ రేవంత్ : హరీశ్‌రావు
- ప్రియాంకాజీ.. యువతుల స్కూటీలు ఎక్కడ?: కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తేదీలు, గడువులు మారుతున్నాయి తప్ప.. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని.. మాటిచ్చి మోసం చేయడం, నాలుక మడతేయడం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. జనవరి 26న, మొన్నటి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ మార్చి 31 నాటికి రైతులందరికీ భరోసా డబ్బులు వేస్తామన్నారు.. ఏమైందని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన ప్రశ్నించారు. రైతులను ఇంకెన్నిసార్లు మోసం చేస్తావు రేవంత్‌రెడ్డీ..? దసరాకిస్తామని ఇవ్వలేదు. సంక్రాంతికీ ఇవ్వలేదు.. ఉగాదికి ఇస్తామని ఊరించి రైతులను ఉసూరుమనిపించావని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మాటలు నమ్మి ఉగాది వేళ ఆశగా ఎదురుచూసిన రైతులకు చేదు అనుభవమే ఎదురైందని పేర్కొన్నారు. రుణమాఫీని దారుణ వంచనగా మార్చారని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అడుగు ముందుకు పడటం లేదని, మోసమే తన విధానంగా మార్చుకున్న సీఎం రైతులను అన్ని కోణాల్లో దగా చేస్తున్నారని ఆరోపించారు. కాగా ఎన్నికల సమయంలో ఆడబిడ్డలను ఆకర్షించే హామీలిచ్చి అధికారం చేపట్టారు.. స్వయంగా మీరే స్కూటీలిస్తామన్నారు. 15 నెలలు గడిచినా.. ఇప్పటికీ ఇవ్వలేదు.. ప్రియాంకాజీ.. తెలంగాణ యువతుల స్కూటీలు ఎక్కడ? అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈమేరకు స్కూటీ మీనియేచర్‌ని పట్టుకున్న మీట్లీ ఇమేజ్‌ను మంగళవారం ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ చేశారు. తెలంగాణ ప్రజల పక్షాన కాంగ్రెస్ హామీల అమలుపై వినూత్న రూపంలో ప్రశ్నిస్తూనే ఉంటామని.. ఈ సందర్భంగా కవిత వెల్లడించారు.

బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలి

- బీపీ మండల్ మనవడు ప్రొఫెసర్ సూరజ్ మండల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యా ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును కేంద్రం వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ మండల్ మనుమడు-ప్రొఫెసర్ సూరజ్ మండల్ డిమాండ్ చేశారు. అలా ఆమోదించిన చట్టాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించాలని కోరుతూ బీసీ ఆజాదీ జేఏసీ నేతలు జక్కని సంజయ్, ఆళ్ల రామకృష్ణ అధ్యక్షతన ఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద చేపట్టిన ఓబీసీ ఆజాదీ సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. అందులో భాగంగా బీసీ నేత బత్తుల సిద్ధేశ్వర పటేల్ మంగళవారం చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు సూరజ్ మండల్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు బత్తుల సిద్ధేశ్వర్ ఆమరణ దీక్షకు సంఘీభావం తెలిపారు. కాగా, నిరసనకు ఇచ్చిన గడువు ముగియడంతో దీక్ష చేపట్టిన సిద్ధేశ్వర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు హరియాణా సరిహద్దులలో వదిలివేశారు.

కొత్తగూడెంలో విమానాశ్రయాన్ని నిర్మించండి

- రామ్మోహన్ నాయుడికి బీఆర్ఎస్ ఎంపీల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడును బీఆర్ఎస్ ఎంపీలు కోరారు. అలాగే, వరంగల్‌లోని మామునూరులో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని కోరారు. మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు, బండి పార్థసారథి రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయడం ఎంతో అత్యవసరమని తెలిపారు. సింగరేణి ప్రధాన కార్యాలయం, నవభారత్, ఐటీసీ, హెవీ వాటర్ ప్లాంట్, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి పరిశ్రమలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే, భద్రాచలం ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ప్రతిపాదిత విమానాశ్రయాలకు అనుమతి ఇవ్వాలని కోరారు.

సమసిన హెచ్‌సీఏ వివాదం!

ఉదయం విజిలెన్స్ విచారణ.. సాయంత్రం రాజీ.. సన్‌రైజర్స్‌తో పాత ఒప్పందానికే హెచ్‌సీఏ అంగీకారం

- సీఎం రేవంత్ ఘాటు హెచ్చరికతో సర్దుకున్న పెద్దలు
- వివాదం సద్దుమణిగిందంటూ సంయుక్త ప్రకటన



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) యాజమాన్యం మధ్య వివాదం సద్దుమణిగింది. సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు హెచ్చరికల నేపథ్యంలో ఇరు వర్గాలు రాజీకి వచ్చాయి. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం విజిలెన్స్ బృందాలు రంగంలోకి దిగగా.. సాయంత్రానికి సీన్ మారిపోయింది. హెచ్‌సీఏ పెద్దలు, సన్‌రైజర్స్ ప్రతినిధుల మధ్య పలు దఫాలు చర్చలు జరిగాయి. నిబంధనల ప్రకారమే కాంప్లిమెంటరీ పాసులు ఇస్తామని, అదనంగా ఒక్క పాస్ కూడా ఇవ్వబోమని ఎస్ఆర్‌హెచ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పడంతో.. హెచ్‌సీఏ అపెక్స్ కమిటీ దానికే అంగీకరించింది. ఈ మేరకు ఇరువురు కలిసి సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బీసీసీఐ, ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ మధ్య గతంలో జరిగిన త్రైపాక్షిక ఒప్పందం మేరకు పనిచేసేందుకు ఇరువర్గాలు అంగీకరించినట్లు పేర్కొన్నారు. పాత ఒప్పందం ప్రకారమే.. స్టేడియం సీటింగ్ సామర్థ్యంలో పది శాతం కాంప్లిమెంటరీ పాసులను హెచ్‌సీఏకు ఇచ్చేందుకు ఎస్ఆర్‌హెచ్ అంగీకరించింది. ఇక ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహించేందుకు ఎస్ఆర్‌హెచ్‌కు పూర్తిగా సహకరిస్తామని హెచ్‌సీఏ స్పష్టమైన హామీ ఇచ్చింది. దీంతో వివాదాలన్నీ ముగిశాయని హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్.దేవరాజ్ నేతృత్వంలో జరిగిన చర్చల్లో ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్ పాల్గొని వివాదానికి ముగింపు పలికారు.

ఉదయమే రంగంలోకి విజిలెన్స్..

హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ మధ్య వివాదంపై విచారణ జరపాలన్న సీఎం రేవంత్ ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఉదయమే రంగంలోకి దిగారు. విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ రూరల్ విభాగం విజిలెన్స్ అధికారులు అదనపు ఎస్పీ పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ఉప్పల్‌లోని క్రికెట్ స్టేడియానికి వెళ్లారు. అక్కడి హెచ్‌సీఏ కార్యాలయంలో విచారణ జరిపారు. హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ మధ్య జరిగిన ఒప్పందాలేంటి? వారి మధ్య చోటుచేసుకున్న ఈ-మెయిల్ సంభాషణలేంటి? కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల విషయంలో ఏం జరిగింది? అనే విషయాలపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. సీఎస్ఆర్ నిధుల కింద రూ.10 కోట్లను స్టేడియం అభివృద్ధికి ఇస్తామన్న ఎస్ఆర్‌హెచ్.. ఆ నిధులను ఇవ్వకుండా స్టేడియానికి రంగులు వేయించడానికి ఖర్చు చేసినట్లు చెబుతోందని హెచ్‌సీఏ ప్రతినిధులు ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతోపాటు కాంప్లిమెంటరీ పాసుల విషయంలో వచ్చిన ఆరోపణలపైనా విజిలెన్స్ బృందం విచారణ జరిపింది. ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు సంబంధించి సీటింగ్ కెపాసిటీలో పది శాతం వాటా ప్రకారం 3900 పాసులను హెచ్‌సీఏకు ఇచ్చేందుకు తాము అంగీకరించగా.. మరో 3900 పాసులు కావాలంటూ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు కోరినట్లు ఎస్ఆర్‌హెచ్ చెబుతుండడం తెలిసిందే. అయితే వాటిని డబ్బులిచ్చి కొంటామని చెప్పినట్లు హెచ్‌సీఏ పేర్కొంది.

సీసీ ఫుటేజీ కోసం ఆరా..

కాంప్లిమెంటరీ పాసులు దుర్వినియోగమయ్యే అవకాశమున్నందున.. హెచ్‌సీఏ ఖాతా నుంచి నిధులు చెల్లిస్తే మరో వెయ్యి పాసులు ఇస్తామని తమ ప్రతినిధులు చెప్పినట్లు, దీంతో వారిపై జగన్మోహన్‌రావు స్టేడియంలోనే దూషణలకు దిగినట్లు ఎస్ఆర్‌హెచ్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో విచారణలో భాగంగా ఈ ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజీ కోసం విజిలెన్స్ అధికారులు ప్రయత్నించారు. మరోవైపు ఎస్ఆర్‌హెచ్ నుంచి తాను అడిగినన్ని టికెట్లు అందకపోవడంతో ఇటీవల జరిగిన మ్యాచ్ సందర్భంగా వీవీఐపీలు కూర్చునే ఎఫ్3 బాక్స్‌కు జగన్మోహన్‌రావు తాళం వేయించారని, తాము బతిమలాడి 2వేల పాస్‌లు ఇస్తేనే తాళాలు తెరిచారని ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు ఆరోపించారు. దీంతో ఈ అంశంపైనా అధికారులు విచారణ జరిపారు. మ్యాచ్ రోజు ఎఫ్-3 బాక్స్‌కు తాళం వేశారా? ఆరోపణలు నిజమేనా? అనే కోణంలో విచారణ చేశారు. అయితే సాయంత్రానికి ఇరువర్గాలు రాజీకి రావడంతో వివాదం సద్దుమణిగింది. దీంతో, ఈ విషయంలో జోక్యం చేసుకొని సమస్య పరిష్కారమయ్యేలా చేశారంటూ సీఎం రేవంత్‌రెడ్డికి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదిని అనుమతించాలన్న కేటీఆర్ వ్యాజ్యంపై కౌంటర్ వేస్తాం

- ఫార్ములా ఈ రేస్ కేసులో విదేశీ డాక్యుమెంట్లు రావాల్సి ఉంది: ఏసీబీ



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యేందుకు తనతోపాటు న్యాయవాదిని అనుమతించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి అనుమతించాలని హైకోర్టుకు ఏసీబీ విజ్ఞప్తి చేసింది. ఫార్ములా ఈ రేస్ కేసులో విచారణకు రావాల్సిందిగా కేటీఆర్‌కు ఏసీబీ గతంలో నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే.. విచారణకు తనతోపాటు న్యాయవాదిని అనుమతించాలని కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందుకు అంగీకరించిన హైకోర్టు.. మాటలు వినపడకుండా కనుచూపుమేరలో న్యాయవాది ఉండేలా అనుమతించాలని ఏసీబీకి ఆదేశాలు జారీచేసింది. కేటీఆర్ దాఖలు చేసిన ఈ పిటిషన్ మరోసారి జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఏసీబీ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది బాలమోహన్‌రెడ్డి.. ఈ కేసులో ఇప్పటివరకూ 15 మంది సాక్షులను విచారించామని, విదేశాల నుంచి కొన్ని డాక్యుమెంట్లు రావాల్సి ఉందని, వాటి కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. కేటీఆర్ తరఫున న్యాయవాది ఏ ప్రభాకర్ రావు వాదనలు వినిపించారు. ఏసీబీ కేటీఆర్‌ను మళ్లీ విచారణకు పిలిచే పరిస్థితి ఉన్నందున 'కనుచూపు మేర వరకు న్యాయవాదిని అనుమతించాలి' అని ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అలాగే కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ వాదనను ఏసీబీ తరఫు న్యాయవాది వ్యతిరేకించారు. విచారణకు పిలిచిన రోజు వరకే న్యాయవాదిని అనుమతించాలనే ఆదేశాలు వర్తిస్తాయని.. ఈ మేరకు తాము కౌంటర్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ఏసీబీ కౌంటర్ తర్వాత విచారణ చేపడతామని పేర్కొంటూ విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.

'చెంప దెబ్బలు.. బూతు మాటలు'.. ప్రిన్సిపాల్‌పై ఉన్నతాధికారుల విచారణ

వికారాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా కేంద్రంలో కొత్తగడి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థినులను ప్రిన్సిపాల్ దుర్భాషలాడుతూ చేయి చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. 'చెంప దెబ్బలు.. బూతు మాటలు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆ ఘటన ఎప్పుడు చోటు చేసుకుంది? గతంలో ఇలా జరిగిందా? లేక ఇటీవల చోటు చేసుకున్నదా? అనే విషయమై ఆరా తీసినట్లు తెలిసింది. విద్యార్థినులను బూతులు తిడుతూ చేయి చేసుకున్న ఘటనకు సంబంధించిన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రిన్సిపాల్ వ్యవహరించిన తీరును పలువురు తప్పుబట్టారు. మంగళవారం సెలవు రోజు కావడంతో బుధవారం సంబంధిత అధికారులు కొత్తగడి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను సందర్శించే అవకాశం ఉందని తెలుస్తోంది. తమకు చెప్పకుండా బయటకు వెళ్లిన విద్యార్థినులను దుర్భాషలాడుతూ చెంప దెబ్బలు కొట్టడాన్ని తల్లిదండ్రులు, మేధావి సంఘాల ప్రతినిధులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐదేళ్లుగా 'ఊర్కొండ పేట' నిందితుల ఆగడాలు

- భక్తులను బెదిరించి డబ్బు వసూళ్లు
- లైంగిక దాడి ఘటనపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణ : ఐజీ సత్యనారాయణ

నాగర్‌కర్నూల్/ ఊర్కొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేటలో వివాహితపై సామూహిక లైంగిక దాడి ఘటనతో పలు సంచలన విషయాలు బయటపడ్డాయి. మహిళపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుల ముఠా ఐదేళ్లుగా ఊర్కొండపేటతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆలయాలకు వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని ఆగడాలకు పాల్పడుతున్నారని పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. సూత్రధారి ఊర్కొండపేట ఆలయంలో దినసరి వేతనంపై పని చేస్తున్న మహేశ్ గౌడ్ ప్రధాన సూత్రధారి అని తేల్చారు. బాధితురాలి కేకలు వేయకుండా నోట్లో చేతి రుమాలు కుక్కి.. చేతులు వెనక్కి విరిచి కట్టి నిందితులు దారుణానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కాగా, లైంగికదాడి ఘటన తర్వాత వస్తున్న పలు ఫిర్యాదులపై లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులే నిశ్చేష్టులవుతున్నారు. 400 ఏళ్ల చరిత్ర గల ఊర్కొండపేట ఆంజనేయస్వామి గుడికి తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. అలా గుడికి వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని బ్లాక్ మెయిల్ చేసి డబ్బు వసూలు చేసేవారని విమర్శలు ఉన్నాయి. కొందరి సెల్‌ఫోన్లు లాక్కుని బెదిరించడంతో ఎవరికీ చెప్పుకోలేక బాధితులు జేబులు ఖాళీ చేసుకుని వెళ్లిపోయేవారని తెలుస్తోంది. కాగా, వివాహితపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన నిందితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణ ద్వారా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. వివాహితపై లైంగిక దాడి జరిగిన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. తర్వాత ఐజీ సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శనివారం అర్ధరాత్రి పోలీసులు అప్రమత్తమై ఘటనాస్థలికి చేరుకుని అన్ని ఆధారాలు సేకరించారని చెప్పారు. అక్కడ లభించిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా లోతైన దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: సీతక్క

నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండపేటలో మహిళపై లైంగికదాడి ఘటనలో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పోలీసు అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆమె మంగళవారం మహిళా భద్రతా విభాగం డీజీ శిఖాగోయల్, మహిళాశిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కాంతివెస్లీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు ప్రభుత్వ ఆధీనంలోని సఖి కేంద్రం సంరక్షణలో ఉన్నట్లు తెలిపారు.

పొరుగు సేవల ఉద్యోగుల పరిస్థితేంటో?

సర్కారుకు తలనొప్పిగా మారిన సర్దుబాటు.. 8000 మంది జూనియర్ అసిస్టెంట్ల నియామకం

- ఆ స్థానాల్లోని పొరుగు సేవల ఉద్యోగుల తొలగింపు!
- తమను కొనసాగించాలని కోరుతున్న ఉద్యోగులు



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా ఉద్యోగ నియామకాలు చేపడుతోంది. ఇప్పటి వరకు దాదాపు 58 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసింది. 25 విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టింది. భర్తీ చేసిన ఉద్యోగాల్లో ఉపాధ్యాయులు, అధికారులు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఇలా పలు హోదాలు ఉన్నాయి. కొత్తగా నియామకాలు చేపట్టడంతో ప్రస్తుతం అక్కడ పని చేస్తున్న పొరుగు సేవల (ఔట్‌సోర్సింగ్) ఉద్యోగులను ఏం చేయాలనేది ప్రశ్నార్థకంగా మారింది. తమ విషయంలో కఠినంగా వ్యవహరించవద్దని పొరుగు సేవల ఉద్యోగులు కోరుతుండగా.. రెగ్యులర్ ఉద్యోగులు వచ్చాక కూడా వారెందుకని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులు 66,347 మంది ఉండగా, పొరుగు సేవల ద్వారా 1,14,653 మంది పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 58 వేల మంది కొత్త ఉద్యోగులను నియమించగా.. ఈ ఏడాది కూడా శాఖల వారీగా నియామకాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. గ్రూప్-4 ద్వారా ఎంపికైన 8143 మంది జూనియర్ అసిస్టెంట్ల స్థానంలో పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించనున్నారు. ఇప్పటికే ఎక్సైజ్, పురపాలక, వాణిజ్య పన్నుల శాఖల పరిధిలో జూనియర్ అసిస్టెంట్లను భారీగా నియమించారు. దీంతో ఎక్సైజ్ శాఖలో 100 మందిని, వాణిజ్య పన్నుల శాఖలో 150 మందిని తొలగించారు. పురపాలక శాఖ, రిజిస్ట్రేషన్ శాఖల్లోనూ సర్దుబాటు చేశారు.

ప్రభుత్వ వేతనాలు అందుకుంటున్న ఉద్యోగుల వివరాలు		'బి' కేటగిరీ కింద ఉన్న తాత్కాలిక ఉద్యోగుల వివరాలు	
ప్రభుత్వ ఉద్యోగులు	3,39,778	ఒప్పంద ఉద్యోగులు	66,347
గ్రాంట్ ఇన్ ఎయిడ్		పొరుగు సేవల ఉద్యోగులు	1,14,635
సంస్థల్లో పని చేసేవారు	25,396	మల్టీ పర్పస్ వర్కర్లు(జీపీ)	53,185
విశ్వ విద్యాలయాల్లో	4,681	రోజువారీ వేతనం	8,952
వివిధ ప్రభుత్వ సంస్థల్లో	99,598	గౌరవ వేతనం కింద	2,29,945

● వీరు కాకుండా ప్రభుత్వ పింఛను తీసుకుంటున్న పదవీ విరమణ చేసిన ఉద్యోగులు 2,87,154 మంది ఉన్నారు. ఇటీవల నియమించిన రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య వీరికి అదనం

తమను తొలగించవద్దని వినతి

తెలంగాణ సచివాలయంలో సుమారు 400 మంది పొరుగు సేవల ద్వారా పలు విభాగాల్లో సేవలందిస్తున్నారు. వీరంతా ఇటీవల సమావేశమై తమను ఉద్యోగాల నుంచి తొలగించవద్దని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. పొరుగు సేవల కింద పని చేస్తున్న ఉద్యోగులను తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

వారంతా గౌరవ వేతనం పరిధిలోకే..

రాష్ట్రంలో నిర్దిష్టమైన పే స్కేల్ లేని ఉద్యోగులందరినీ గౌరవ వేతనం కేటగిరీలో చూపుతారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు, మునిసిపల్, పంచాయతీల్లో పనిచేసే కార్మికులు, (గతంలో వీఆర్‌వోలు) ఇలా పలు విభాగాల్లో నిర్దిష్టమైన పే స్కేల్ లేకుండా కొనసాగే ఉద్యోగులందరినీ ప్రభుత్వం గౌరవ వేతనం కింద చూపుతోంది.

అద్దకం పరిశ్రమకు గడ్డుకాలం

సిరిసిల్లలో 270 డైయింగ్ పరిశ్రమల మూసివేత

- తగ్గిన కాటన్ వస్త్ర ఉత్పత్తితో ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- అద్దకం పరిశ్రమకు పోత్సాహకాలు ఇవ్వాలంటున్న యజమానులు



సిరిసిల్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అద్దకం పరిశ్రమ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. మరమగ్గాల పరిశ్రమకు అనుబంధంగా ఉన్న అద్దకం రంగంలోని యూనిట్లు క్రమంగా మూతపడుతుండటంతో కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. కాటన్ వస్త్ర ఉత్పత్తులు పూర్తిగా పడిపోవడంతో అద్దకం పరిశ్రమలు మూతపడుతున్నాయి. ప్రభుత్వం మరమగ్గాల కార్మికులకు భరోసా కల్పించేందుకు పాలిస్టర్ రకం చీరల ఆర్డర్లనే ఇస్తుండటంతో కాటన్ పరిశ్రమ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. సిరిసిల్లను దక్షిణాది రాష్ట్రాల్లో రంగురంగుల పెట్టీకోట్స్ అందించే వస్త్ర పరిశ్రమగా భావిస్తారు. గత పదేళ్లలో ఈ పరిశ్రమ కోలుకోలేని స్థితికి చేరింది. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పరిశ్రమల నుంచి పోటీ ఎదురవడంతోపాటు రంగులు, రసాయనాల ధరలు పెరిగిపోవడంతో అద్దకం కూలి గిట్టుబాటు కాని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ తరుణంలో బతుకమ్మ చీరలతోపాటు పెట్టీకోట్స్ ఇవ్వాలని అద్దకం పరిశ్రమ యజమాన్యం, కార్మికులు కోరినా గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. సిరిసిల్లలో 37 వేల మరమగ్గాలు ఉంటే..వాటిలో 15వేలకుపైగా మరమగ్గాలపై కాటన్, మిగతా మరమగ్గాలపై పాలిస్టర్ బట్ట ఉత్పత్తి జరిగేది. కాటన్ వస్త్ర ఉత్పత్తికి అనుబంధంగా 28 సైజింగ్‌లు, 300కు పైగా అద్దకం (డైయింగ్) యూనిట్లు ఉండేవి. మరమగ్గాల పరిశ్రమలో తరచూ వచ్చే సంక్షోభంతో పాలిస్టర్, కాటన్ వస్త్రోత్పత్తికి విఘాతం కలిగేది. కార్మికుల ఆత్మహత్యలు, పనులులేక పరిశ్రమలు మూతపడేవి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో బతుకమ్మ చీరలు ఇవ్వడం ద్వారా సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించవచ్చని నిర్ణయించింది. ఈ చీరలపై విమర్శలు ఎలా ఉన్నా 2013వరకు ఏటా కోటి చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చి పంపిణీ చేశారు. దీంతో మరమగ్గాలపై కాటన్ ఉత్పత్తులు పూర్తిగా నిలిచిపోయాయి. బతుకమ్మ చీరలకే పరిమితమయ్యాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్వశక్తి సంఘాల మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించి ఆర్డర్లు ఇచ్చింది. చీరలతోపాటు పెట్టీకోట్స్ ఇవ్వాలని.. దీంతో కాటన్ వస్త్ర పరిశ్రమ కూడా నిలదొక్కుకుంటుందని అద్దకం యజమానులు, కార్మికులు కోరినా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అద్దకం పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

గతంలో దాదాపు 15వేల మరమగ్గాలపై నడిచే కాటన్ వస్త్ర ఉత్పత్తి ఇప్పుడు 800 మరమగ్గాలకు తగ్గింది. కాటన్ వస్త్ర ఉత్పత్తులకు అనుబంధంగా మొదలైన 28 సైజింగ్ పరిశ్రమల్లో 14 మూతపడ్డాయి. మరోవైపు కాటన్, రసాయనాల ధరలు పెరగ్గా.. దీనికి అనుగుణంగా మార్కెట్లో బట్ట ఉత్పత్తికి ధర పెరగకపోవడంతో పరిశ్రమ ఇబ్బందులో పడింది. ప్రస్తుతం 10 సైజింగ్ యూనిట్లు నడుస్తున్నా అందులోనూ నెలకు 15 రోజులే కార్మికులకు పని దొరుకుతోంది. 300 డైయింగ్ పరిశ్రమల్లో 270 వరకు మూతపడి 30 నామమాత్రంగా పని చేస్తున్నాయి. నెలలో కేవలం 2 వారాలే కార్మికులకు పని ఉంటోంది. పూర్తి స్థాయిలో పని ఉంటే ఒక కార్మికుడికి నెలకు రూ.15వేల వరకు వచ్చేది. ఇప్పుడు రూ.6 వేలు రావడం గగనంగా మారింది. గతంలో అద్దకం, సైజింగ్ పరిశ్రమపై 5వేల మంది ఉపాధి పొందేవారు. ప్రస్తుతం వెయ్యి మంది వరకు పనులు చేస్తుండగా.. ఆ పనులూ సరిగ్గా దొరకని పరిస్థితి ఉంది. గతంలో సిరిసిల్ల డైయింగ్ పరిశ్రమ నుంచి రంగుల బట్ట దక్షిణాది రాష్ట్రాలకు ఎగుమతయ్యేది. ప్రస్తుతం తమిళనాడు, గుజరాత్‌లలో అద్దకం పరిశ్రమలకు రాయితీలు ఇవ్వడం, రాజస్థాన్‌లోని బలహోత్రాలో ఆధునిక డైయింగ్ యూనిట్లు రావడంతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహం ఉండటంతో సిరిసిల్ల అద్దకం పరిశ్రమకుపోటీ ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అద్దకం పరిశ్రమకు ప్రోత్సాహకాలివ్వాలని కార్మికులు, యజమానులు కోరుతున్నారు.

డెడ్ స్టోరేజీకి జూరాల

- ఉమ్మడి పాలమూరులో తాగు నీటికి ఇబ్బంది
- నారాయణపూర్ నుంచి 1టీఎంసీ విడుదల
- జూరాలకు చేరుకుంది కేవలం 0.4టీఎంసీలే
- శ్రీశైలంలో ప్రస్తుతం ఉన్నది 41టీఎంసీలే


జూరాల ప్రాజెక్టు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూరాల జలాశయం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తాగునీటి అవసరాలకు ఈ ప్రాజెక్టు చాలా కీలకం. ప్రస్తుతం ప్రాజెక్టులో 3.375 టీఎంసీల నీళ్లున్నా అవి బురదతో కూడుకున్నవే. వాటిని తరలించడం సాధ్యం కాదు. ఈ ఏడాది జూరాలకు 1,124 టీఎంసీల వరద వచ్చింది. ఈ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం దాదాపు 12టీఎంసీలు. కానీ, ప్రణాళికా లోపంతో వేసవి ప్రారంభంలో నీటి ఎద్దడి పరిస్థితి వచ్చింది. గతేడాది తాగునీటికి ఇబ్బందులు ఏర్పడటంతో కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 1.90 టీఎంసీల నీటిని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి విడుదల చేయించారు. ఈ ఏడాది కూడా మంత్రి జూపల్లి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు కర్ణాటకకు వెళ్లి సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో మాట్లాడి నారాయణపూర్ నుంచి 4 టీఎంసీల నీటి విడుదలకు ఒప్పించారు. అయితే, నారాయణపూర్ నుంచి ఇప్పటి వరకు 1 టీఎంసీ నీటిని మాత్రమే విడుదల చేశారు. అందులో నది వెంట ఉన్న గుంతలు నిండి ఇక్కడకు వచ్చింది 0.4 టీఎంసీలు మాత్రమే. ఇమరో 3 టీఎంసీలను కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ నుంచి విడుదల చేయాల్సి ఉంది. ఇవి వస్తే తప్ప తాగునీటి అవసరాలు తీరే పరిస్థితి లేదు. మరోవైపు, వేసవి నేపథ్యంలో అధికారులు ఇళ్లకు నీటి సరఫరాను తగ్గిస్తుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 18 మున్సిపాలిటీల్లో రోజూ 130 మెగాలీటర్ల(ఎంఎల్‌డీ) నీళ్ల అవసరం ఉండగా, ప్రస్తుతం 100ఎంఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో రోజూ 30ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా, 25 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతోంది. మరోవైపు, శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ 41టీఎంసీలకు పడిపోయింది. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, దిగువకు రోజూ సుమారు 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండంతో ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా తగ్గిపోతోంది. ఈ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టుకు వరద సమృద్ధిగానే వచ్చినప్పటికీ ప్రణాళికా లోపంతో నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు. నీటి నిల్వలు వేగంగా పడిపోతుండటంతో ప్రాజెక్టు కింది యాసంగి పంటలకు నీరందించడంలో ఇబ్బంది నెలకొంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్వేచ్ఛకు సమాధి

ఏ విలువలను చూసి అమెరికాకు ఆ ప్రతిమను బహూకరించామో, ఇప్పుడు అవి అక్కడ లేవు, ఇక అది కూడా అక్కడ ఉండకూడదు, మా విగ్రహాన్ని మాకు ఇచ్చేయండి అంటూ పక్షంరోజుల క్రితం ఫ్రాన్స్ నాయకుడు ఒకరు అమెరికాలోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ మీద ఓ పదునైన వ్యాఖ్య చేశారు. విదేశీ విద్యార్థుల గెంటివేత విషయంలో ట్రంప్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్న ఈ సందర్భంలో, న్యూయార్క్ నగరంలో ఆకాశాన్ని తాకుతూ కనిపించే ఆ స్వేచ్ఛా ప్రతిమ ట్రంప్ ఏలుబడిలో అక్కడ ఉండటం నిజంగానే సరికాదనిపిస్తోంది. అమెరికా అంటే స్వేచ్ఛ, హక్కులకు పెద్ద దిక్కు అనే నమ్మకం ఇప్పుడు క్రమంగా నశిస్తున్నది. వందలాదిమంది విదేశీ విద్యార్థులమీద ట్రంప్ ఇంత కక్షకట్టడానికి వారు చేసిన తప్పల్లా ఏడాదిన్నరకు పైగా సాగుతున్న ఒక భయానకమైన యుద్ధాన్ని ఆపమనడం, మారణకాండను నిరసించడం. నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉన్నందుకు వీరంతా ట్రంప్ దృష్టిలో దేశద్రోహులైనారు. భావస్వేచ్ఛకు పుట్టినిల్లని అంటున్న చోట ఏకంగా ఉగ్రవాదుల మద్దతుదారులుగా ముద్రపడ్డారు.

తమ రాజ్యాంగం హక్కుల గురించి ఏమంటున్నదో ట్రంప్‌కు అనవసరం. భావస్వేచ్ఛను భంగపరచే చర్యలనూ, చట్టాలనూ అది సహించదన్నదీ ఆయనకు పట్టదు. తొలి విడత పాలనలోనే ఆయన తన నిజ స్వరూపాన్ని చూపించాడు. అధికారం దక్కనందుకు ఏకంగా చట్టసభలమీదకే కార్యకర్తలను ఉసిగొల్పాడు. మలివిడతలో మరింత బలంగా అధికారంలోకి రావడంతో ఏకంగా విశ్వరూపాన్నే ప్రదర్శిస్తున్నాడు. వందలాదిమంది విదేశీ విద్యార్థులను వేకువనే తట్టిలేపి, తట్టాబుట్టా సర్దుకొని దేశం విడిచిపెట్టిపోవాలంటున్నాడు. ఈ విద్యార్థులు ట్రంప్ అభిమానుల మాదిరిగా విధ్వంసాలు ఎరిగినవారు కాదు. రోడ్ల మీదకు వచ్చి దొరికినవాటిని తగలబెట్టిందీ లేదు. మిగతా ప్రపంచం గురించీ, సమాజం గురించీ, మనుషులూ మనుగడ పోరాటాల గురించీ ఎక్కడైతే నేర్చుకుంటున్నారో, అక్కడే వాటి పరిరక్షణకోసం వారు నినదించారు. గాజా ఘోరకలిని ప్రశ్నించడం, ఆకలిదప్పికలతో అల్లాడుతున్న లక్షలాది మందిని రక్షించమంటూ ఎత్తైన ఆ విశ్వవిద్యాలయాల గోడలలోపల ఘోషించడం తిరుగుబాటు ఎలా అవుతుందో తెలియదు. మానవహక్కుల గురించి మాట్లాడటమే ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడంగా, విద్యార్థుల నిరసనలను హమాస్ అనుకూల, యూదు వ్యతిరేకత చర్యలుగా నిర్వచించి, శిక్షించడంలో ట్రంప్ వ్యూహం సుస్పష్టం.

యూనివర్సిటీల్లో సుదీర్ఘకాలం సాగిన ఈ ఉద్యమాలు, అంతవరకూ నిర్లజ్జగా ఇజ్రాయెల్ కొమ్ముకాస్తున్న అమెరికా ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడవేసి, కాస్తంత తగ్గేట్టు చేశాయి. మరింత శక్తిమంతమైన ఆయుధాలను సమకూరుస్తూ మారణకాండకు సహకరిస్తున్న అమెరికా పాలకులు ఈ ఉద్యమం కారణంగా ఇజ్రాయెల్‌ను నాలుగు మాటలు అనవలసి వచ్చింది, మానవతాసాయం గురించి మాట్లాడవలసి వచ్చింది. యూనివర్సిటీలు సైతం తమ నడవడికను, గతకాలపు విలువలను తడిమిచూసుకోవలసి వచ్చింది. యుద్ధాలు ఆపిన చరిత్ర విద్యార్థులకు ఉన్నదనీ, వియత్నాంలో తమ ప్రభువులను కాలువెనక్కుతీసుకొనేట్టు చేసిన ఘనులు వారని ట్రంప్‌కు తెలుసు. కాల్పుల విరమణను నీరుగార్చి, గాజాను ఖాళీచేయించే క్రమంలో నెతన్యాహూతో కలసి తిరిగి మారణకాండను అమలుచేస్తున్న ట్రంప్‌కు స్వదేశంలో ఒక్క అసమ్మతిస్వరం ఉన్నా మళ్ళీ నిప్పురాజుకొనే ప్రమాదం ఉన్నదని తెలుసు.

ఒక హంతకుడినో, ఉగ్రవాదినో వెతుకుతున్న, వేటాడుతున్న భాష ఈ విదేశీవిద్యార్థుల విషయంలో వాడుతున్నారు. కృత్రిమమేధతో సామాజిక మాధ్యమాలను జల్లెడపట్టి, కలుగులో దాక్కున్నవారిని వెతికిపట్టి మరీ దేశంనుంచి గెంటేస్తారట. విద్యార్థులకు వివరణలు ఇచ్చుకొనే అవకాశం లేదు, సమాధానం చెప్పుకొనే చోటూ లేదు. కేవలం ఓ ఆరోపణ, ఒకే ఒక్క ఈమెయిల్ సందేశంతో దేశ బహిష్కరణ జరిగిపోతోంది. ఉదారవాదాలు, ఉన్నతాశయాలు వెనక్కుపోయిన అగ్రరాజ్య దురహంకారమిది. వీసాలు రద్దయినంతమాత్రాన విద్యార్థులు వెనక్కుపోనవసరం లేదని, యూనివర్సిటీల దయాదాక్షిణ్యాలున్నంతవరకూ ఉండవచ్చునని కొందరు భరోసా ఇస్తున్నారు. కానీ, అమెరికా తన ఆదర్శాలను అటకెక్కించేస్తూ, విలువలకు, విజ్ఞానానికీ నెలవుగా ఉండాల్సిన విద్యాలయాలు మిలటరీ క్యాంపులుగా మారుతున్నప్పుడు ఉండికూడా ప్రయోజనమేమిటన్నది ప్రశ్న.

దక్షిణాదిన బీజేపీ విస్తరణ ఎలా సాధ్యం?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్


హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో ఒక స్తబ్దత ఏర్పడింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు చాలా యాంత్రికంగా జరుగుతున్నాయి. మీడియా గ్యాలరీలు దాదాపు ఖాళీగా ఉండగా, ఉభయ సభల్లో కూడా సీట్లు చాలా సందర్భాల్లో ఖాళీగా కనపడుతున్నాయి. సభ్యులు మొక్కుబడిగా చర్చల్లో పాల్గొంటున్నారు. రకరకాల అంశాలపై ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడం, అడపాదడపా సభలు వాయిదాపడడం కూడా పెద్దగా వార్తల్లోకి ఎక్కడం లేదు. ప్రతిపక్షాలు బలహీనమైతే పార్లమెంట్ ఎలా నడుస్తుందో చెప్పేందుకు ప్రస్తుత సమావేశాలే నిదర్శనం. 'పార్లమెంట్‌లో రాజకీయాలే జరగడం లేదు. మమ్మల్ని కూడా రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించకుండా రాష్ట్ర సమస్యల గురించి పట్టించుకోవాలని మా నాయకుడు చంద్రబాబునాయుడు కోరారు' అని తెలుగుదేశం నేత ఒకరు చెప్పారు. మోదీకి కూడా పార్లమెంట్ సమావేశాలపై పెద్దగా ఆసక్తి ఉన్నట్లు కనపడడం లేదు. తన భావి అజెండాను ఎలా వేగంగా పూర్తి చేయాలా అన్న ఆలోచనతోనే ఆయన ఉన్నారు.

పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగానే మధ్యలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ కేంద్రకార్యాలయానికి వెళ్లడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది. మోదీ సంఘ్ కార్యాలయానికి వెళ్లడం, సంఘ్ వ్యవస్థాపకులు హెగ్డేవార్, గోల్వాల్కర్‌లకు నివాళులు అర్పించడం ఒక కీలక సంకేతంగా భావించవచ్చు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాగపూర్‌లోని సంఘ్ కార్యాలయానికి, దేశ రాజధానిలోని ప్రధానమంత్రి కార్యాలయానికి మధ్య గతంలో ఎన్నడూ లేనంతగా సయోధ్య ఏర్పడిందనడంలో సందేహం లేదు. గతంలో వాజపేయి హయాంలో కూడా నాగపూర్‌కు, ఢిల్లీకి మధ్య సయోధ్య ఏర్పర్చేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి అంతగా సఫలీకృతం కాలేదు. ఈ విషయం నాడు ఉప ప్రధానిగా ఉన్న లాల్ కృష్ణ ఆడ్వాణీ స్వయంగా అంగీకరించారు. 'సంఘ్ సోదర కూటమిలో తమ స్వంత సైద్ధాంతిక మిత్ర పక్షాల ఆందోళనను, అభిప్రాయాలను సరైన విధంగా పట్టించుకోలేకపోయామని, వారు ప్రధానంగా మాకు మద్దతునిస్తున్నందువల్ల ఎలాగూ మాతోనే కలిసి ఉంటారులే అన్న ఆత్మవిశ్వాసంతో ఉండిపోయామని, అదే తమ ఓటమికి ఒక కారణమైందని' ఆడ్వాణీ తన ఆత్మకథలో రాసుకున్నారు. సంఘ్‌తో నిత్యసంబంధాలు ఏర్పర్చుకోవడం, సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య ఐక్యత సాధించేందుకు ప్రయత్నించడం వల్లే మోదీ విజయవంతం కాగలుగుతున్నారని చెప్పక తప్పదు. సిద్ధాంతానికీ ఆచరణకు మధ్య ఐక్యత సాధించడంలో విఫలమైనందువల్లే ఈ దేశంలో వామపక్షాలతో సహా అనేక రాజకీయ పార్టీలు విఫలమవుతున్నాయి.

నిజానికి మోదీ సంధి దశలో ఉన్నారు. వచ్చే సెప్టెంబర్ నాటికి ఆయనకు 75 ఏళ్లు పూర్తవుతాయి. అయితే సంఘ్ లోను, కొందరు బీజేపీ పెద్దల విషయంలోనూ అనుసరించిన నిబంధన మోదీకి వర్తించదని ఇప్పటికే స్పష్టమైంది. అందుకు కారణం మోదీ ప్రధానిగా మరి కొన్నేళ్లు కొనసాగాల్సిన అవశ్యకతను సంఘ్, సంఘ్ ప్రాధాన్యతను మోదీ ఇప్పటికే గుర్తించినట్లు కనిపిస్తోంది. ప్రతి రోజూ దేశ వ్యాప్తంగా 83,129 శాఖలను నిర్వహిస్తున్నామని, వారానికి లక్షా 15వేలకు పైగా మిలన్‌లు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తరించడంపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించామని ఇటీవల జరిగిన సంఘ్ సర్వప్రతినిధి సభ తర్వాత సహ కార్యవాహ్ ముకుంద్ మీడియాకు తెలిపారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే ప్రతి ఏడాదీ లక్షలమంది యువకులు సంఘ్‌లో చేరుతున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఇటీవల జరిగిన 4,415 ప్రారంభ శిక్షణా శిబిరాల్లో 2,22,962 మంది హాజర్యారని, వీరిలో 1,63,000ల మంది 14–25 సంవత్సరాల వయసు మధ్య ఉన్నవారేనని ఆయన చెప్పారు. ఇంతటి కీలక ప్రభావం ఉన్న సంఘ్ బీజేపీకి అండగా ఉండడమే ఆ పార్టీకి బలం అని మోదీకి తెలుసు. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి కేవలం 240 సీట్లు మాత్రమే లభించిన తర్వాత మహారాష్ట్ర, హరియాణాలో సంఘ్ బలంగా పనిచేసి మళ్లీ మోదీ నిలదొక్కుకునేందుకు కావల్సిన బలాన్ని అందించిందని బీజేపీ నేతలే చెబుతున్నారు.

అందువల్ల మోదీ అసంపూర్తిగా ఉన్న తన అజెండాను అమలు చేసేందుకు ఆయనకు సంఘ్ బలం తప్పనిసరి. ఈ క్రమంలో ఆయన సంఘ్ అజెండాను కూడా పూర్తి చేయవలిసి ఉంటుంది. అనుకున్న విధంగా వక్ఫ్ బిల్లు ఆమోదానికి ఆయన రంగం సిద్ధం చేశారు. జమిలి ఎన్నికలకు కూడా ఆయన రాజకీయ పార్టీలను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. రానున్న ఏడాది కాలంలో బిహార్, అస్సాం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో మెజారిటీ రాష్ట్రాల్లో గెలవడం బీజేపీకి ఒక అగ్నిపరీక్ష లాంటిది. ముఖ్యంగా దక్షిణాదిన బీజేపీ విస్తరించడం అంత సులభం కాదు.

అయితే కేవలం సంఘ్ అండదండలు ఉన్నంత మాత్రాన బీజేపీ విజయాలు సాధించగలుగుతుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి సంఘ్ బలంగా ఉండడం వేరు, బీజేపీ బలంగా ఉండడం వేరు అన్న విషయం రెండు సంస్థలకూ తెలియనిది కాదు సంఘ్ అత్యంత బలంగా ఉన్న కర్ణాటకను ఒకప్పుడు బీజేపీ దక్షిణాది ద్వారంగా ఆ పార్టీ నేతలు అభివర్ణించారు. కాని క్రమంగా ఆ ద్వారం మూసుకుపోతున్నట్లు కనపడుతోంది. దేశమంతటా హిందూత్వ ప్రయోగం విజయవంతం అవుతున్నట్లు కనపడుతున్నప్పటికీ కర్ణాటకలో మాత్రం ఈ ప్రయోగం లింగాయత్‌ల అదుపులో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అక్కడ పార్టీలో ఉన్న అంతర్గత పోరాటాన్ని అధిష్ఠానం అరికట్టలేకపోతోంది. నేతలు ఒకరిపై మరొకరు మీడియాకెక్కుతున్నారు. యడ్యూరప్పను, ఆయన కుమారుడు విజయేంద్రను మచ్చిక చేసుకునేందుకు ఇటీవల బలమైన ఎమ్మెల్యేను బసనగౌడ పాటిల్ యత్నాల్‌ను పార్టీ నుంచే బహిష్కరించారు. బీజేపీకి కర్ణాటకలో భవిష్యత్ లేదని త్వరలో ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని యత్నాల్ ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అప్రతిష్ఠపాలు చేసేందుకు ముడా కుంభకోణాన్ని లేవనెత్తి, ఈడీని ప్రయోగించినా బీజేపీ విజయవంతం కాలేకపోయింది. విచిత్రమేమంటే సంఘ్ హేమాహేమీలు దత్తాత్రేయ హోసబలె, సిఆర్ ముకుంద్, ప్రస్తుతం జాతీయ స్థాయిలో సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంతోష్, హెచ్‌వి శేషాద్రి, పద్మనాభాచార్య తదితరులు ఆ రాష్ట్రానికి చెందినవారే. ఒకప్పటి సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ కూడా మైసూరుకు చెందినవారే. నిజానికి మహారాష్ట్ర తర్వాత అత్యధిక సంఖ్యలో అగ్రశ్రేణి సంఘ్ నేతలు కర్ణాటక నుంచే వచ్చారు. కాని అదే కర్ణాటకలో ఇప్పుడు బీజేపీ రాజకీయ భవిష్యత్తు డోలాయమాన పరిస్థితిలో ఉన్నది. సంతోష్ జీ వల్లే దక్షిణాదిలో బీజేపీ దెబ్బతిన్నదని విమర్శలు చేసేవారు కూడా ఉన్నారు. తమిళనాడులో ఐపీఎస్ అధికారి అన్నామలైను ప్రవేశపెట్టి ఓట్ బ్యాంకును పెంచుకునేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో మళ్లీ అన్నాడీఎంకెపై ఆధారపడవలసిన స్థితి ఏర్పడింది. కేరళలో కూడా ఆర్ఎస్ఎస్ బలంగా ఉన్నా బీజేపీ కొంత ఓటు శాతాన్ని పెంచుకోవడం తప్ప అసాధారణమైన విజయాలేమీ సాధించలేదు.



రాజకీయాల్లో ప్రత్యర్థులను బలహీనపరచడం వల్లనో, భావోద్వేగాలను సృష్టించడం వల్లనో లభించే విజయాలు తాత్కాలికమే అవుతాయి. మనను నడిపిస్తున్న లక్ష్యాలు ఏమిటి? రాజకీయాల్లో మనం ఎందుకు ప్రవేశించాం? ఆదర్శాలు, విశ్వాసాల కన్నా వ్యక్తులకు ప్రాధాన్యమిస్తున్నామా అన్న ప్రశ్నలు వేసుకుని ముందుకు సాగాలి. లేనిపక్షంలో విజయాలు వైఫల్యాలుగా మారేందుకు ఎంతో కాలం పట్టదు. కాంగ్రెస్ అదే పరిస్థితిని ఎదుర్కొన్న విషయం తెలియనిది కాదు.

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే నెల్లూరులో ఆర్ఎస్ఎస్ తొలి శాఖ 1947లోనే ఏర్పడింది. 1948లో విజయవాడలో ఆర్ఎస్ఎస్ అతి పెద్ద సభను నిర్వహించింది. 1950లలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన తొలి ఓటీసీ నెల్లూరులో జరిగింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన దేశ్‌పాండే, బాపురావు మోఘే, బందిష్టే, గోపాల్‌రావు టాగోర్‌తో పాటు కరెడ్ల సత్యనారాయణ, భండారు సదాశివరావు, సోమెపల్లి సోమయ్య లాంటి వారు సంఘ్‌ను ఏపీలో నిర్మించారు. గుంటూరులో శాఖకు హాజరైన వారిలో మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీరామారావు, భవనం వెంకటరామ్, సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వేంకటేశ్వరరావు లాంటి వారున్నారని ఒక ఆర్ఎస్ఎస్ నేత తన ఆత్మకథలో రాశారు. నిజానికి హైదరాబాద్ స్టేట్‌లో ఆర్యసమాజ్ మూలంగా ఆర్ఎస్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉండేది. 1947లోనే గోల్వాల్కర్ హైదరాబాద్‌కు రహస్యంగా వచ్చారు. 1949లో శ్రీరాం సాఠే ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను ప్రారంభించారు. నృపతుంగ, కేశవ మెమోరియల్ లాంటి విద్యాసంస్థలను సంఘ్ అభిమానులను ప్రారంభించారు. నక్సల్బరీ ఉద్యమానికి పోటీగా 1967లోనే ఏబీవీపి ఏర్పడింది. తొలి ఏబీవీపి విద్యార్థి సదస్సు 1967 జూలైలో జరిగింది. 1968లో అఖిల భారత ఏబీవీపి సదస్సు జరిగినప్పుడు సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తర్వాత క్రమేణా ఏబీవీపీ తెలంగాణలోని అనేక కాలేజీల్లో బలపడింది. అయినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ భావజాలం బలంగా ఉండడం వల్ల జనసంఘ్ ఉనికి ఏర్పర్చుకోలేకపోయింది. తర్వాతికాలంలో తెలుగుదేశం బలమైన ప్రాంతీయ పార్టీగా ఏర్పడడంతో బీజేపీ నిలదొక్కుకోలేకపోయింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో సంఘ్ పరివార్, బీజేపీ పుంజుకునేందుకు వాతావరణం ఏర్పడినప్పటికీ, టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆ పార్టీకి బలమైన ప్రతిబంధకాలుగా మారాయి. ఇప్పటికీ తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తేగల నాయకత్వాన్ని ఆ పార్టీ ఏర్పర్చుకోలేకపోతోంది. రాజకీయాల్లో ప్రత్యర్థులను బలహీనపరచడంవల్లనో, భావోద్వేగాలను సృష్టించడంవల్లనో లభించే విజయాలు ఎప్పటికైనా తాత్కాలికమవుతాయి. మనను నడిపిస్తున్న లక్ష్యాలేమిటి? రాజకీయాల్లో మనం ఎందుకు ప్రవేశించాం, ఆదర్శాలు, విశ్వాసాల కన్నా వ్యక్తులకు మనం ప్రాధాన్యత కల్పిస్తున్నామా అన్న ప్రశ్నలు వేసుకుని ముందుకు సాగకపోతే విజయాలు వైఫల్యాలుగా మారేందుకు ఎంతో కాలం పట్టదు. కాంగ్రెస్ అదే పరిస్థితిని ఎదుర్కొన్న విషయం తెలియనిది కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

మన విద్యార్థులను 'ఏఐ'కు సిద్ధం చేయాలి!

కృత్రిమ మేధస్సును (ఏఐ) ప్రాథమిక, మాధ్యమిక విద్యలో ప్రవేశపెట్టడం నేటి ఆధునిక బోధనా విధానాలలో కీలక అవసరం. దేశాలు తమ విద్యార్థులను ఏఐ ఆధారిత భవిష్యత్తుకై సిద్ధం చేయడానికి పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు ప్రత్యేకమైన విధానాలను, అమలు వ్యూహాలను అభివృద్ధి చేశాయి.

చైనా ఏఐ విద్యలో ముందంజలో ఉంది. మూడవ తరగతి నుంచే తప్పనిసరి ఏఐ పాఠ్య ప్రణాళికను ప్రవేశపెట్టడం చైనా ప్రత్యేకత. విద్యార్థులకు మెషీన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, స్పీచ్ రికగ్నిషన్ వంటి అంశాలను పరిచయం చేస్తూ ప్రత్యేక పాఠ్య పుస్తకాలను రూపొందించారు. టెక్నాలజీ కంపెనీల సహకారంతో ఏఐ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేశారు. వీటి ద్వారా చిన్న పిల్లలకు క్లిష్టమైన ఏఐ అంశాలను అర్థమయ్యేలా బోధిస్తున్నారు. ఏఐ ఆధారిత స్మార్ట్ తరగతి గదులను కూడా అభివృద్ధి చేశారు. దక్షిణ కొరియా ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటేషనల్ థింకింగ్‌పై ఎక్కువ శ్రద్ధతో సాధారణ విషయాలలోకి ఏఐ అక్షరాస్యతను ప్రవేశపెట్టడం ద్వారా సమగ్ర విద్యా విధానాన్ని రూపొందించింది. సింగపూర్ మాధ్యమిక స్థాయిలో ఏఐ విద్యను నిర్మాణాత్మకంగా అమలు చేసింది. ఏఐ అక్షరాస్యత, ప్రోగ్రామ్, కోడ్ ఫర్ ఫన్ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రయోగిక అనుభవాన్ని అందిస్తున్నాయి. ఉపాధ్యాయ శిక్షణ, పరిశ్రమ భాగస్వామ్యం ద్వారా ఏఐ విద్యను సమర్థంగా బోధించేలా చర్యలు తీసుకున్నారు. అమెరికా రాష్ట్రాల వారీగా ఏఐ విద్యను అమలు చేస్తోంది. స్థానిక అవసరాలకు అనుగుణంగా ఏఐ విద్యా కార్యక్రమాలను రూపొందించింది. స్టెమ్ విధానం, నైతిక ఏఐ వినియోగంపై అమెరికా శ్రద్ధచూపుతోంది. గూగుల్, ఐబీఎం వాట్సన్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రైవేటు రంగ సంస్థలు ఏఐ విద్యా కార్యక్రమాలను అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

భారతదేశంలో ఏఐ విద్యా ప్రణాళికను దశల వారీగా అమలు చేయడం సమర్థవంతమైన మార్గంగా భావించాలి. ప్రాథమిక స్థాయిలో (1–3 తరగతులు) విద్యార్థులకు ఏఐ పరిచయం చేసే విధానం పునాది స్థాయిలో ఉండాలి. పిల్లలకు ఆకర్షణీయమైన అభ్యాస (ప్రాక్టికల్) విధానాల ద్వారా కంప్యూటేషనల్ థింకింగ్‌ను పరిచయం చేయాలి. విజువల్ ప్రోగ్రామింగ్ టూల్స్, రోబోట్-ఆధారిత విద్య ద్వారా ప్రాథమిక ప్రోగ్రామింగ్, లాజికల్ థింకింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి. ఉన్నత ప్రాథమిక విద్య (4–6 తరగతులు)లో విద్యార్థులకు సరైన పాఠ్య ప్రణాళిక, ప్రాక్టికల్ ఉదాహరణలు, సరళమైన మెషిన్ లెర్నింగ్ ప్రాజెక్టుల ద్వారా మౌలిక ఏఐ భావనలను బోధించాలి. చిన్న చిన్న మెషీన్ లెర్నింగ్ ప్రాజెక్టులు, ఇంటరాక్టివ్, సూపర్‌వైజ్డ్ లెర్నింగ్ ప్రయోగాల ద్వారా మరింత లోతుకు తీసుకువెళ్లాలి. ఏఐ నైతికత గురించి అవగాహన పెంచాలి. మాధ్యమిక స్థాయిలో (7–9 తరగతులు) గణనీయమైన మార్పులు తీసుకురావాలి. విద్యార్థులు పైథాన్ వంటి భాషలను నేర్చుకోవాలి. డేటా విశ్లేషణ, మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ప్రాక్టికల్ ప్రాజెక్టుల ద్వారా అధ్యయనం చేయాలి. ఈ దశలో ఏఐ సామాజిక ప్రభావంపై అవగాహన పెంచాలి. 10–12 తరగతులు ఏఐ విద్యకు మరింత ప్రాముఖ్యతను తెచ్చే దశ. అధునాతన ప్రోగ్రామింగ్, పరిశ్రమ సహకార ప్రాజెక్టులు ఇందులో భాగం కావాలి. విద్యార్థులు ఏఐ అభివృద్ధి వినియోగంపై నైతిక అవగాహన పెంచుకునేలా చర్యలు తీసుకోవాలి.



మన జాతి భవిష్యత్తు భావితరాలకు అందించే విద్యపై ఆధారపడి ఉంది. ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలవడానికి విద్యలో ఏఐ చేర్చడం లాంటి సంస్కరణలను చేపట్టడం తక్షణావసరం.

ఏఐ విద్యా ప్రణాళిక విజయవంతంగా అమలవ్వాలంటే తగిన మౌలిక సదుపాయాలు ఉండాలి. దీనిలో అధిక వేగం గల ఇంటర్నెట్, కంప్యూటింగ్ పరికరాలు, ఏఐ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, స్మార్ట్ తరగతి గదులు ముఖ్యమైనవి. ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలి. వారి శిక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయాలి. పరిశ్రమ మెంటర్ల సహకారం విద్యార్థులకు ఉపయుక్తం.

సాంప్రదాయ పాఠ్య ప్రణాళికలో ఏఐను సమర్థంగా అనుసంధానించాలి. గణితంలో స్టాటిస్టికల్ కాన్సెప్ట్స్, సైన్స్‌లో డేటా అనాలిసిస్, భాషా పాఠాలలో సహజ పద్ధతిలో నేర్చుకునే (ఎన్ఎల్‌పీ) అంశాలు ఉండాలి. ఏఐ నైతికత, సంఘంపై ప్రభావాన్ని సామాజిక శాస్త్రాల బోధనలో భాగం చేయాలి. విద్యార్థుల పురోగతిని మూల్యాంకనం చేయడానికి ప్రాజెక్ట్-ఆధారిత, నిరంతర మూల్యాంకన విధానాలను అనుసరించాలి.

భారతదేశం ఏఐ విద్యను విజయవంతంగా అమలు చేయాలంటే అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను గణనలోకి తీసుకొని, స్థానిక విద్యా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికను రూపొందించాలి. మన జాతి భవిష్యత్తు మనం భావితరాలకు అందించే విద్యపై ఆధారపడి ఉంది. ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలవడానికి విద్యలో ఏఐ చేర్చడం లాంటి సంస్కరణలను వెంటనే చేపట్టడం ఇప్పుడు తక్షణావసరం.

● ప్రొఫెసర్ ఎన్. శివప్రసాద్
విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ మద్రాసు

ఏదీ నాటి ఆటల సంస్కృతి?

గ్రామాల్లోనూ పట్టణాల్లోనూ అందరూ కలిసి గుంపులుగా ఆటలు ఆడుకునేవారు. కబడ్డీ, తొక్కుడు బిల్లా, దాగుడుమూతలు ఇలా ఎన్నో ఆటలు ఆడుకునేవారు. ఆటలు కేవలం వినోదాన్ని మాత్రమే కాదు మానసిక చురుకుదనం, జట్టు స్ఫూర్తిని ఇస్తాయి. స్నేహ సంబంధాలు పెంపొందిస్తాయి. నేడు సాంకేతిక విప్లవం ప్రవేశించడం వలన పిల్లల ఆటలు కూడా హరించుకుపోయాయి. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్, కంప్యూటర్ వాళ్ల చేతిలోకి వచ్చాయి. ఇవన్నీ కూడా పిల్లలు ఇంటిపట్టునే ఉండి చూడడం వల్ల శారీరక శ్రమ తగ్గిపోయింది. దీంతో పిల్లల్లో స్థూలకాయం, కంటి సమస్య, మానసిక ఒత్తిడి వంటి ఆరోగ్య సమస్యలు మొదలవుతున్నాయి. జట్టుగా కలిసి ఆటను ఆడలేకపోవడం వల్ల స్నేహ సంబంధాలు సహనం వంటి మంచి సుగుణాలు కోల్పోతున్నారు. కనుమరుగవుతున్న ఈ ఆటల ప్రాముఖ్యతను, వాటి సంస్కృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత. తల్లి దండ్రులు పిల్లలను బయట ఆడుకోవడానికి ప్రోత్సహించాలి. పాఠశాలలు కూడా విద్యార్థులకు ఆటల పిరియడు ఆట స్థలాలను అభివృద్ధి చేయాలి కనుమరుగవుతున్న ఆటలను గురించి అవగాహన కల్పించాలి.

– సయ్యద్ షఫీ

విద్యార్థుల భూమిపైకి బుల్డోజర్లా!

తొలిదశ తెలంగాణ ఉద్యమంలో ఇక్కడి ప్రజల హృదయాలను అర్థం చేసుకున్న ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రాంతీయ అసమానతలను తగ్గించేందుకు 1973లో ప్రత్యేక చట్టాలు, రాజ్యాంగ సవరణ ద్వారా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్థాపనకు అనుమతి ఇస్తూ 2300 ఎకరాలు కేటాయించారు. అప్పటి నుంచి ఆ భూమి హెచ్‌సీయూ పరిధిలోనే ఉంటూ వస్తుంది. అయితే ఆ భూమి కేటాయింపు, విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం అజమాయిషీ చెలాయిస్తూ వచ్చింది. వివిధ ప్రభుత్వ సంస్థలకు, రీసెర్చ్ సెంటర్లకు హెచ్‌సీయూ భూములను కేటాయించింది. 2004లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడల అభివృద్ధి కోసం ఐఎమ్‌జీ అకాడమిస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 400 ఎకరాలను కేటాయించారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆ కేటాయింపులను రద్దు చేసి ఆ భూమిని తిరిగి యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చర్ డిపార్టుమెంట్‌కు కేటాయించారు. ఈ కేటాయింపులపై ఐఎమ్‌జీ సంస్థ కోర్టుకు ఎక్కింది. సుదీర్ఘకాలం కేసు కొనసాగి 2024లో ప్రభుత్వానికి అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆ భూమిని తిరిగి హెచ్‌సీయూకి ఇవ్వాలి. కానీ ఇప్పుడు ప్రభుత్వం కేసు మేమే గెలిచాం కాబట్టి మా ఇష్టం వచ్చినట్లు వేలం వేసుకుని అమ్ముకుంటాం అంటున్నది. 1973 నుంచి హెచ్‌సీయూ పరిధిలో ఉన్న భూమి రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా 2004 నుంచి ఒక్కసారిగా పాలకుల చేతుల్లోకి వెళ్ళింది. ఇప్పుడు ఈ 400 ఎకరాల భూమిని ముఖ్యమంత్రి ఇష్టానుసారం కార్పొరేట్ శక్తులకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు.

టీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆనాటి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తుందనీ, అవుటర్ రింగ్ రోడ్‌ను కార్పొరేట్లకు లీజుకిచ్చిందని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు రేవంత్ రెడ్డి. ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యం అంటూ అధికారంలోకి వచ్చి ఆ ఇందిరమ్మ ఇచ్చిన భూమినే కార్పొరేట్ శక్తులకు బహిరంగ మార్కెట్లో అమ్ముతానని ప్రకటించటం దారుణ విషయం. ఇది రాష్ట్ర ప్రభుత్వం సమిష్టిగా తీసుకున్న నిర్ణయంగా ఎక్కడా కనిపించడం లేదు. రేవంత్‌రెడ్డి సొంత నిర్ణయమేనని స్పష్టమవుతుంది. ముఖ్యమంత్రి, మంత్రులు ఎంతసేపు 2004లో ప్రైవేట్ వ్యక్తుల చేతులలోకి వెళ్ళిపోయిన భూమిని ఇప్పుడు కేసు గెలిచి ప్రభుత్వం దక్కించుకుందీ అంటున్నారే గాని 1973 నుంచి 2004 వరకు అవి హెచ్‌సీయూ భూములేనని మర్చిపోతున్నారు.



1973 నుంచి హెచ్‌సీయూ పరిధిలో ఉన్న భూమి రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా 2004 నుంచి ఒక్కసారిగా పాలకుల చేతుల్లోకి వెళ్ళింది. ఇప్పుడు ఈ 400 ఎకరాల భూమిని ముఖ్యమంత్రి కార్పొరేట్ శక్తులకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ అధికారంలోకి వచ్చి ఆ ఇందిరమ్మ ఇచ్చిన భూమినే బహిరంగ మార్కెట్లో అమ్ముతానని ప్రకటించటం దారుణమైన విషయం.

గతంలో టీఎన్జీవోలకు ఇచ్చిన భూములు కూడా అక్రమంగా హెచ్‌సీయూ నుంచి లాక్కున్నవే వంద ఎకరాలకు పైగా భూమిని ఎన్జీవోల పేరుతో ప్రముఖ నాయకులంతా పంచుకొని తమకు నచ్చిన వారికి కేటాయించుకొని వందల కోట్ల రూపాయలు పోగేసుకున్నారు. అదే ఎన్జీవో కాలనీకి రోడ్డు పేరుతో హెచ్‌సీయూ నుంచి శాశ్వతంగా విభజించుకున్నారు. ఎక్కువమంది ఇతర రాష్ట్రాల విద్యార్థులే ఉండడంతో అడిగేవారు లేరని, విద్యార్థులు కొంతమంది రోడ్డుపైకి వచ్చినా తేలికగా అణచివేయవచ్చునన్న ధోరణితో మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం కన్ను ఇక్కడి భూములపై పడింది. ఇప్పుడు తీసుకోవాలనుకుంటున్న భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం బహిరంగ వేలం వేసి అమ్ముతామంటూ ఏ మాత్రం బేషజం లేకుండా ప్రకటించడం ప్రభుత్వం దివాలాకోరుతనానికి నిదర్శనం. వివాదాస్పదమైన 400 ఎకరాల భూమిలో అనేక వృక్షజాతులు, జీవ వైవిధ్యం కలిగిన, అరుదైన రాళ్ళు, చెరువులు ఉన్నాయి.

తెలంగాణలో ప్రశ్నించే మేధావులందరికీ తలో పదవీ కట్టబెట్టి వాళ్ళ నోళ్లు మూయించింది ప్రభుత్వం. అశాశ్వతమైన పదవుల కోసం శాశ్వతమైన వ్యవస్థను పణంగా పెట్టిన మేధావి వర్గం తెలంగాణకు జరుగుతున్న తీవ్ర అన్యాయాన్ని ఆపేందుకు ముందుకు వస్తుందో రాదో వేచిచూడాలి. తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేస్తామన్న రాజకీయ పార్టీలకు ఓట్ల రాజకీయాలు ముఖ్యం తప్ప ప్రజా ప్రయోజనం కోసం కాదని మరోసారి తేటతెల్లం అవుతున్నది. గతంలో కేసీఆర్ కూడా ఓయూ భూములు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం కేటాయిస్తాం అనగానే ఓయూ ఒక్కసారిగా భగ్గుమన్నది. తెలంగాణ సమాజం మొత్తం ఒక్క తాటిపైకి వచ్చి కేసీఆర్ నియంతృత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడి ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చేసింది. ఇప్పుడు ఆ ఐక్యత తెలంగాణ సమాజంలో ఎక్కడా కనిపించడం లేదు. హెచ్‌సీయూ అంటే అది తెలంగాణకు సంబంధం లేదన్నట్టుగా కొన్ని రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయి.

రాజకీయంగా కేసీఆర్ కంటే దారుణంగా రేవంత్ వ్యవహరిస్తున్నాడు. విద్యార్థుల పైన కేసులు పెట్టి, లాఠీచార్జి చేయించి మహిళలను కూడా విచక్షణరహితంగా ఈడ్చుకు వెళ్ళి అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు. భూమికోసం ఉద్యమించటం కోర్టు ధిక్కరణ అని ముఖ్యమంత్రి, మంత్రులు పదేపదే ప్రకటన చేసి విద్యార్థులను భయపెడుతున్నారు. ఇప్పటికే కోర్టు తీర్పు వచ్చినందున, ఈ విషయం ఇక కోర్టులో లేనందున విద్యార్థులు ప్రభుత్వంపై కొట్లాడుతున్నారు. మరోపక్క యూనివర్సిటీ అధికార యంత్రాంగం పూర్తిగా ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గినట్టు కనిపిస్తున్నది. అందుకే వేలమంది పోలీసులను, బుల్డోజర్లను, జేసీబీలను లోపలికి అనుమతించి దగ్గరుండి పనులు చేయిస్తున్నది.

రేవంత్‌రెడ్డికి పాలన కోసం ఆదాయం వచ్చే మార్గాలు కనిపించడం లేదు కాబోలు. భవిష్యత్ తరాల విద్యా వనరులని, సమాజహితం కోసం కేటాయించిన ప్రభుత్వ భూముల్ని అమ్ముతున్నారు. విద్యార్థుల వెనక స్థిరాస్తి వ్యాపారులు, రాజకీయ నాయకులు ఉండి ఇదంతా నడిపిస్తున్నారు అని స్వయంగా స్థిరాస్తి వ్యాపారిగా జీవితం ప్రారంభించిన రేవంత్ రెడ్డి విమర్శ చేయడం సరైంది కాదు. ఈ 400 ఎకరాల్లో ఒక్క అంగుళం కూడా హెచ్‌సీయూది కాదని వాదిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు 2004 కంటే ముందు ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉందో సమాధానం చెప్పాలి.

2007లో ప్రభుత్వ ఆస్తి, సంరక్షణ (తిరిగి స్వీకరించటం) చట్టం ప్రకారం యూనివర్సిటీలో 80శాతం భూమి వినియోగం లేకుండా ఉందని భావించి ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ధారాదత్తం చేయవచ్చని చేస్తున్న వాదన విడ్డూరం. విద్యాసంస్థల భూమిని విద్యాసంస్థల విస్తరణ కోసం వాడటం కోసం ఇప్పటివరకు చూశాం కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం, కార్పొరేట్ల కోసం విద్యాలయ భూములను లాక్కొంటున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది. ఇందిరమ్మ ఇచ్చిన భూమిని ఇందిరమ్మ రాజ్యమే కబళించాలని చూడటం ఇక్కడ కొసమెరుపు.

అసలైన కాంగ్రెస్ భావజాలం గల ఎమ్మెల్యేలు కూడా ఈ విషయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకొని తొలి తెలంగాణ ఉద్యమానికి ప్రతీక అయిన హెచ్‌సీయూ భూమిని యథాతథంగా ఉంచి నిజాయితీని, నిబద్ధతను చాటుకోవాలి.

■ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

కష్టకాలంలోనూ సైనిక దాడులా?

పెను భూకంపం ధాటికి మయన్మార్ (బర్మా) కకావికలమైంది. రెండు వేల మందికి పైగా మరణించినట్లు, మూడు వేల మంది క్షతగాత్రులైనట్టు లెక్క తేలినా, ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అమెరికా అంచనాల ప్రకారం విగత జీవుల సంఖ్య కొన్ని వేలల్లో ఉండొచ్చు. అక్కడి రెండు పెద్ద నగరాలు కూలిన భవనాలు, నిర్మాణాలతో మట్టి దిబ్బలుగా మారినట్లు ఛాయాచిత్రాలు చెప్తున్నాయి. వెంటనే అక్కడ సహాయక చర్యలు అందించడానికి భారత్ ముందుకురావడం, 139 టన్నుల సహాయక సామగ్రి, పలు సహాయక బృందాలు, విపత్తు నిర్వహణా టీములు వెంటనే పనిలోకి దిగడం అభినందనీయం. అయితే ఇలాంటి విషాద సమయంలో కూడా అక్కడి సైనిక పాలకులు విపక్షీయులపై ఆయుధ దాడులు ఆపకపోవడం బాధాకరం. స్వంత దేశం కష్టాల్లో ఉన్నప్పుడు తమ శక్తిమేర సహాయక చర్యలు చేపట్టకుండా, సైనిక దాడులు చెయ్యడం వారికే చెల్లు. ఆ దేశం భూకంపాలకు నెలవు. అలాంటప్పుడు భూకంపాలకు తట్టుకునేలా, తక్కువ నష్టం కలిగించేలా నిర్మాణాలు ఉండాలి. జపాన్ తరహాలో నిబంధనల మేరకు నిర్మాణాలు జరిగితే వైపరీత్యాల వేళ తక్కువ ప్రాణ, ఆస్తి నష్టం ఉంటుంది. ఆ దేశంతో సహా, మిగతా దేశాలకు ఈ భూకంపం కనువిప్పు కలిగించాలి. ప్రకృతి వైపరీత్యం జరగకుండా ఎవరూ ఆపలేరు. కానీ, దాని నుంచి తక్కువ నష్టం కలిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవచ్చు. మయన్మార్‌కి వచ్చిన కష్టం బాధాకరం. వారి కన్నీరు తుడుస్తూనే, మనం కళ్లు తెరుద్దాం.

– డి.వి.జి. శంకరరావు



నేటి బాల్యం.. సాహిత్యానికి దూరం!

- సాంకేతిక, కార్పొరేట్ విద్యాలయాల్లో పిల్లలు
- నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

7

రజతోత్సవ సభపై బీఆర్ఎస్ ఫోకస్



ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో రజతోత్సవ సభపై సమీక్షిస్తున్న కేసీఆర్

- ఏర్పాట్లు, జనసమీకరణపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో కేసీఆర్ సమీక్ష
- విభేదాలు పక్కన పెట్టి.. సభ సక్సెస్ అయ్యేలా చూడాలని సూచన
- ప్రతీ నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని ఆదేశం
- ఏర్పాట్ల వివరాలను అధినేతకు తెలిపిన నేతలు
- 154 ఎకరాల్లో సభాప్రాంగణం, 1,059 ఎకరాల్లో పార్కింగ్
- 10లక్షల మజ్జిగ ప్యాకెట్లు, మరో 10లక్షల వాటర్ బాటిళ్ల ఏర్పాటు
- సుమారు 5లక్షలకు పైగా జనసమీకరణ చేయాలని నిర్ణయం

వరంగల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్టీ రజతోత్సవం నేపథ్యంలో ఈనెల 27న నిర్వహించబోయే సభపై బీఆర్ఎస్ అధినాయకత్వం ఫోకస్ పెట్టింది. మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సభ నిర్వహణ, ఏర్పాట్లు, జనసమీకరణ తదితర అంశాలపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు సమీక్షించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద సభ ఏర్పాట్లపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్ కేసీఆర్‌కు వివరించారు. ఎల్కతుర్తి వద్ద 1,213 ఎకరాల స్థలాన్ని గుర్తించి, రైతుల నుంచి ఎన్‌వోసీలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో 154 ఎకరాల్లో సభ నిర్వహించటం జరుగుతుందన్నారు. అలాగే మిగిలిన 1,059ఎకరాల్లో పార్కింగ్ కోసం కేటాయించామని, సుమారు 50వేలకు పైగా వాహనాలను ఇందులో పార్క్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే సభకు వచ్చే ప్రజల కోసం 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లను, మరో 10లక్షల వాటర్ బాటిళ్లను సిద్ధం చేస్తున్నామని వారు పేర్కొన్నారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా 1,500మంది వలంటీర్లను నియమించామని తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. తెలంగాణ ఉద్యమ

మిగతా 7వ పేజీలో...



హస్తం నేతల.. నారాజ్!

రేవంత్ జట్టులో ఓరుగల్లుకు మూడో బెర్త్‌పై సన్నగిల్లిన ఆశలు

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఓరుగల్లు ఎమ్మెల్యేలు నారాజ్‌లో ఉన్నట్టు సమాచారం. కేబినెట్‌లో అవకాశం దక్కుతుందన్న ఆశతో ఉన్న వారికి చేదు అనుభవం తప్పేలా లేదు. ఢిల్లీ వెళ్లి లాబీయింగ్ చేసినప్పటికి మంత్రి పదవి దక్కే అవకాశం లేకపోవటంతో ఆశావాహులు నిరాశలో మునిగారు. ప్రధానంగా రెడ్డి సామాజికవర్గ ఎమ్మెల్యేలు మంత్రి పదవిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు మహిళలు మంత్రులుగా ఉండగా, మరొకరు విప్‌గా బాధ్యత నిర్వహిస్తున్నారు. వారంతా రిజర్వుడు కోటాలోనే పదవులు పొందగా.. ఓసీ కోటాలో ఒక్కరికి కూడా పదవులు ఇవ్వకపోవటంపై అధిష్ఠానం వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వంలో ఎంతో కీలకమైన చీఫ్‌విప్ పదవిని వరంగల్ నేతల్లో ఒకరికి ఇచ్చేందుకు అధిష్ఠానం అంగీకరించిందని సమాచారం. ఈ క్రమంలో కేబినెట్ విస్తరణ ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఎలాంటి అలజడులకు కారణమవుతుందోనన్న చర్చ జరుగుతోంది.

- ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్యే మాధవరెడ్డికి అమాత్య అవకాశం అనుమానమే
- మంత్రి పదవి కోసం అధిష్ఠానంపై రెడ్డి సామాజిక వర్గం తీవ్ర ఒత్తిడి
- నలుగురున్నా ఒక్కరికీ ఇవ్వడం లేదంటూ అసంతృప్తి
- ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ముగ్గురికి ఎలా ఇచ్చారంటూ ప్రశ్నలు
- పలు పరిణామాల నేపథ్యంలో పార్టీ పెద్దలు 'చీఫ్ విప్' హామీ ఇచ్చినట్టు సమాచారం
- రాములమ్మకు అవకాశాలూ అంతంతే..
- మంత్రివర్గ విస్తరణపై ఉమ్మడి జిల్లా శ్రేణుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సీఎం రేవంత్‌రెడ్డి రెండోసారి తన మంత్రివర్గాన్ని విస్తరిస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేల్లో ఆశలు చిగురించాయి. మంత్రి వర్గ విస్తరణలో తనకో బెర్తు దక్కుతుందనే ఆశతో ఎవరికి వారు తమ గాడ్‌ఫాదర్ల చుట్టూ చక్కర్లు కొట్టారు. అయితే కుల సమీకరణలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రివర్గంలో వరంగల్‌కు చోటు దక్కడం కష్టమనే సంకేతాలు వెలువడుతున్నాయి. దాంతో పలువురు నేతలు పెట్టుకున్న ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఏప్రిల్3వ తేదీ గురువారం మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారవడంతో ఆశావాహ ఎమ్మెల్యేలు, వారి అనుచరుల్లో ఉత్కంఠగా పెరుగుతోంది. ప్రధానంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ నేతలను కలిసి పార్టీ పట్ల తనకున్న విధేయతను గుర్తించాలని కోరారు. 2014లో నర్సంపేట నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచినప్పటికి, బీఆర్ఎస్ నేతల ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్‌లో కొనసాగానని, తనకు మంత్రిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా దొంతికి మద్దతుగా నిలిచారు. అయితే ఆరుగురిని మంత్రివర్గంలోకి తీసుకుంటుండగా, రెడ్డి సామాజిక వర్గం వారిలో నల్లగొండ నుంచి రాజగోపాల్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డికి అవకాశం ఇచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరో రెడ్డికి అవకాశం దక్కుతుందా.. ఒకవేళ దక్కినా వరంగల్ జిల్లాకు చెందిన కొండా సురేఖ మంత్రిగా ఉండగా, ఇదే జిల్లా నుంచి దొంతి మాధవరెడ్డికి మంత్రి బెర్త్ దక్కుతుందా అనేది ఉత్కంఠగా మారింది. ఇక ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికైనా సినీనటి విజయశాంతి పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. వరంగల్‌కు చెందిన విజయశాంతికి మంత్రివర్గంలో సీటు దక్కితే రెండో బీసీ మహిళ మంత్రి అయ్యేవారు. అయితే

మిగతా 7వ పేజీలో...

మంత్రి పదవి కోసం రెడ్డి ఎమ్మెల్యేల పట్టు..

ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు మంత్రి పదవి ఇచ్చే విషయంలో అధిష్ఠానం వ్యవహరిస్తున్న తీరుపై కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఇప్పటికే వరంగల్‌కు రెండు మంత్రి పదవులు ఇచ్చామని, మూడో మంత్రి పదవి ఎలా ఇస్తారని అధిష్ఠానం పెద్దలు వరంగల్ ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్నారని సమాచారం. అయితే వరంగల్ కంటే అన్నిరంగాల్లో చిన్న జిల్లాలైనా ఖమ్మం నుంచి ముగ్గురికి, నల్గొండ నుంచి ముగ్గురికి ఎలా మంత్రివర్గంలో స్థానం కల్పించారని.. ఉమ్మడిఓరుగల్లుకు చెందిన ఆశావాహులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ నుంచి కూడా మూడో వ్యక్తికి.. అది కూడా రెడ్డి సామాజిక వర్గం ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. బీసీ, ఎస్టీ మహిళకు మంత్రులుగా, ఎస్టీ సామాజిక వర్గం నుంచి డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్‌కు విప్‌గా పదవులు ఇచ్చారని, రెడ్డి సామాజిక వర్గం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పటికి ఒక్కరికి కూడా పదవి ఇవ్వకపోతే ఎలా అని కొందరు అధిష్ఠానం వద్ద తమ వాణిని బలంగా వినిపించారని తెలిసింది. ఒక్క నల్లగొండ జిల్లా నుంచే ముగ్గురు రెడ్డి సామాజిక వర్గ నేతలకు మంత్రి పదవులు ఇస్తే.. వరంగల్‌కు చెందిన రెడ్డి ఎమ్మెల్యేలకు ఇవ్వరా అని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడినట్లుగా తెలిసింది.

రౌడీషీటర్ల ఇళ్లను సందర్శిస్తూ ఉండాలి

- సైబర్ నేరస్థుల మూలాలను కనిపెట్టాలి
- నేరాల నియంత్రణకు పెట్రోలింగ్ నిర్వహించాలి
- పోలీస్ స్టేషన్ల సందర్శనలో సీపీ సన్‌ప్రీత్ సింగ్

హనుమకొండ సీఐ సతీష్‌తో మాట్లాడుతున్న సీపీ



వరంగల్ క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ల ఇళ్లను సందర్శిస్తూ వారి స్థితిగతులపై ఎప్పటికప్పుడు ఆరా తీయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ డివిజన్ పరిధిలోని సుబేదారి, హనుమకొండ, కేయూసీ పోలీస్‌స్టేషన్‌లతోపాటు హనుమకొండ ట్రాఫిక్, సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ పోలీస్‌స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలను సీపీ సంబంధిత స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి? స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్లు ఉన్నాయి? సెక్టార్ వారీగా ఎస్ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులు.. వారి స్థితిగతులను సంబంధిత సెక్టార్ ఎస్ఐని అడిగితెలుసుకున్నారు. అంతేకాక స్టేషన్‌వారీగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతోపాటు వారు విధులు నిర్వహించే సమయాలను సీపీ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ప్రతీ స్టేషన్ అధికారి ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే కాకుండా సైబర్ నేరస్థుల మూలాలను కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలన్నారు. ట్రైసిటీ పరిధిలో గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణ కోసం నిరంతరం పనిచేయాలన్నారు. నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకోసం నగరంలో నిరంతరం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్‌లు సతీష్, సత్యనారాయణ, రవికుమార్, సీతారెడ్డి, సువర్ణతోపాటు స్టేషన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

జోరుగా సన్న బియ్యం పంపిణీ

- హనుమకొండ జిల్లాలోని రేషన్ షాపుల్లో సందడి
- వివిధ కారణాలతో కొన్నిచోట్ల నిలిచిన సరఫరా
- ఆయా షాపుల్లో నేటి నుంచి పంపిణీ
- ఉదయం నుంచే బారులు తీరిన లబ్ధిదారులు
- రద్దీ రీత్యా పలు షాపుల వద్ద పోలీసులు



రెడ్డికాలనీలో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెల్ల రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ హనుమకొండ జిల్లాలో జోరుగా ప్రారంభమైంది. ఉగాది కానుకగా ప్రభుత్వం నిరుపేదలకు ఈ పథకాన్ని ఆరంభించింది. మంగళవారం హనుమకొండ జిల్లాలోని రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ జరిగింది. రేషన్ షాపుల వద్ద ఉదయం నుంచే లబ్ధిదారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రారంభోత్సవ కార్యక్రమాలతో సందడి నెలకొంది. హనుమకొండ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేటలో ఎమ్మెల్యే నాగరాజు, ఐనవోలులో టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కొన్ని చోట్ల నిలిచిన పంపిణీ

హనుమకొండ జిల్లాలో మొత్తంగా తెల్ల రేషన్‌కార్డుదారులు 2,28,373 మంది ఉన్నారు. ఇందుకు అవసరమైన 4262.749 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ కానుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 414 రేషన్ షాపులు ఉన్నాయి. అయితే వీటిల్లో 18 షాపుల వరకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. వేలిముద్ర మిషన్లు, వెయింగ్ మిషన్లు ఇతరత్రా సాంకేతికపరమైన కారణాల వల్ల పంపిణీ జరగలేదు. ఈ షాపుల మినహా మిగతా అన్నిచోట్ల జిల్లా వ్యాప్తంగా సన్న బియ్యం సక్రమంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. బియ్యం పంపిణీ నిలిచిన షాపుల్లో బుధవారం నుంచి పంపిణీ ఉంటుందని చెబుతున్నారు.

బారులు తీరిన లబ్ధిదారులు


సన్న బియ్యం పంపిణీ క్రమంలో రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరారు. ఉదయం 7గంటల నుంచే షాపుల వద్దకు చేరుకున్నారు. లబ్ధిదారుల్లో అత్యధిక శాతం మహిళలే బియ్యం కోసం వచ్చారు. ఈ పరిణామంతో గతంలో ఎన్నడూ లేని రీతిలో రేషన్ షాపుల వద్ద ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు లబ్ధిదారుల కోలాహలం నెలకొంది. లబ్ధిదారుల తాకిడి ఉండడంతో బియ్యం పంపిణీలో జాప్యం నెలకొనడం, ఎండ వేడిమితో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కార్డుదారులు ఆగ్రహానికి గురయ్యారు. స్వలంగా తోపులాటలు జరిగాయి. ఈ పరిస్థితుల రిత్యా పోలీసులు పంపిణీ ముగిసే వరకు షాపుల వద్దే ఉన్నారు. ఇక భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకులు జిల్లాలోని పలు చోట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సన్న బియ్యం పంపిణీ జరుగుతున్న క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలను రేషన్‌షాపుల వద్ద ప్రదర్శించలేదని, దీనిపై ప్రచారం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు.

దేశంలోనే తొలి సారి : ఎమ్మెల్యే నాయిని

తెల్ల రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో చేపట్టినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. హనుమకొండ రెడ్డికాలనీ, గోకుల్‌నగర్, కాజీపేట సోమిడి ప్రాంతాల్లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెడ్డికాలనీలో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యం పంపిణీ చేపట్టిందన్నారు. సన్న బియ్యం పథకం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆగం చేస్తున్న.. ఆటిజం

- ప్రతీ 20 మంది చిన్నారుల్లో ఒకరికి సమస్య
- పిల్లలను సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లకు దూరంగా ఉంచాలి
- బయటకు కనిపించే మానసిక వ్యాధి
- ముందుగా పసిగడితే మంచిది



7

జవాబు ప్రకటన

తేది: 28-03-2025 రోజున ఆంధ్రజ్యోతి దినపత్రికలో శ్రీ దిడిగం భిక్షపతి, అడ్వకేట్ గారి ద్వారా వారి క్లయింట్ అయిన వి.శ్రీదేవి, భర్త: చంద్రమోహన్ గారి ప్రకటనకు ఈ జవాబు ప్రకటన నా క్లయింట్లు అయిన 1)కొక్కిరాల రవీందర్‌రావు, తండ్రి: నర్సింగరావు, 2) శ్రీ అయిత రవి, తండ్రి: సంపత్‌కుమార్ గార్ల సూచన మేరకు ఇవ్వడం జరుగుచున్నది. సదరు వి.శ్రీదేవి, భర్త: చంద్రమోహన్ గారు 1) శ్రీ చుంచు రవీందర్, తండ్రి: లింగయ్య, 2)చుంచు రాజేశ్వరి, భర్త: రవీందర్, 3)చుంచు కృష్ణప్రసన్న, తండ్రి: రవీందర్ మరియు 4)చుంచు హరిప్రసన్, తండ్రి: రవీందర్ గారల వద్ద నుండి వ్యవసాయ భూమి మరియు అందులో ఉన్న మినీ ఫంక్షన్ హాల్ ఇల్లును కొనుగోలు చేయుటకు గాను బయానాగా కొన్ని డబ్బులు చెల్లించి అగ్రిమెంటు చేసుకున్నారని ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయమని వారి అడ్వకేట్ ద్వారా తేది: 28-03-2025 రోజున ఆంధ్రజ్యోతి దినపత్రికలో బహిరంగ ప్రకటన ఇచ్చినారు. కానీ నా మొదటి క్లయింటు అయిన కొక్కిరాల రవీందర్‌రావు, తండ్రి: నర్సింగరావు గారికి చుంచు హరిప్రసన్, తండ్రి: రవీందర్ గారు దేవన్నపేట గ్రామము హసన్‌పర్తి మండలం హనుమకొండ జిల్లాలో గల దేవన్నపేట గ్రామం రెవెన్యూ శివారులో గల సర్వే నెం.277/సి/1/1లో ఎ: 0-10 గుంటల భూమిని అమ్ముతానని తేది: 09-08-2021 రోజున అగ్రిమెంట్ చేసి బయానాగా రూ.18,00,000/- (అక్షరాల పద్దెనిమిది లక్షల రూపాయలు) తీసుకోవడం జరిగినది. కానీ రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకొని తిరుగుతూ, మోసపూరితంగా చుంచు రాజేష్, తండ్రి: బసవయ్య అనే వ్యక్తికి తేది: 24-01-2024 రోజున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. దీనికి గాను సదరు నా క్లయింటు అయిన కొక్కిరాల రవీందర్‌రావు గారు చుంచు హరిప్రసన్ మరియు చుంచు రాజేష్‌కు లీగల్ నోటీసు ఇవ్వటం జరిగింది. లీగల్ నోటీసును తీసుకొని చుంచు రాజేష్ గారు జవాబు కూడా ఇవ్వటం జరిగింది. మరియు నా రెండవ క్లయింటు అయిన అయిత రవి తండ్రి:సంపత్‌కుమార్ వద్ద చుంచు హరిప్రసన్ గారు తేది:16-01-2023 రోజున రూ. 10,00,000/- (అక్షరాల పది లక్షల రూపాయలు) అప్పుగా తీసుకున్నాడు. దానికి గాను ప్రామిసరీ నోటు అదే రోజు వ్రాసి ఇవ్వడం జరిగినది. దీనికి అతని అన్న అయిన చుంచు కృష్ణప్రసన్న గ్యారంటరుగా సంతకం చేయడం జరిగినది. దీనికి గాను గ్యారంటర్‌గా ఉన్న చుంచు కృష్ణప్రసన్న గారి ఒరిజినల్ గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ తేది:11-05-2023, డాక్యుమెంట్ నెం.589/2023ని కుదువ పెట్టడం జరిగినది. ఈ డబ్బులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుంటే నా క్లయింటు అయిన అయిత రవి గారు సదరు చుంచు హరిప్రసన్‌కు మరియు చుంచు కృష్ణప్రసన్న గారికి తేది: 02-12-2024 రోజున లీగల్ నోటీసు ఇవ్వడం జరిగినది. లీగల్ నోటీసు చుంచు కృష్ణప్రసన్న గారు తీసుకోవటం జరిగినది. కానీ జవాబు మాత్రం ఇవ్వలేదు.

పై విషయాన్ని దాచిపెట్టి సదరు చుంచు హరిప్రసన్ గారు స్థానిక రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు 13 మందిపై ఐ.పి. నెం. 6/2024 దాఖలు చేయడం జరిగినది. ఇందులో నా క్లయింట్లు అయిన శ్రీ కొక్కిరాల రవీందర్‌రావు గారిని ప్రతివాది నెం.4గా మరియు అయిత రవి గారిని ప్రతివాది నెం.9గా చేర్చడం జరిగినది. మా క్లయింట్లు నోటీసులు తీసుకొని అడ్వకేటు ద్వారా వాకాలత్ ఫైలు చేయడం జరిగినది. సదరు ఐ.పి. పెండింగ్‌లో ఉంది. సదరు ఐ.పి.లో సర్వే నెం. 292/డి లో ఎకరం0-06 గుంటలు భూమి దేవన్నపేట గ్రామంలో ఉంది అని చూపటం జరిగినది. దాని విలువ రూ.100,00,000/-లుగా పేర్కొనటం జరిగినది. ఈ విషయాన్ని చుంచు హరిప్రసన్, చుంచు కృష్ణప్రసన్న గారి తండ్రి గారైన చుంచు రవీందర్ గారికి తెలుసు. చుంచు హరిప్రసన్ ఉన్న ఆస్తులను దాచిపెట్టి కోర్టును కూడా తప్పుదారి పట్టించి ఐపీ దాఖలు చేసి కోర్టును మోసంచేయటం జరిగింది.

ఇట్టి పై విషయాన్ని మీ వద్ద దాచి మీ క్లయింటు అయిన వి.శ్రీదేవి మరియు మిమ్ములను తప్పుదారి పట్టించి మోసపూరితంగా ఈ తప్పుడు ప్రకటన ఇప్పించడం జరిగినది. కావున బయానాగా చెల్లించిన తమ డబ్బులు వాపసు తీసుకోవాల్సిందిగా మీ ద్వారా మీ క్లయింటును కోరడమైనది. లేనియెడల మేము తీసుకోబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురని ఈ జవాబు ప్రకటనద్వారా తెలియజేయడమైనది.

సం/- జువ్వాడి నర్సింగరావు, అడ్వకేట్, ఇ.నెం.1-9-911, పోస్టల్ కాలనీ, హనుమకొండ జిల్లా, సెల్: 9440653790.

ఉపాధి కూలీలకు శుభవార్త

పెరిగిన కూలీ డబ్బులు.. ఈ నెల నుంచే అమలు ● రూ.300 నుంచి రూ.307 చేస్తూ కేంద్రం నిర్ణయం



వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం స్వల్పంగా వేతనం పెంచింది. ప్రస్తుతం రూ.300 ఇస్తుండగా మరో రూ.7 పెంచింది. రూ.307 చొప్పున ఏప్రిల్ నెల నుంచే అమలు చేయాలని నిర్ణయించింది. యేటా ఏప్రిల్ మాసంలో ఉపాధి కూలీని ప్రభుత్వం పెంచుతోంది. గత సంవత్సరం రూ.28 పెంచగా, ఈసారి రూ.7మాత్రమే పెంచి కూలీలను నిరాశపరిచింది. దీంతోపాటు ఉపాధిహామీ పథకం అమలులో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా మార్చడంతోపాటు పనిదినాలను పర్యవేక్షిస్తోంది. కూలీలసంఖ్య ఆధారంగా పనిదినాల లక్ష్యాన్ని పెంచి పనులు కల్పిస్తోంది. వ్యవసాయ పనులు దొరకని సమయంలో ఉపాధిహామీ పనులకు వెళ్లేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది.

పెరగనున్న కూలీల సంఖ్య

వరంగల్ జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ ఆధారిత పనులు పూర్తి కావొచ్చాయి. దీంతో రైతులతోపాటు వ్యవసాయ కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు. అయితే రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా పథకం అమలు చేయనుండటంతో కూలీల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. దీంతో రెండు నెలలపాటు ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగనున్నాయి. కూలీలందరికీ వందరోజుల పని కల్పించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి అందుకు అనుగుణంగా బడ్జెట్‌ను సైతం కేటాయించారు. ప్రతీ గ్రామంలో కనీసం 75 నుంచి 100 మంది ఉపాధిహామీ పనులకు వెళ్లేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కూలీలకు వేతనం పెంచిన ప్రభుత్వం.. ఈ యేడు కూడా వేసవి భత్యాన్ని విడుదల చేయలేదు. రెండేళ్లుగా వేసవి భత్యం చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలు నిరాశకు లోనవుతున్నారు.

పని ప్రదేశంలో వసతులు కల్పిస్తే మేలు

ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రతీరోజు ఉద యం 7 గంటల నుంచి 11గంటల వరకు రోజుకు నాలు గు గంటల చొప్పున కూలీలు పని చేస్తున్నారు. వారికి తాగునీటి వసతితో పాటు నీడ కోసం టెంట్ సౌకర్యం కల్పించాల్సి ఉండగా పంచాయతీ కార్యదర్శులు అవేమీ కల్పించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పని ప్రదేశంలో వసతులు కల్పిస్తే కూలీల సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

భద్రకాళి అమ్మవారికి కరవీర పుష్పార్చన

మూడో రోజుకు నవరాత్రోత్సవాలు



భద్రకాళి అమ్మవారికి లక్ష కరవీర పుష్పాలు, గులాబీ రంగు గన్నేరు పూలతో అర్చన చేస్తున్న అర్చకులు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న వసంత నవరాత్రి మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా మంగళవారంకు ఉదయం సుప్రభాత సేవ, అర్చనాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గులాబీ రంగు గన్నేరు పూలు, కరవీర పుష్పాలు కలిపి లక్ష పుష్పాలతో అమ్మవారికి అర్చన చేశారు. కార్యక్రమంలో ఈవో శేష భారతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సావనీర్లతో పూర్వ విద్యార్థులు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్ రోడ్ సమీపంలోని సంతోష్‌నగర్‌లో 1979-80లో జనగామ జిల్లా కూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ మామిడాల సుధాకర్ మాట్లాడుతూ.. 45 ఏళ్ల కిందట చదువుకున్న విద్యార్థులు కలుసుకొని మంచిచెడ్డలు చెప్పుకుంటూ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలన్నారు. ఇటీవల గోల్డెన్ జూబ్లీ పూర్తి చేసుకున్న కూనూరు ఉన్నత పాఠశాల అలుమిని అసోసియేషన్ ఛైర్మన్ ట్రాన్స్‌కో ఎకౌంట్స్ అధికారి నాగమళ్ల అశోక్ మాట్లాడుతూ.. గత డిసెంబరులో కూనూరు పాఠశాలలో నిర్వహించిన గోల్డెన్‌జూబ్లీ వేడుకల సంగమం పూర్వ విద్యార్థుల సమ్మేళనాల్లోనే ఓ మైలు రాయి అని అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక 300 పేజీల సావనీర్‌ను కమిటీ ఛైర్మన్ టి.నరేందర్ ప్రతీ ఒక్కరికి అందజేశారు. జనగామ రిటైర్డ్ ఎంఈవో వంగాల రాజేందర్ పూర్వ విద్యార్థులచే ప్రత్యేక యోగా చేయించారు. వరంగల్‌లో ప్రముఖ పండితులు తాండ్ర వెంకటకృష్ణ, డాక్టర్ వెంకటరామ్‌నర్సయ్య, లలిత, కోమల, డి.పూర్ణచందర్, సుభద్ర, చిన్న కోమల, హరిప్రసాద్, గురువు, అజయ్ కుమార్ తదితర ఆ బ్యాచ్‌కు చెందిన 40 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శరవేగంగా పైపులైన్ లీకేజీ పనులు

ధర్మసాగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లీకైన దేవాదుల పైపులైన్ పనులను శరవేగంగా చేపడుతున్నారు. మంగళవారం ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద లీకైన ఫేస్ త్రీ పైపులైన్‌ను ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సీతారామ్, డీఈ రాజు, ఏఈ శ్రీనివాస్ సందర్శించారు. ఉదయం నుంచి పైపులైన్ మరమ్మతు పనుల వద్ద ఉండి సంబంధిత కాంట్రాక్టర్‌తో రెండు 75 హెచ్‌పీల సామర్థ్యం గల మోటార్లను తెప్పించారు. పైపులైన్‌లో నుంచి బయటికి వస్తున్న నీటిని నిరంతరంగా తోడుతున్నారు. దీంతో పైపులైన్‌లోని నీటిని మంగళవారం రాత్రి వరకు పూర్తిస్థాయిలో బయటికి తీసే అవకాశం ఉంది. బుధవారం వరకు ఫేస్ త్రీ మరమ్మతు పనులు పూర్తిచేసి పంపింగ్‌ను అధికారులు కొనసాగించే అవకాశం ఉంది.



ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద లీకైన ఫేస్ త్రీ పైపులైన్ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

హెచ్‌సీయూ భూములపై కేయూలో రగడ

- సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం
- అడ్డుకున్న పోలీసులు.. విద్యార్థులతో తోపులాట



వర్సిటీలో బైఠాయించి నిరసన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు బైరపాక ప్రశాంత్, నరసింహరావు, వెంకట్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అమ్ముచూపిన భూములపై కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్వీ, పీడీఎస్‌యూ, స్వేరో స్టూడెంట్ యూనియన్, ఏఐఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, డీఎస్‌పీ, ఎస్ఎస్‌యూ, బీఎస్‌యూ, బీఎస్ఎఫ్, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నేతృత్వంలో మంగళవారం కేయూ మొదటి గేటు వద్ద నిరసన ఆందోళనలు చేపట్టారు. వర్సిటీ క్యాంపస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులకు పోలీసులకు స్వల్పతోపులాట జరిగింది. వర్సిటీ మొదటి గేటు ఎదుట ప్రధాన రహదారిపై పోలీసుల తీరును నిరసిస్తూ బైఠాయించి నిరసన ఆందోళనలకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు బైరపాక ప్రశాంత్, మొగిలి వెంకట్‌రెడ్డి, బి.నరసింహరావు, మాచర్ల శరత్‌చంద్రలు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములను అమ్మకానికి పెడితే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. విద్యార్థుల అక్రమ అరెస్టులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూములను ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఇచ్చే ఆలోచనలు విరమించుకోవాలని హెచ్చరించారు. హెచ్‌సీయూ విద్యార్థులపై ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవరిస్తోందని ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులను భయాభ్రాంతులకు గురిచేస్తూ, అత్యంత పాశవికంగా అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో రియల్ ఎస్టేట్‌లకు ప్రభుత్వ వర్సిటీల భూములను కట్టబెట్టే చర్యలకు పాల్పడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూ భూములపై విద్యార్థి లోకానికి బేషరత్తుగా క్షమాపణలు చెప్పి భూముల విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, బీఆర్ఎస్వీ, యూఎస్ఎఫ్ఐ, డీఎస్‌పీ, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూ, బీఎస్‌యూ, బీఎస్ఎస్ విద్యార్థి సంఘాల నేతలు భాషబోయిన సంతోష్, జెట్టి రాజేందర్, కలకోట సుమన్, మాలోతు రాజేశ్, కె.శ్రావణ్, గణేశ్, మర్రి మహేశ్, ఇ.సాయికుమార్, ఎ.గణేశ్, మచ్చ పవన్‌కల్యాణ్, శివనాస్తిక్, గణేశ్, యాదగిరి, వేల్పుల చరణ్, ప్రణీత్, వంశీకృష్ణ, వీరు, సూర్యకిరణ్, రంజిత్‌కుమార్, కత్తెరపల్లి దామోదర్, అఖిల్, రాజేశ్, డి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని విరమించుకోవాలి..

సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి



సుబేదారి పోలీసు స్టేషన్‌లో అరెస్టు అయిన సీపీఎం నాయకులు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వేలం పాటను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో హెచ్‌సీయూ కార్యక్రమంలో భాగంగా పోలీసులు సీపీఎం నాయకులను, విద్యార్థులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు హనుమకొండ సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గాదె ప్రకార్‌రెడ్డి మాట్లాడుతూ.. 400 ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూమి ని విక్రయించడానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించు కోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తూర్పు క్యాంపస్‌లోకి బుల్డోజర్లు ప్రవేశించి ప్రభుత్వం ఎంపికచేసిన 400 ఎకరాల స్థలం పరిధి దాటి క్యాంపస్ స్థలాన్ని చదును చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అడ్డుకుంటున్న వారిని అక్రమంగా అరెస్టుచేసి పోలీసుస్టేషన్లలో నిర్బంధించడం సరికాదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొట్ల చక్రపాణి, మంద సంపత్, మంద శ్రీకాంత్, బొచ్చు కల్యాణ్, జశ్వాంత్, ప్రశాంత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై దాడులను ఖండించాలి

కేయూ క్యాంపస్ : హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ వర్సిటీ విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల దాడులను ఖండించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజులుగా హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసులు అమానుషంగా దాడులు చేస్తున్నారని, విద్యార్థులపై నిర్బంధంగా విధిస్తున్నారని ఆరోపించా రు. తాము సీహెచ్‌సీయూ విద్యార్థులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అలాగే హెచ్‌సీయూపై రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడులను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం తప్పదు

హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం భూములను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తే సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థుల నుంచి గుణపాఠం తప్పదని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ హెచ్చరించారు. మంగళవారం తెల్లవారుజామున కేయూ పోలీసులు వర్సిటీ క్యాంపస్ హాస్టల్స్‌లో ఉంటున్న ఎస్ఎఫ్ఐ సెక్రెటరీ శ్రీకాంత్‌తో పాటు ఇతర ముఖ్య నేతలను, విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసి కేయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి బుల్డోజర్ పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. భూముల రక్షణకు ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో పోరాటాలు చేస్తుంటే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ ప్రధాన కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, సభ్యులు ఎం.రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన వ్యక్తులు

కాజీపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ కారు అదుపుతప్పి ఆటోను, పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట సోమిడి శివారులో మంగళవారం సోమిడి నుంచి తాళ్లపద్మావతి కళాశాల వైపు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఆ తర్వాత పక్కనే ఉన్న ఎలక్ట్రిక్ పోల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సోమిడికి చెందిన ఎం.కార్తీక్, మహేశ్‌లకు రెండు కాళ్లు విరిగినట్లు తెలుస్తోంది. అలాగే మరో ప్రయాణికుడు సందీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి.. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా గాయాలపాలైన వారికి ప్రథమ చికిత్సచేసి ఎంజీఎంకు తరలించారు. కారు నడిపిన వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉంటుండటంతో పరీక్ష కేంద్రంలో తాగునీటి వసతి, ఇతరత్ర సౌకర్యాలు ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



డాక్టర్ జి.పద్మావతి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి

ముఖాముఖి

పక్షావాతం, కీళ్ల నొప్పులకు

పంచకర్మ చికిత్స

ఆంధ్రజ్యోతి: ఆయుర్వేద ఆస్పత్రిలోఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు?

అధికారి : మధుమేహం, రక్తపోటు, చెవి, ముక్కు, గొంతు, ప్రసూతి, స్త్రీలు, పిల్లల వ్యాధులతో పాటుగా అన్ని రకాల సాధారణ వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రధానంగా పక్షవాతం, కీళ్ల నొప్పులు, వెన్నుపూస నొప్పులకు పంచకర్మ వైద్య చికిత్స, వెరికోస్ వెయిన్స్‌కు జలగలతో చికిత్స, అర్షమొలలకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ల్యాబ్ సదుపాయం ఉందా?

అధికారి : ఉంది. అన్ని రకాల పరీక్షలు చేస్తున్నాం. ల్యాబ్‌లో అందుబాటులో లేని పరీక్షలను తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోగులకు డైట్.. మందుల సరఫరా ఏలా ఉంది?

అధికారి: మోనూ ప్రకారం రోగులకు డైట్ పెడుతున్నాం.మందుల తయారీ జరుగుతున్నందున కొంత ఆలస్యమవుతోంది. మందుల కొరత లేదు.

ఆంధ్రజ్యోతి: టెలీ మెడిసిన్ సౌకర్యం ఉందా?

అధికారి : ఉంది. ప్రతీ రోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టెలీమెడిసిన్ సెంటర్ పనిచేస్తున్నది. ఆస్పత్రికి రాలేని వారు 0870-2433553 నంబర్‌కు ఫోన్ చేసి అవసరమైన వైద్య సేవలు పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి: రోగులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

అధికారి : నిష్ణాతులైన వైద్యులు ఉన్నారు. అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా లభిస్తాయి. జిల్లా ప్రజలు ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలి.

- గిర్మాజిపేట (ఆంధ్రజ్యోతి)

నేడు రేణుక అంత్యక్రియలు

- కడవెండిలో ఏర్పాట్లు చేసిన కుటుంబ సభ్యులు
- మంగళవారం రాత్రి ఇంటికి చేరిన మావోయిస్టు మృతదేహం




కడవెండిలోని నివాసం వద్ద విషణ్ణవదనంలో రేణుక తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు

దేవరుప్పుల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు, ప్రెస్ టీం ఇన్‌చార్జీ మావోయిస్టు రేణుక అలియాస్ చైతు, అలియాస్ భాను, అలియాస్ సరస్వతి అంత్యక్రియలు స్వగ్రామమైన జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండిలో బుధవారం జరగనున్నాయి. మంగళవారం ఛత్తీస్‌గఢ్ దంతెవాడలోని ఆస్పత్రిలో రేణుక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 3గంటలకు అక్కడి పోలీసులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అర్ధరాత్రి దాటాక గ్రామానికి రేణుక మృతదేహం అంబులెన్స్‌లో చేరుకుంది. అంతకుముందు గ్రామంలోని గ్రామ పంచాయతీ సమీపంలోని ఆమె పెదనాన్న గుముడవెల్లి లక్ష్మీనర్సు ఇంటి వద్ద రేణుక మృతదేహాన్ని ఉంచేందుకు కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రేణుక తల్లిదండ్రులు రిటైర్డ్ టీచర్ సోమయ్య, జయమ్మలు హైదరాబాద్ నుంచి మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్థులతోపాటు పలు పార్టీల నాయకులు, మాజీ మావోయిస్టులు గాదె ఇన్నయ్య, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ మాజీ సభ్యులు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు కుటుంబసభ్యులను పరామర్శించారు.

రేణుక చిన్నవయస్సులో తనతో పంచుకున్న అనుబంధాలను ఇన్నయ్య గుర్తు చేశారు. రేణుక సోదరుడు జీవీకే ప్రసాద్ అలియాస్ ఉసెండితోపాటు రేణుకతో కలిసి దండకారణ్యంలో పని చేసిన తీరును గాజర్ల అశోక్ అలియాస్ ఐతు నెమరు వేసుకున్నారు. రేణుక అంత్యక్రియలకు కడవెండికి భారీ ఎత్తున ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పలు విప్లవ సంఘాల ప్రతినిధులు, కవులు, కళాకారులు, మాజీ మావోయిస్టులు తరలి రావాలని ఇన్నయ్య, అశోక్ పిలుపునిచ్చారు. రేణుక అంత్యక్రియలు బుధవారం 11గంటలకు ప్రారంభం అవుతాయని తండ్రి సోమయ్య, పెదనాన్న లక్ష్మీనర్సు తెలిపారు.


చైతుది బూటకపు ఎన్‌కౌంటరే..



రేణుక ప్రజా శ్రేయస్సుకోసం నిత్యం ప్రజలను చైతన్య పర్చడమే లక్ష్యంగా తన కలంతో ఎన్నో సాహిత్య కవితలు రాసిందే తప్ప మావోయిస్టు పార్టీలో ఏనాడు ఆయుధం పట్టలేదు.
చత్తీస్‌ఘడ్‌లో అక్కడి ప్రభుత్వం సల్వాజుడుం పేరుతో ఆదివాసీ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న తరుణంలో జర్నలిస్టుగా పెన్ను పట్టి కెమెరాతో ఫొటోలు తీసి పరిస్థితులను పత్రికలకు విడుదల చేసింది. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న చైతును తీసుకెళ్లి బూటకపు ఎన్‌కౌంటర్ చేశారు. పోలీసులు చూపించిన ఫొటోలో కట్టు, బొట్టు చెదరలేదు.

- గాదె ఇన్నయ్య, నవ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకుడు

రేణుక గొప్ప ప్రజాస్వామిక వాది



దండకారణ్యంలో ఆదివాసీలు, సామాన్య ప్రజల మన్ననలు పొందిన గొప్ప నాయకురాలు రేణుక. ప్రజాస్వామిక వాదిగా, పరిశోధనాత్మక వ్యాసాలు, సాహిత్యాలు కళంతో ప్రజలను నిత్యం చైతన్యపర్చింది. ఒక జర్నలిస్టుగా పనిచేసి ఎప్పటికప్పుడు అక్కడి ప్రజలను మేల్కొల్పింది. దండకారణ్యంలో స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా జీవీకె ప్రసాద్, రేణుకతో కలిసి పనిచేశాను. ఆమె ఎదురు కాల్పుల్లో మృతి చెందలేదు. పట్టుకుని కాల్చి చంపారు. ఇది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరే.

- గాజర్ల అశోక్ అలియాస్ ఐతు

హెల్త్ సూపర్‌వైజర్ దారుణ హత్య

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన
- మృతుడిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల
- సోదరి ఫిర్యాదు మేరకు పోలీసుల ముమ్మర దర్యాప్తు
- అనుమానితుల కోసం భద్రాచలం వెళ్లిన బృందం



పార్థసారథి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్,ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామ పరిధిలోని భజనతండ శివార్లలో దంతాలపల్లి జ్యోతిరావుపూలే పాఠశాల హెల్త్ సూపర్‌వైజర్ తాటి పార్థసారథి (42) దారుణ హత్యకు గురయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లకు చెందిన పార్థసారథి కుటుంబం కొంతకాలంగా భద్రాచలంలోని జగదీష్‌నగర్ కాలనీలో నివాసముంటోంది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఏడాది నుంచి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి జ్యోతిరావుపూలే పాఠశాలలో హెల్త్‌సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తు న్న ఆయన.. ఉగాది పండుగకు గాను భద్రాచలం వెళ్లి.. సోమవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై దంతాలపల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత అయోధ్య పరిధిలోని భజనతండ శివారులోని మిర్చి తోట వద్ద రాత్రి 11:30, 12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డగించి గొడ్డలితో తలపై నరికి చంపారు. అయితే తెల్లవారుజామున ఆ దారి గుండా వెళ్లేవారు ఇచ్చిన సమాచారంతో విషయం వెలుగులోకి రాగా.. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య హుటాహుటిన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూజ్‌టీంలను రంగంలోకి దింపి పలు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి రాత్రికి పోస్టుమార్టం నిర్వహించారు. అయితే అయోధ్య గ్రామ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశం కాగా.. మృతదేహాన్ని చూసేందుకు అధికసంఖ్యలో స్థానికులు అక్కడికి చేరుకున్నారు.

పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

తన సోదరుడి హత్య విషయం తెలుసుకున్న పార్థసారథి సోదరి హేమ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఆమె చేసిన పలు ఆరోపణలు అనుమానాలకు తావిస్తున్నాయి. తన అన్న పార్థసారథి.. ఏడాది కిందట భద్రాచలంలోని బీపీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే ఒకసారి కొందరు హత్య చేసేందుకు వెంట పడ్డారని.. అప్పుడు తప్పించుకున్నాడని,ఈ ఘటనపై అప్పట్లో అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆమె వెల్లడించారు. అంతేకాకుండా కొంతకాలంగా తన అన్న, వదిన స్వప్న మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయని, ఈ హత్యలో తన వదిన ప్రమేయం ఉండి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. ఈ లోపే భర్త పార్థసారథి హత్య గురించి తెలుసుకుని భద్రాచలం నుంచి వచ్చిన స్వప్నను ప్రశ్నించిన పోలీసులు.. పలు వివరాలు సేకరించారని తెలుస్తోంది. ఆ తర్వాత కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసిన రూరల్ పోలీసులు హత్యలో భద్రాచలానికి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉండి ఉండొచ్చని భావిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసుల బృందం భద్రాచలం వెళ్లినట్టు సమాచారం. అయితే పార్థసారథిని హత్య చేసేందుకు భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి దుండ గులకు సుపారీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్థ సారథి హత్యకు గల కారణాలను తెలుసుకుని త్వరితగతిన కేసును ఛేదించేందుకు పోలీసులు విస్తృతంగా విచారణ జరపుతున్నట్టు తెలుస్తోంది.

నేటి బాల్యం.. సాహిత్యానికి దూరం!

నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం



సాంకేతికత, కార్పొరేట్ విద్యాచట్రంలో పిల్లలు



- కేవలం పాఠ్యాంశాలకే పరిమితమవుతున్న పైనం
- వ్యక్తిత్వ వికాస పుస్తకాలకు దూరమవుతున్న చిన్నారులు
- మునుపటి రోజుల్లో బాలల కోసం ప్రత్యేక పుస్తకాలు
- నేటికీ బాలసాహిత్యంలో వాణిశ్రీ విశేష కృషి
- ఆరు దశాబ్దాలుగా చిన్నారుల సేవలో బాలల గ్రంథాలయం

హనుమకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వగలిగిన అమూల్యమైన ఆస్తి మంచి పుస్తకం. పుస్తకం అమ్మలా లాలిస్తుంది. నాన్నలా ఆదరిస్తుంది. గురువులా తీర్చిదిద్దుతుంది. చదివే మెదళ్లకు పదును పెడుతుంది. కథల పుస్తకాలు పిల్లల్లో ఏకాగ్రత, సృజనాత్మకతను పెంపొందిస్తే.. మహానుభావుల విజయగాథలు, ఆత్మకథలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. అయితే ప్రస్తుత పోటీ ప్రపంచలో పిల్లలు కార్పొరేట్ విద్యాచట్రంలో బందీ అవుతున్న వేళ వారు పాఠ్యేతర పుస్తకాలకు దూరమవుతున్నారు. కేవలం సబ్జెక్టు పుస్తకాలకే పరిమితమవుతున్న బాలలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే పుస్తకాలను చదవే పరిస్థితి లేకుండాపోయింది. ఇక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా వారికి ఆ దిశగా సూచనలు కూడా చేయడం లేదు. ఇక మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న విస్తారమైన బాలసాహిత్యమే పిల్లలకు విజ్ఞాన, వినోదాన్ని అందిస్తోంది. బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

పఠానాసక్తిని పెంచేందుకు..

పిల్లల్లో పఠానాసక్తిని కలిగించడం, వారితో పాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యంవైపు ఆకర్షించడం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం లక్ష్యం. 1967నుంచి ఏటా ఏప్రిల్ 2న అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని జరుపుతున్నారు. డెన్మార్క్‌కు చెందిన ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత హాన్స్ క్రిస్టియన్ అండర్సన్ పుట్టిన రోజు ఇది. తెలుగులో తొలిసారిగా 1875-85 మధ్య కాలంలో జనవినోదిని పత్రిక బాలల కోసం ప్రత్యేక రచనలను ప్రారంభించింది. 1947లో నాగిరెడ్డి చందమామ ప్రారంభించారు. బాలసాహిత్యానికి చందమామ చేసిన సేవ వెలకట్టలేనిది. చందమామ తర్వాత బాలమిత్ర, బొమ్మరిల్లు, బుజ్జాయి లాంటి పత్రికలు అలరించాయి. తెలుగు రచయితల్లో చాలా మంది సుప్రసిద్ధులు బాలసాహిత్యానికి ఎనలేని సేవలందించారు. న్యాయపతి రాఘవరావు, ఏడిద కామేశ్వర్‌రావు, తురగా జానకీరాణి, రావూరి భరద్వాజ, ఇల్లిందల సరస్వతీ దేవి లాంటివారు బాలల కోసం ప్రత్యేకంగా రచనలు చేశారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాదారపు వాణిశ్రీ తదితరులు బాలసాహిత్యం కోసం కృషి చేస్తున్నారు. అలాగే సాహిత్య అకాడమీలు, సాక్షర భారత్, సర్వశిక్ష అభియాన్ లాంటివి కూడా పిల్లలకు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ప్రచురిస్తున్నాయి. కానీ ప్రస్తుతం చిన్నారులు పుస్తకాల ను పక్కనపెట్టి సామాజిక మాధ్యమాలకు అతుక్కు పోతు న్నారు. ఫలితంగా పిల్లల్లో సహజ ఎడుగుదల మందగిస్తోంది.

ఈ క్రమంలో పుస్తక పఠనాన్ని తల్లిదండ్రులు, పెద్దలు బాధ్యతగా స్వీకరించి నేటి తరం పిల్లలకు చిన్నప్పటి నుండే అలవాటు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాలల కథా రచయిత్రి వాణిశ్రీ



మాదారపు వాణిశ్రీ

పిల్లల కోసం పుస్తకాలు రాస్తున్నవారిలో మాదారపు వాణిశ్రీ ఒకరు. ఓరుగల్లుకు చెందిన వాణిశ్రీ బాలల కోసం కథ, నవల, గేయం కవిత రాయడమే కాకుండా ఒకే రోజు ఒకే వేదికపై ఆరు పుస్తకాలను ఆవిష్కరించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. తిరుగనగరి వేదాంత సూరి ప్రోత్సాహంతో మూడున్నర దశాబ్దాలుగా బాల సాహితీవేత్తగా సరదా కాసేపు, చిచ్చుబుడ్లు, సెలవుల్లో పట్నం పిల్లలు.. లాంటి నవల తో పాటు పూటకుళ్లవ్వ సీరియల్ తదితర రచనలు చేశారు. బాలలకు ఒక చోట అందించేందుకు వీటన్నిటిని ఒక సంకలనంగా పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చారు. సరదాగా కాసేపు, చిచ్చుబుడ్లు, సెలవుల్లో పట్నం లాంటి రచనల్లో ఆమె బాలల కోసం వారి బాగు కోసం అనే అంశాలను పొందుపరిచారు. బాలల మనస్తత్వాలను అద్దం పట్టారు. కేవలం ఆనందం గా, సరదగా చదువుకునే కథలేకాక పిల్లలను అపహరించే మాఫియా గురించి కూడా ప్రస్తావిస్తారు. విదేశాల్లో ఉండే పిల్లల కోసం పల్లెల్లో ఒంటరిగా తపించే తల్లిదండ్రుల తండ్లాటను కూడా వివరించారు. మన జీవన మూలాలకు ఆధ్యమైన భారతం, భాగవతం, రామాయణం లాంటివాటి ని పరిచయడం చేయాలన్న తపన కూడా ఆమె కథల్లో కనిపిస్తుంది. ఇక బాలల కథల పుస్తకాన్ని తన కుమారుడికి అంకితం చేయడం రచయిత్రి ఔచిత్యానికి తార్కాణం. తెలివైన గడుగ్గాయ్, మందబుద్ధి, చిచ్చుబుడ్లు, పరుగు లాంటి కథలు సామాజిక స్పృహకు అద్దంపట్టగా.. ముఖ్యంగా సెలవుల్లో పట్నం పిల్లలు పుస్తకం బాలలను ఎంతగానో చదవిస్తుంది. పట్నం పిల్లలు సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వచ్చినప్పుడు వారు ఆడే ఆటలు, పొందే అనుభూతిని ప్రస్ఫుటించారు. వాణిశ్రీ కథలు, నవలలే కాక చక్కని బాల గేయాలను కూడా రచించారు. వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ఆమె బాల గేయాలు ప్రచురితమయ్యాయి. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రచురించిన ఆరోగ్యం-వి జ్ఞానం పుస్తకంలో బాలల విజ్ఞానం కోసం సిరి ధాన్యాల గురించి రాసిన వ్యాసానికి ప్రత్యేక పురస్కారాన్ని అందుకున్నారు. హిందీలోకి అనువదించిన 20బాలల ఉత్త మ కథా సంకలనంలో వాణిశ్రీ రాసిన పొదుపు కథ చోటు దక్కించు కుంది. ప్రస్తుతం మణికొండ వేద కుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న దక్కన ల్యాండ్ మాసపత్రిక చెలిమి పేజీలో వాణిశ్రీ రచించిన పూటకూళ్లవ్వ ధారావాహిక కథ గత నెల నుంచి ప్రచురితమవుతోంది. ఆమె బాల సాహిత్యం, బాలల గురించి చేసిన పలు ప్రసంగాలు ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. క్రాంతి మేఘాలు కథకు బాల చెలిమి సంస్థ ఉత్తమ బాలల కథా పురస్కారం అందుకున్నారు. చిచ్చుబుడ్లు కథా పుస్తకానికి భువన సాహిత్య విజ్ఞాన వేదిక ద్వారా ఉత్తమ కథా పుస్తకంగా జాతీయ ఉగాది పురస్కారం పొందారు.



బాలల కోసం మాదారపు వాణిశ్రీ రాసిన పుస్తకాలు

ఆరు దశాబ్దాలుగా బాలల సేవలో.. గ్రంథాలయం..

హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని బాలల గ్రంథాలయం ఆరు దశాబ్దాలుగా బాలల సేవలో తరిస్తోంది. వారి అభిరుచికి తగ్గట్టుగా ఎన్నో పుస్తకాలను అందుబాటులో ఉంచుతోంది. ఆట పాటల కోసం పబ్లిక్ గార్డెన్‌కు వచ్చే పిల్లలకు పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచాలన్న ఆలోచనతో 1967లో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గార్డెన్‌లో పచ్చని చెట్లు, ఆహ్లాకరమైన వావరణం మధ్య ఉన్న ఈ గ్రంథాలయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7గంటల వరకు పని చేస్తుంది. రోజూ సుమారు 100 నుంచి150మంది పిల్లలు ఇక్కడి వస్తుంటారు. ఇక్కడ మొత్తం 17,994 పుస్తకాలు ఉండగా.. బాలల కోసం ప్రత్యేకంగా 3వేలకుపైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. తొలుత ఈ గ్రంథాలయాన్ని పిల్లల కోసమే ప్రత్యేకించినా తర్వాత కాలంలో పెద్దల ను కూడా అనుమతిచ్చారు. దీంతో పిల్లలకు తోడుగా వచ్చే తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో పాటు ఇటీవల గ్రూప్ పరీక్ష కోసం సిద్ధమయ్యే వారి కోసం కూడా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పిల్లలు చదువుకోవడానికి అనువుగా ప్రత్యేకంగా కుర్చీలు, బెంచీలు ఇతరత్రా సౌకర్యాలను ప్రత్యేకంగా కల్పించారు. ఇక పిల్లలకు అందే ఎత్తులోనే పుస్తకాల సెల్ఫ్‌లను ఏర్పాటు చేశారు.



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని బాలల గ్రంథాలయం

డిజిటల్ స్టోరీ బాక్స్..

పబ్లిక్ గార్డెన్‌లోని పిల్లల గ్రంథాలయానికి వచ్చే చిన్నారులు తమకు ఇష్టమైన పుస్తకాలతో పాటు కథలను చదువుకోవడానికి వీలుగా వారి కోసం డిజిటల్ స్టోరీ బాక్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. పిల్లలు ఏవైనా మూడు పుస్తకాలను ఎంచుకొని అందులో తమకిష్టమైన కథలను ఎంచుకుంటే అవి ఈ బాక్స్ నుంచి ప్రింట్ అవుట్ రూపంలో బయటకొస్తాయి. అలాగే పిల్లలతో ఏ పుస్తకాలను చదివించాల నేది తల్లిదండ్రులు నిర్ణయించుకొని ఆ పుస్తకాలను ఎంపిక చేసి ఇచ్చేందుకు పుస్తకాల కేటలాగ్ అందుబాటులో ఉంది. రామాయణ, భారత ఇతిహాసాలతో పాటు సైన్స్ ఫిక్షన్, కామిక్ తదితర అన్ని రకాల పుస్తకాలు ఈ బాలల గ్రంథాలయంలో అందు బాటులో ఉన్నాయి. గతంలో ఈ బాలల గ్రంథాలయం పాత రేకుల షెడ్డులో ఉండగా.. ఇటీవల పబ్లిక్ గార్డెన్‌ను ఆధునీకీకరించిన క్రమంలో వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని హంగులతో కూడిన విశాలమైన భవనాన్ని నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో బాలల కోసం ప్రత్యేకంగా నడుస్తున్న ఏకైక గ్రంథాలయం ఇదేనని, మారుతున్న కాలానికి అనుగుణంగా బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి, వారి వ్యక్తిత్వ నిర్మాణానికి, జిజ్ఞాసను పెంచడానికి దోహదపడే పుస్త కాలు ఇక్కడ ఉన్నాయనీ లైబ్రేరియన్ ఆశోక్ తెలిపారు. ఈ బాలల గ్రంథాల యానికి 60ఏళ్ల అపరూపమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు.

ఆగం చేస్తున్న.. ఆటిజం

ప్రతీ 20 మంది చిన్నారుల్లో ఒకరికి సమస్య

- పిల్లలను సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లకు దూరంగా ఉంచాలి
- బయటకు కనిపించే మానసిక వ్యాధి
- ముందుగా పసిగడితే మంచిది



నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ.. దాంతో ఆరోగ్యంగా పెరిగేవారు. కానీ ఆ అమ్మ ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ చేతికిచ్చి ముద్దలు తినిపిస్తోంది. ఇక నాన్నేమో ట్యాబ్ చూపిస్తూ లాలపోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న పిల్లలు పసితనంలోనే అనేక రుగ్మతలకు గురవుతున్నారు. సమాజంలో పెరుగుతున్న సాంకేతికత కొన్ని రకాల వ్యాధులకు కారణమవుతోంది. అందులో ఒకటి ఆటిజం.

ఆటిజం అంటే ఏమిటీ?

ఆటిజం అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి. పిల్లలకు మొదట్లో మాటలు వస్తాయి. కానీ రెండేళ్ల వచ్చేసరికి ఆ మాటలు ఆగిపోతాయి. దీనినే రిగ్రేషన్ అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేళ్లలోపు ఇది జరుగుతుంది. ఆటిజం పిల్లలు భావాలను వ్యక్తపర్చడంలో విఫలమవుతుంటారు. సరిగా మాట్లాడలేకపోవడంతో పాటు ఎదుటివారి భావాలను గ్రహించలేరు. సామాజిక బాంధవ్యాలు కూడా తెలియని స్థితిలో ఉంటారు. ఇతరులతో కలిసి ఆడుకోవడం కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా మాత్రమే ఉండడాన్ని కోరుకుంటారు. చేసిన పని మళ్లీ మళ్లీ చేస్తూ ఉంటారు. ఇలాంటి చిన్నారుల్లో మానసిక పరిణితి చాలా తక్కువగా ఉంటుంది. ఇలాంటి లక్షణాలన్ని అటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ లక్షణాలున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.

సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగే కొద్ది ఆటిజం సమస్య కూడా పిల్లలను పట్టిపీడిస్తోంది. చాప కింద నీరులా విస్తరిస్తున్న ఆటిజం సమస్యపై ప్రత్యేక కథనం.

కారణాలు ఇవే..

ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేక కారణమంటూ లేదు. సాధారణంగా 9నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతోపాటు గ్రహించడం భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయస్సులో చిన్నారులకు ఫోన్లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు చేయడంవల్ల భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. మొదటి మూడేళ్ల వరకు పిల్లలకు ఫోన్లు, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటు పడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. బహుళ భాషలు నేర్చుకోవాల్సి రావడం పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల పిల్లలు ఏ భాషను కూడా స్వీకరించకపోయే అవకాశం ఉంటుంది. యాంటీ బయోటిక్స్ లాంటివి ఎక్కువగా వాడటం కూడా ఈ సమస్యకు దారి తీయొచ్చు. ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ ఎక్కువగా కనిపిస్తుంది.

ఒంటరితనం కూడా ఇబ్బందే..

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్య, అత్తయ్య, చిన్నమ్మ, చిన్నాన్న, పిన్ని ఇలా అనేక మంది పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల ఊసేలేదు. పైగా ఆ రోజుల్లో మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబాలు కరువయ్యాయి. నూటికి 90శాతం విడిగా ఉండే కుటుంబాలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరు ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తుంది. ఇలాంటి కుటుంబ వాతావరణ పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీస్తుంది.

వ్యాధి లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కళ్లలోకి నేరుగా చూడలేకపోవడం.
- పేరు పెట్టి పిలిచిన వెంటనే స్పందించకపోవడం.
- ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడటం.
- ఒకేరకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మను ఇస్తే తీసుకోకపోవడం.
- కొందరు పిల్లలోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబద్ధంగా ఉంటుంది.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి



పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎదుగుతున్న కొద్ది వారిలో వస్తున్న మార్పులు కచ్చితంగా గమనించాలి. మొద టి మూడేళ్లలో ఆటిజం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిం చాలి. మెదడు పనితీరుకు సంబంధించిన లోపం వల్ల ఇది సంభవిస్తుంది. తోటి వారితో కలవకపోవడం, సరిగ్గా మాట్లాడకపోవ డం, భావ ప్రకటనల్లో లోపాలు ఈ వ్యాధి లక్షణాలుగా భావించాలి. ఈ వ్యాధిని పరిశీలిస్తూ పరిష్కారం దిశగా చికిత్స అందించాల్సి ఉంటుంది. చికిత్సతో మార్పు సాధ్యమే.

- డాక్టర్ కె.వినయ్ కుమార్‌గౌడ్, న్యూరో ఫిజీషియన్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కాకతీయ మెడికల్ కాలేజీ

రోగ నిర్ధారణ, చికిత్స పద్ధతులు

ప్రత్యేక లక్షణాలు కల్పించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గాని, లోక నిర్ధారణ పద్ధతులు గాని అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు మాత్రమే కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలుగుతారు. ఈ ఆటిజం లక్షణాలను ఎంత త్వరగా గుర్తిస్తే నివారణ అంత సులువుగా ఉంటుంది. ఆరు నెలల్లోనే 50శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం మూడేళ్లలోపు సమస్యలు గుర్తించి చికిత్స అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ మూడేళ్ల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఇలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చునని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, స్పీచ్ థెరపీ ద్వారా ఆటిజానికి చికిత్స అందిస్తారు.

ఉద్రేకపూరిత ప్రవర్తన ఉంటే అప్రమత్తత అవసరం



మూడేళ్లలోపు పిల్లల్లో ఉద్రేకపూరిత ప్రవర్తన ఉంటే అప్రమత్తం కావాల్సిందే. ఒంటరిగా ఉండటం, అతిగా స్పందించడం, నలుగురితో ఆడలేకపోవడం లాంటివి ఆటిజం లక్షణాలుగా గుర్తించాలి. ఈ తరహా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. దేశంలో ప్రతీ 68మంది పిల్లల్లో ఒకరు బాధితులుంటున్నారు. త్వరితగతిన గుర్తిస్తే చికిత్స సులభతరం బిహేవియర్ థెరపీ, మెడికేషన్, పేరంటల్ కౌన్సెలింగ్‌తోపాటు ప్రత్యేక పద్ధతుల్లో విద్యాబోధన అందించడం ముఖ్యం. ఈ వ్యాధి నిర్మూలనలను సామాజిక బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ ఏ.రాకేశ్ కుమార్, సైకియాట్రిస్ట్

రజతోత్సవ సభపై బీఆర్ఎస్ ఫోకస్

5వ పేజీ తరువాయి)

సమయంలో వరంగల్ కేంద్రంగా నిర్వహించిన విశ్వరూప మహాసభ విజయవంతమైన స్ఫూర్తితో రజతోత్సవ సభను సక్సెస్ చేస్తామని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో మాట్లాడుతూ.. ఎల్కతుర్తి వద్ద సభావేదిక ఏర్పాటు చేయటం బాగుందని, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట ఉమ్మడి జిల్లాల కూడలిలో ఈ వేదిక ఉండటం జనసమీకరణకు సులభంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ఈ మూడు జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో సభకు జనాన్ని తరలించాలన్నారు. 27వ తేదీన నాటికి ఎండలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కేసీఆర్ వారికి సూచించారు. గురువారం నుంచి ప్రతీ నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో జనసమీకరణ జరగాలన్నారు. సభ నిర్వహణకు కావాల్సిన 20కి పైగా కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలని కేసీఆర్ సూచించారు.

వర్ధన్నపేట బాధ్యతలు ఎర్రబెల్లికే..

మార్చి 28న 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి జిల్లా సంచికలో 'గడబిడల గులాబీ' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో పార్టీలో విభేదాలను పక్కన పెట్టాలని కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు హితవు చెప్పారు. వర్ధన్నపేట నియోజవర్గంలో జనసమీకరణ బాధ్యతలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చూసుకుంటారని, ఇప్పుడే ఇన్‌చార్జ్ బాధ్యతల కోసం గొడవలు ఎందుకని.. నియోజకవర్గాల పునర్విభజన తరువాత చూద్దామంటూ నేతలకు సర్దిచెప్పినట్టు సమాచారం. అంతేకాకుండా భూపాలపల్లి జనసమీకరణ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి చూసుకోవాలని, పార్టీలో ఎలాంటి విభేదాలు లేకుండా రజతోత్సవ సభను సక్సెస్ చేయాలని కేసీఆర్ కోరారు. కాగా, పార్టీ రజతోత్సవ సభ నిర్వహణ వరంగల్‌కు అప్పగించటంపై ఉమ్మడి జిల్లా నేతలు కేసీఆర్‌కు ధన్యావాదాలు తెలిపారు.

ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మండలిలో విపక్షనేత సిరికొండ మధుసూధనాచారి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రులు తాటికొండ రాజయ్య, సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, భూపాలపల్లి, ములుగు జిల్లాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు గండ్ర జ్యోతి, బడే నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు, చిత్రంలో కేటీఆర్ తదితరులు

హస్తం నేతల.. నారాజ్!

(5వ పేజీ తరువాయి)

మారిన సమీకరణలో రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో రాములమ్మకు కూడా బెర్త్ దక్కటం అంతా ఈజీ కాదనే చర్చ జరుగుతోంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సైతం మంత్రివర్గంలో స్థానం కోసం ప్రయత్నాలు చేసినా తొలిసారి ఎమ్మెల్యే కావటంతో ఛాన్స్ లేకుండా పోయిందనే టాక్ ఉంది. మొత్తానికి గురువారం జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో ఓరుగల్లు నేతలకు ఛాన్స్ దక్కటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

చీఫ్‌విప్ అయినా దక్కేనా..?

మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలకు బెర్త్ దక్కటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అధిష్ఠానం కేబినెట్ ర్యాంకుతో ఎంతో కీలకమైన చీఫ్‌విప్ పదవి ఇస్తామని భరోసా ఇచ్చిందనే చర్చ జరుగుతోంది. రెడ్డి సామాజిక వర్గం ఎమ్మెల్యేల్లో ఒకరికి చీఫ్‌విప్ పదవి ఇస్తే.. అది ఎవరికి అనేది కూడా ఉత్కంఠగా మారింది. మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న దొంతి మాధవరెడ్డికి చీఫ్‌విప్‌లాంటి కీలక పదవిని సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. సీఎంతో మాధవరెడ్డికి సంబంధాలు అంతంతే ఉండటంతో.. శాసనసభలో కీలకమైన పదవి కావటంతో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి లేదా నాయిని రాజేందర్‌రెడ్డిల్లో ఒకరికి అవకాశం ఇస్తారనే చర్చ ఉంది. అయితే మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని వీడకుండా, ఇతర పార్టీల ఆఫర్లను కూడా లెక్క చేయకుండా పని చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వైపు మొగ్గు చూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక రాజేందర్‌రెడ్డికి డిప్యూటీ స్పీకర్ ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ, నల్లగొండ జిల్లాకు చెందిన ఓ నేతకు ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించిందని, దీంతో రాజేందర్‌రెడ్డి లేదంటే ప్రకాష్‌రెడ్డికి చీఫ్‌విప్ పదవి దక్కే అవకాశం ఉందనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. అయితే కాంగ్రెస్‌లో ఏ క్షణాన ఏం జరుగుతుందో అని, కనీసం ఈ పదవైనా వరంగల్ రెడ్డి సామాజిక వర్గ ఎమ్మెల్యేలకు దక్కేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో ఇటీవల పదోన్నతి పొందిన హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు గురువారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో మొత్తం 472 మంది ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు, రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం, సోషల్ ఉపాధ్యాయులకు, శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్లు, బయోసైన్స్ ఉపాధ్యాయులు, పీడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు ఒక్క రోజే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుండగా మిగతా ఉపాధ్యాయులు రెండు రోజులు శిక్షణ కార్యక్రమానికి ఉదయం 9 గంటల వరకు సంబంధిత పాఠ్యపుస్తకాలతో వారికి కేటాయించిన శిక్షణ కేంద్రాల్లో హాజరు కావాలని సూచించారు.

సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం దేశానికే ఆదర్శమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గోకుల్ నగర్‌లోని రేషన్ షాపు వద్ద సన్నబియ్యం పథకాన్ని స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డి, హనుమకొండ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, ఎంఆర్ఐ దశరథరామిరెడ్డి, సివిల్ సప్లయిస్ డీడీ నాగేంద్ర, తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి సీహెచ్. మోహన్, కాంగ్రెస్ 57వ డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్, నాయకులు పాల్గొన్నారు.

● గ్రేటర్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పథకాన్ని స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంక హరిబాబు, కాంగ్రెస్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గోకుల్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

● కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి రేషన్‌షాపులో మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, తహసీల్దార్ బావుసింగ్, డివిజన్ అధ్యక్షులు పి.అంజనేయులు, అజ్గర్, నాయకులు పాల్గొన్నారు.

● మడికొండ : మడికొండలో మంగళవారం మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్ కాంగ్రెస్ నేతలతో కలసి సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

● రెడ్డికాలనీ/వరంగల్ కార్పొరేషన్: హనుమకొండ 5వ డివిజన్ కొత్తూరు జెండా, రెడ్డికాలనీలో సన్న బియ్యాన్ని మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, కాజీపేట తహసీల్దార్ బావ్‌సింగ్, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్, బంక సంపత్ యాదవ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ సిటీ: రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి విన్నవించారు. రెడ్డికాలనీలో మంగళవారం సన్న బియ్యం పంపిణీ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేను కోరారు. సుదీర్ఘ కాలంగా డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని తమకు హామీ ఇచ్చిన క్రమంలో ఆ మేరకు చొరవ చూపాలని రమేశ్‌బాబు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్‌ను శాలువాతో సత్కరించారు.

● హనుమకొండ చౌరస్తా: హనుమకొండ 10వ డివిజన్ లక్ష్మీపురంలోని 108వ రేషన్‌షాపు వద్ద మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మడికొండలో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న రఘుచందర్


లక్ష్మీపురంలో బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న తోట వెంకటేశ్వర్లు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియా గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియా, కాంతయ్యనగర్, పోచమ్మగుడి, వివేక్‌నగర్, సరస్వతీ నగర్, మాధవీనగర్, విజయనగర్ కాలనీ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని సోమిడి, జూబ్లీ మార్కెట్, మహంకాళి డీటీఆర్, తిలక్‌నగర్, వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లి, జీఎంఆర్ గార్డెన్స్, టీచర్ కాలనీ ఫేజ్-2 ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, కేయూసీ సబ్ స్టేషన్ పరిధిలోని నయీంనగర్, ఈద్గా, కొత్తూరు, పోచమ్మకుంట, కుమార్‌పల్లి ఏరియాలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

నేటితో ముగియనున్న డిగ్రీ పరీక్షల ఫీజు గడువు

కేయూక్యాంపస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉలాంటి అపరాధ రుసుం లేకుండా డిగ్రీ 2, 4,6 సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లించుకునేందుకు ఏప్రిల్ 2 వరకు గడువు ఉందని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ వెంకటయ్యలు తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 9 వరకు గడువు ఉందని స్పష్టం చేశారు.

విద్యుత్ ఉద్యోగుల విరాళం

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సర్కిల్ విద్యుత్ ఉద్యోగులు తమ నెల జీతం నుంచి రూ.20వేలు మల్లికాంబ మనోవికాస స్వచ్ఛంద సంస్థకు విరాళంగా అందజేసినట్లు హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ప్రతీనెల ఈ విరాళం వారి ఖాతాకు నేరుగా జమ చేయడం ద్వారా మానసిక వికలాంగులు, వృద్ధులు, అనాథలు, వితంతువులకు సహాయం అందిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్క ఉద్యోగి ముందుకు వచ్చి వీలైనంత సహాయం అందించడం ఎంతో సంతృప్తినిస్తోందని చెప్పారు.

ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలి

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రైమరీ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం హనుమకొండలోని యూటీఎఫ్ సంఘ కార్యాలయంలో వరంగల్, హనుమకొండ జిల్లాల యూటీఎఫ్ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యారంగానికి ప్రాథమిక విద్య పునాది అని దాన్ని బలోపేతం చేయాలంటే కచ్చితంగా ఈ విద్యా సంవత్సరం నుంచే అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి కె. సోమశేఖర్, రాష్ట్ర, జిల్లాల నాయకులు కిరణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, సంజీవయ్య, విద్యాదేవి, సదానంద్, రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, దామోదర్, రాజారాం, జ్యోతి, రఫూఫ్, లింగారావు, మల్లిక్, శశిధర్‌రెడ్డి, చంద్రయ్య, కర్ణాకర్, కుమారస్వామి, రమేష్, ప్రసన్నానంద్, సదానందం, భాస్కరరావు, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, లింగమూర్తి, శ్రీనివాస్, రవీందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సేవలు అభినందనీయమని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నన్నెబోయిన తిరుపతి అన్నారు. మంగళవారం నర్సిరెడ్డి హనుమకొండకు వచ్చిన సందర్భంగా హనుమకొండలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నర్సిరెడ్డిని సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తన పదవికాలంలో ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించారన్నారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు.

11న బార్ అసోసియేషన్లకు ఎన్నికలు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల ఎన్నికలు ఈ నెల 11న నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు తీగల జీవన్ గౌడ్, మాతంగి రమేష్‌బాబు, ముదసిర్ అహ్మద్, లాడె రమేష్‌లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన జారీ చేశారు. 2న అర్హత కలిగిన ఓటర్ల జాబితా ప్రకటన, 4న నామినేషన్ల దాఖలు ఉంటుందని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు పరిశీలన అనంతరం జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈనెల 7న నామినేషన్ల ఉపసంహరణ, 10న పోటీలో ఉన్న అభ్యర్థుల పరిచయ కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకు అంబేద్కర్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. 11న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరంగల్ జిల్లాకు సంబంధించిన పోలింగ్ నిర్వహణ అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు, హనుమకొండ జిల్లాకు సంబంధించిన పోలింగ్ నిర్వహణ మహాత్మాగాంధీ బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ఆరోగ్య మహిళా క్లినిక్‌ల తనిఖీ

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోచమ్మకుంట, శాయంపేట పీహెచ్‌సీలను హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తనిఖీ చేశారు. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా క్లినిక్‌ను నిర్వహిస్తుండగా ఆయన ఆస్పత్రులను సందర్శించారు. వైద్యులు ప్రతీ స్త్రీ ఆరోగ్య సమస్యలు విని తగిన వైద్యం అందించాలన్నారు. ఓపీ టైమింగ్స్ పాటిస్తూ ప్రతీ రోగితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

4న రైతు సత్యాగ్రహ దీక్ష

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 4న హనుమకొండ కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య హాజరవుతున్నారని ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రైతులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

న్యూశాయంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. 31వ డివిజన్ న్యూశాయంపేట జంక్షన్‌లో వేల్పుల వీరస్వామి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వేల్పుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వినయ్‌భాస్కర్ హాజరై రిబ్బన్‌కట్‌చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు జానకి రాములు, సదానందం, వేల్పుల సందీప్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వినయ్‌భాస్కర్

భక్తిశ్రద్ధలతో మహా సుదర్శన హోమం


హోమం చేస్తున్న అర్చకులు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల ఆలయంలో శ్రీరామ నవమి వసంత నవరాత్రి ఉత్సవాల పర్వం మంగళవారం మూడోరోజుకు చేరింది. పాంచరాత్ర ఆగమానుసారం యజుర్వేద పండితుడు విజయకుమారాచార్య ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మహా సుదర్శన హోమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర్‌రావు, రుక్మిణి, సదాశివుడు- భాగ్యలక్ష్మి దంపతులు ఉభయదాతలుగా నిర్వహించి లోక కల్యాణార్థం మహా యాగం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ పర్యవేక్షణలో ఈ యాగం కొనసాగింది. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను రఘునం దనుడిగా అలంకరింపజేసి పంచామృతాభిషేకం, షోడచోపచారపూజలు నిర్వహించారు. హనుమాన్ భక్తులు సాయంత్రం ప్రదోశకాల సమయంలో శ్రీరామ, జయరామ అంటూ ప్రత్యేక భజనలు నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

నిరాశ్రయులకు ప్రభుత్వం అండ

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రయులైన వృద్ధులను రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తోందని, వృద్ధుల అనాథాశ్రమాల్లో తలదాచుకోవచ్చునని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు డాక్టర్ కారుకాల అనితారెడ్డి భరోసానిచ్చారు. మంగళవారం కేయూ వద్ద గల లార్డ్ అనాథాశ్రమంలో లక్ష్మయ్య అనే వృద్ధుడిని ఆశ్రమానికి చేర్చారు. విషయం తెలుసుకున్న అనితారెడ్డి ఆశ్రమానికి వచ్చి లక్ష్మయ్యను పరామర్శించారు.


వృద్ధుడిని ఓదారుస్తున్న అనితారెడ్డి

317 రద్దుకు ఎమ్మెల్సీలు కృషి చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు జీవోనెంబరు 317 రద్దు కోసం కృషి చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ కోరారు. మంగళవారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్సీలు ఇచ్చిన హామీల మేరకు జీవో నెంబరు 317ను రద్దు చేసే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి మన్నె చంద్రయ్య, నాయకులు వెంకటేష్, రమేష్, శ్రీనివాస్, శంకర్, మహేందర్, సంతోష్, కుమారస్వామి, శరత్, సురేష్, రాంజీ, కుమారస్వామి, ప్రశాంత్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

నిధులున్నా.. పనులు సున్నా..

గుండ్లసింగారంలో సమస్యల మోత
అభివృద్ధికి నోచుకోని విలీన గ్రామం
అధ్వానంగా మారిన ప్రధాన రహదారి
పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్ గుండ్లసింగారం గ్రామంతో పాటు డివిజన్‌లో ఉన్న పలు కాలనీలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. హనుమకొండకు కూతవేటు దూరంలో, ఔటర్ రింగ్‌రోడ్డు, కేయూ రోడ్డుకు ఆనుకుని ఉన్న డివిజన్‌లోని పలు కాలనీలలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉన్నాయి. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ డివిజన్‌ను అధికారులు విలీన గ్రామంగా గుర్తించి కార్పొరేషన్‌లో చేర్చినా పట్టింపు లేనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు తెలుసుకోవాల్సిన ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ ఇటు వైపు కూడా చూడకపోవడంతో గుండ్లసింగారం, ఇందిరమ్మ కాలనీ, సాయినగర్‌కాలనీ, గణేష్‌నగర్, గొల్లవాడలో సమస్యలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల డివిజన్ అభివృద్ధి కోసం రూ. 30 లక్షలు విడుదలైనా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ప్రజలు మండి పడుతున్నారు. ఒక్క గుండ్ల సింగారం గ్రామంలోనే 3 వేలకు పైగా జనాభా ఉన్నా ఇక్కడి సమస్యలపై ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.


చెత్తా, చెదారంతో నిండిన డ్రెయినేజీ

అధ్వానంగా ప్రధాన మార్గం

గుండ్లసింగారం నుంచి పెగడపెల్లి గ్రామానికి నిత్యం ప్రతిరోజూ వందలాది వాహనాలపై సుమారు పది గ్రామాల ప్రజలు ప్రయాణిస్తారు. అంతే కాకుండా ఈ గ్రామం మీదుగా బెవరైజ్ డిపోకు సంబంధించిన లారీలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. ఇక్కడ ఉన్న 80 ఫీట్ల రోడ్డు 10 ఫీట్లకు కుచించుకుపోయింది. పదేళ్లుగా ఈ రోడ్డు దుస్థితి ఇదే విధంగా ఉంది. ఇక్కడి నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అడుగులోతు గుంతలుగా ఏర్పడి ప్రమాదాలకు చిరునామాగా మారింది. పెగడపెల్లి డబ్బాల జంక్షన్ నుంచి ఓఆర్ఆర్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేరకు పది ఫీట్లతో ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగున గుంతలు ఏర్పడి అటుగా ప్రయాణించేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో పెగడపెల్లి, సీతానాగారం, గుంటూరుపల్లి, అర్వపల్లి, సిద్ధాపురం, భైరాన్‌పల్లి గ్రామాల నుంచి నగరానికి వచ్చే వాహనచోదకులు నేరుగా రింగు రోడ్డు నుంచి కేయూ ఇంజనీరింగ్ కళాశాల, బంజారాకాలనీ, గొల్లవాడ, సుందరయ్యనగర్ నుంచి పెగడపెల్లి జంక్షన్‌కు చేరుకుంటున్నారు. ఇలా చాలా కాలంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నా బల్దియా అధికారులు గుర్తించి రోడ్డును వేయలేకపోతున్నారని ప్రజలు ప్రజాప్రతినిధులపై విమర్శలు గుప్పిస్తున్నారు.


ధ్వంసమైన గ్రామ ప్రధాన రహదారి


ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో వేసిన చెత్తా చెదారం

సాగని శానిటేషన్ పనులు

డివిజన్ విస్తీర్ణానికి సరిపడా శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. డ్రేనేజీ కాల్వలు శుభ్రం చేసే వారు లేరు. దీంతో డ్రైనేజీలలో చెత్తా చెదారం నిండుకుని దుర్వాసన వెదజల్లుతోంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పట్టించుకోకపోవడంతో సిబ్బంది కూడా సరిగా విధులకు రావడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు గుండ్లసింగారంలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు అధ్వానంగా మారింది..


మాదాసి కల్యాణ్, గ్రామస్థుడు

పెగడపెల్లి జంక్షన్ నుంచి గుండ్లసింగారం మీదుగా ఓఆర్ఆర్ వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా మారింది. కనీసం పాదచారులు కూడా నడిచే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ హయాంలో వేసి రోడ్డు ఇప్పటికే ఉంది. గతంలో ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ. 1.80 కోట్లు మంజూరు అయ్యాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఈ రోడ్డును ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు.

గుంతలతో రాకపోకలు నిలిచిపోయాయి


రఘునాథ్, కిరాణా షాపు యజమాని

గుండ్లసింగారం మెయిన్‌రోడ్డు పొడవునా గుంతలు ప్రమాదకరంగా ఉండడంతో రాకపోకలు చాలా కాలంగా నిలిచిపోయాయి. అడుగులోతు గుంతల వల్ల వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటుగా ప్రయాణం ఇబ్బందిగా మారడంతో రింగ్‌రోడ్డు నుంచి వెళుతున్నారు. దీంతో మా వ్యాపారాలు దెబ్బతిన్నాయి.



టస్సర్ ట్రెండ్

ఫ్యాషన్

హుందాగా, విలాసవంతంగా కనిపించాలనుకుంటే టస్సర్ చీరలు కట్టాలి. అన్ని రకాల వేడుకలకూ నప్పే టస్సర్ చీరల సొబగుల గురించి తెలుసుకుందామా?

ప్రత్యేకమైన ఆకృతి, సహజసిద్ధమైన స్వర్ణం మెరుపులను కలిగిన అద్భుతమైన వస్త్రమే టస్సర్. వైల్డ్ సిల్క్‌తో తయారయ్యే టస్సర్ చీరలకు ఎన్నో ప్రత్యేకతలుంటాయి.

- **వైల్డ్ సిల్క్:** యాంథెరీ మాత్‌ల గూళ్ల నుంచి సేకరించిన పట్టుతో వైల్డ్ పట్టును తయారుచేస్తారు. ఈ వైల్డ్ పట్టు పురుగులు మల్బరీ ఆకులు మినహా ఇతరత్రా ఆకులను తింటాయి
- **టెక్స్చర్:** కాస్త గురుకుగా ఉండే ఈ వస్త్రం, నునిమెత్తని మల్బరీ పట్టుకు భిన్నంగా ఉంటుంది
- **మెరుపు:** ఈ పట్టు సహజసిద్ధ బంగారు మెరుపు కలిగి ఉంటుంది
- **రంగు:** బీజ్, క్రీమ్, గోధుమ రంగుల్లో తయారవుతుంది
- **డిజైన్:** సంప్రదాయ బెంగాలీ టస్సర్ చీరలు, నేత బార్డర్లు, కొంగులను కలిగి ఉంటాయి. అలాగే చీర మొత్తం పూల మోటిఫ్స్‌ను కలిగి ఉంటాయి
- **పేర్లు:** టస్సర్ సిల్క్‌నే కోసా సిల్క్ అని కూడా అంటారు



ప్రత్యేకతలివే!

- సహజ సిద్ధం: ఈ పట్టు తయారీలో సహజరంగులనే ఉపయోగిస్తారు
- మన్నిక: టస్సర్ పట్టు ఎంతో మన్నికైనది. దీనికి ముడతలు, చిరుగులు ఏర్పడవు
- వైవిధ్యం: సాధారణ వేడుకలు మొదలు, పెళ్లిళ్లు, పండగలకు కూడా ఈ చీరలెంతో చక్కగా సూటవుతాయి.

మనం చేసే చిన్న చిన్న పొరబాట్లవల్ల మెదడు బలహీనమై జ్ఞాపకశక్తి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. జ్ఞాపకశక్తి పెరగాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

జ్ఞాపకశక్తి మందగిస్తోందా..!

- ప్రతిరోజూ ఉదయం పోషకాలతో కూడిన అల్పాహారం తీసుకోవాలి. దీనివల్ల మెదడుకి కావాల్సిన గ్లూకోజ్ అందుతుంది. ఇది ఏకాగ్రతని, జ్ఞాపకశక్తిని పెంచుతుంది.
- పడుకునే ముందు ఫోన్, ల్యాప్‌టాప్‌లను చూస్తూ ఎక్కువ సమయం గడపకూడదు. వీటి నుంచి వచ్చే కాంతి వల్ల మెదడులో మెలటోనిన్ ఉత్పత్తి క్షీణిస్తుంది. నిద్రించే సమయం కూడా తగ్గడంతో మెదడు అలసిపోయి గుర్తుపెట్టుకునే సామర్థ్యాన్ని కోల్పోతుంది. ప్రతిరోజూ కనీసం ఆరు గంటలు ప్రశాంతంగా నిద్రించాలి.
- చక్కెర శాతం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తినకూడదు. దీనివల్ల మెదడులో వాపు సమస్యలు వచ్చి జ్ఞాపకశక్తి మందగిస్తుంది.
- ఒకేసారి ఎక్కువ పనులు చేస్తూ ఉంటే మెదడు త్వరగా అలసిపోతుంది. ఇలాంటప్పుడు కూడా ఏమీ గుర్తు ఉండవు. కాబట్టి మల్టీ టాస్కింగ్ చేయవద్దు.
- నిర్జలీకరణ వల్ల కూడా జ్ఞాపకశక్తి మందగిస్తుంది. అందుకే శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచూ మంచినీళ్లు తాగుతూ ఉండాలి.
- శరీరంలో డి విటమిన్ లోపించినా ఏమీ గుర్తుండవు. కాబట్టి ప్రతిరోజూ ఒంటికి ఎండ తగిలేలా చూసుకోవాలి.
- దగ్గరి బంధువులు, స్నేహితులకు సంబంధించిన పుట్టిన రోజు తేదీలు, ఫోన్ నెంబర్లు గుర్తు పెట్టుకునే ప్రయత్నం చేయడం; మెదడుకి పనిచెప్పే చదరంగం, వైకుంఠపాళి, క్యారమ్స్ లాంటి ఆటలు ఆడడం; జీపీఎస్ విధానాన్ని ఉపయోగించకుండా దారులు గుర్తుంచుకోవడం లాంటివి అనుసరిస్తూ ఉంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



ఆడపిల్ల... ఆదుకునే పిల్ల

ఆడపిల్ల భారం కాదని తన తల్లిదండ్రులకే కాదు, మొత్తం ప్రపంచానికే నిరూపించి చూపించాలనుకుంది ప్రముఖ మిక్స్‌డ్ మార్షల్ ఆర్టిస్ట్ పూజా తోమర్. ఉత్తర్‌ప్రదేశ్ బుధానా గ్రామానికి చెందిన పూజ, యుఎఫ్‌సి ఫైట్ గెలిచిన మొట్టమొదటి భారతీయురాలిగా చరిత్ర కూడా సృష్టించింది. పుట్టుకతోనే బతుకు పోరాటాన్ని మొదలుపెట్టిన ఫైటర్ పూజ మనోగతమిది.



స్ఫూర్తి

"అప్పటికే అమ్మానాన్నలకు ఇద్దరు ఆడపిల్లలు. వాళ్లను పెంచడమే భారమైపోయిన సమయంలో, నేను పుట్టడంతో నాన్న స్పృహ తప్పి పడిపోయారు. పెంచే స్థోమత, ధైర్యం లేక వాళ్లు నన్ను వదిలించుకోవాలని అనుకున్నారు. మూడో కూతురుని పెంచకూడదని అప్పటికే నిర్ణయించేసుకున్నారు కాబట్టి నన్ను కుండలో వదిలేశారు. కానీ తల్లి మనసు తట్టుకోలేకపోయింది. నా ఏడుపు వినగానే అమ్మ నన్ను బయటకు తీసి గుండెలకు హత్తుకుని, నన్ను పెంచుకోవాలని నిశ్చయించుకుంది. ఈ భారాన్నీ, బాధను నేను చిన్నప్పటి నుంచీ మోస్తూనే ఉన్నాను. ఊహ తెలిసింది మొదలు నన్ను నేను నిరూపించి చూపించే అవకాశాల కోసం వెతకడం మొదలుపెట్టాను. బాల్యంలో క్రీడాకారులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు నన్ను ఆకర్షించే వారు కారు. మెరుపు వేగంతో కదులుతూ ప్రత్యర్థులను మట్టి కరిపించే యాక్షన్ హీరోలు, ప్రత్యేకించి జాకీచాన్ నన్నెంతో ఆకర్షించేశాడు. నేనతని సినిమాలను వినోదం కోసం కాకుడా, ఫైటింగ్ నేర్చుకోవడం కోసం చూసేదాన్ని.



జాకీచాన్ స్ఫూర్తితో...

ఏడో తరగతిలో బడిలో జరిగిన కరాటే పోటీలో తోటి మగపిల్లవాడి ముఖం మీద పిడిగుద్దులు కురిపించాను. దాంతో ఆ పిల్లాడు మూర్ఛపోయాడు. దాంతో నన్ను డిస్‌క్వాలిఫై చేసేశారు. దాంతో బడి యాజమాన్యం నేనా ఆటకు తగిన వ్యక్తిని కానని తీర్మానించేసింది. కానీ ఆ సమయంలో నాకు జాకీ చాన్ గుర్తొచ్చాడు. నేను పుట్టిందే అతనిలా ఫైట్ చేయడం కోసం. అలాంటప్పుడు నచ్చిన పని మానేయడంలో అర్థం ఏముంది? ఆ తర్వాత కూడా బడిలో గొడవల్లో మగపిల్లల మీద పైచేయి సాధిస్తూ, ఫైటింగ్‌నే క్రీడగా మలుచుకోవాలనే విషయాన్ని గ్రహించాను. అలా 12వ తరగతిలో మా బడి కొచ్చిన కరాటే టీచర్ దగ్గర పాఠాలు నేర్చుకోవడం మొదలుపెట్టాను. కొంత కాలానికి కరాటేను మించిన మరొక మార్షల్ ఆర్ట్, ఉషు నేర్చుకోవడం మొదలుపెట్టాను. మామయ్య సహాయంతో భోపాల్ వెళ్లి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఐదేళ్ల పాటు శిక్షణ పొందాను. ఆ ఐదేళ్ల కఠోర శిక్షణ తర్వాత నాకు కానిస్టేబుల్ ఉద్యోగం వరించింది. కానీ నేను దాన్నొక అవమానంగా భావించాను. పైగా అప్పట్లో ఎమ్‌బిబిఎస్ చదువుతున్న మా అక్కకు ట్యూషన్ ఫీజు అవసరమైంది. సరిగా అదే సమయంలోనే మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎమ్ఎమ్ఎ) గురించి విన్నాను. ఢిల్లీ నుంచి ఒకరు నన్ను స్పాన్సర్ చేయడానికి అంగీకరించడంతో మరో ఆలోచన లేకుండా ఫైట్‌కు సిద్ధపడ్డాను. అలా గత ఏడాది జూన్‌లో, బ్రెజిల్‌కు చెందిన రయాన్ అమాండాను ఓడించి, అల్టిమేట్ ఫైట్ ఛాంపియన్‌షిప్ (యుఎఫ్‌సి)లో విజయం సాధించి, ఈ ఫైట్ గెలిచిన మొట్టమొదటి భారతీయురాలిగా గుర్తింపు తెచ్చుకున్నాను. పోటీలో గెలుపొందిన డబ్బుతో కుటుంబాన్ని ఆదుకున్నాను.

ఊహ తెలిసింది మొదలు నన్ను నేను నిరూపించుకొనే అవకాశాల కోసం వెతకడం మొదలుపెట్టాను. బాల్యంలో క్రీడాకారులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు నన్ను ఆకర్షించే వారు కాదు. మెరుపు వేగంతో కదులుతూ ప్రత్యర్థులను మట్టి కరిపించే యాక్షన్ హీరోలు, ప్రత్యేకించి జాకీచాన్ నన్నెంతో ఆకర్షించాడు.

కానీ ఈ గెలుపును చూడడానికి నాన్న లేకపోవడం నన్నిప్పటికీ బాధిస్తూ ఉంటుంది.

అపజయాలు సహజం

గెలవడం కోసం కాదు, స్పష్టత కోసం ప్రతి పోరాటానికి ముందు భగవంతుడిని ప్రార్థిస్తాను. నా శిక్షణ కూడా ఎంతో కఠినంగా సాగుతుంది. రోజుకు రెండు సెషన్లు సాధన చేస్తాను. కానీ ఈ మార్చి 22న యుఎఫ్‌సి ఫైట్‌లో అపజయం పాలయ్యాను. అన్నిసార్లూ గెలుపు మనల్ని వరించదు. కొన్నిసార్లు గెలుస్తాం, కొన్నిసార్లు ఓడిపోతాం! అయితే పోరాడే అవకాశమిచ్చిన ఆ భగవంతుడికి నేనెప్పటికీ రుణపడి ఉంటాను. అన్నిటికంటే ముఖ్యంగా నన్ను కనడం భారంగా భావించిన అమ్మ నన్ను చూసి గర్వపడుతూ ఉండడం ఎంతో సంతృప్తిని కలిగిస్తూ ఉంటుంది."

వేణు, భాగ్య దంపతులు. వారి కుటుంబంలో కూడా చిన్న చిన్న దెబ్బలాటలు ఉంటాయి. కానీ అవి మొబైల్స్‌లో టెక్స్ట్ మెసేజ్‌లుగా మారి... మరింత ముదిరిపోయాయి. వ్యవహారం విడాకుల వరకు వెళ్లింది.

'ఫిక్సిటింగ్' ప్రమాదమే!

ఈ ఆధునిక యుగంలో మొబైల్స్ సర్వసాధారణమయిపోయిన తర్వాత ఒకరితో మరొకరు సమాచారం ఇచ్చిపుచ్చుకోవటం సులభమయిపోయింది. దీనివల్ల అనేక ప్రయోజనాలున్నా- కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఇలాంటి ఇబ్బందే- టెక్ట్స్ మెసేజ్‌ల ద్వారా దెబ్బలాడుకోవటం. దీనికే మానసిక నిపుణులు 'ఫిక్స్‌టింగ్' అని పేరు పెట్టారు. దీనివల్ల కొన్ని లాభాలున్నా.. ఎక్కువగా నష్టాలే ఉన్నాయంటున్నారు మానసిక నిపుణుడు డాక్టర్ ప్రసాదరావు. ఆ నష్టాలేమిటో చూద్దాం...

- ఎదురెదురుగా ఉండి దెబ్బలాడుకున్నప్పుడు- వాడే భాష, హావభావాలు, శరీర కదలికలు మొదలైనవి ప్రధానమైన పాత్ర పోషిస్తాయి. కానీ టెక్ట్స్ మెసేజ్‌లలో కేవలం పదాలు మాత్రమే ఉంటాయి. దానిని ఎవరు ఏ విధంగానైనా అర్థం చేసుకోవచ్చు. చాలా సందర్భాలలో సరైన భాషను వాడకపోవటం వల్ల అనేక అపార్థాలు ఏర్పడే అవకాశం కూడా ఉంది. దీనితో గొడవలు మరింతగా పెరిగిపోతాయి.



- ఎదురెదురుగా ఉండి దెబ్బలాడుకున్నప్పుడు- ఆవేశం తగ్గిన తర్వాత రాజీ పడటానికి అవకాశం ఉంటుంది. మన మెదడు అవతల వ్యక్తులతో మనం గడిపిన మంచి గుర్తులను వెలికి తెస్తుంది. దానితో వారి పట్ల మనకు సానుకూలత ఏర్పడే అవకాశం ఉంటుంది. టెక్ట్స్ మెసేజ్‌లలో అలాంటి అవకాశమే ఉంటుంది. ఒక సారి మెసేజ్ చదివిన తర్వాత దానిని మళ్లీ వెనక్కి తీసుకోగలిగే అవకాశమే ఉండదు.
- 'ఫిక్సిటింగ్'లో గొడవలు త్వర త్వరగా పెరిగిపోతాయి. కొన్నిసార్లు అవతల వ్యక్తులతో మనకున్న బంధాన్ని తెంచేసుకొనే పరిస్థితులు కూడా ఏర్పడతాయి. మిలినియల్స్, జెన్ జెడ్ (18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు)లు ఎక్కువ సార్లు 'ఫిక్సిటింగ్'లోకి దిగుతారు.

నివారణ మార్గాలివే...

- టెక్ట్స్ పంపేముందు మనం చెప్పదలుచుకున్న భావం కరెక్టేనా అనే విషయాన్ని ఒకటికి రెండు సార్లు చూసుకోవాలి. భాషను కూడా చెక్ చేసుకున్న తర్వాత మాత్రమే మెసేజ్‌ను పంపాలి.
- మెసేజ్‌లు పంపే సమయంలో "నేను" అనే పదాన్ని ఎక్కువసార్లు వాడకండి. "నాకు ఇలా అర్థమయింది" అని వాడితే సమస్యకు వెంటనే పరిష్కారం లభిస్తుంది.
- మాటల దెబ్బలాటకు రంగం సిద్ధం అవుతోందనుకుంటే... ఛాటింగ్ నుంచి బయటకు వచ్చేయండి. తాత్కాలికంగా మెసేజ్‌లు పంపటం మానేయండి.
- మెసేజ్‌ల ద్వారా మాటల యుద్ధం ముదురుతోందనుకున్నప్పుడు... నేరుగా మాట్లాడటానికి ప్రయత్నించండి. లేకపోతే నేరుగా కలవండి.

బొమ్మను చేసి... ఉపాధిగా మలచి

బెంగళూరుకి చెందిన వీణా పీటర్‌కు బొమ్మలంటే ఇష్టం. కూతురు తార కోసం సరదాగా తయారు చేసిన బొమ్మ ఓ వ్యాపార సంస్థ ప్రారంభానికి నాంది పలికింది. అదే 'తారాస్ డాల్ హౌస్'. పర్యావరణానికి అనుకూలంగా ఉండే రకరకాల బొమ్మలను రూపొందించడం ఈ సంస్థ ప్రత్యేకత. అంతేకాదు ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రస్తుతం కోటి రూపాయల టర్నోవర్ దిశగా సాగుతోంది. ఈ సంస్థకు సంబంధించి ఆసక్తికరమైన విశేషాలను వీణ ఇలా చెప్పుకొచ్చారు...



"సాధారణంగా ఆడపిల్లలు పొడవాటి జడ ఉన్న అమ్మాయి బొమ్మతో ఆడుకోవడానికి ఇష్టపడతారు. నా కూతురికి కూడా అలాంటి బొమ్మ కొనాలని చాలా షాపులు తిరిగాను. ఎక్కడా దొరకలేదు. ఓ షాపులో చిన్న జడ ఉన్న అమ్మాయి బొమ్మ కనిపిస్తే వెంటనే కొని ఇంటికి తీసుకెళ్లాను. మా అమ్మాయి చేతిలో ఆ బొమ్మ ఎక్కువ కాలం నిలవలేదు. నాకు బాధగా అనిపించింది. మార్కెట్లో దొరికే బొమ్మలన్నీ ఇలా త్వరగా విరిగిపోతుండడంతో నేనే ఒక బొమ్మను తయారు చేయాలని అనుకున్నా. ఇంట్లో ఉన్న పలుచని వస్త్రాలను ఉపయోగించి ఒక అమ్మాయి బొమ్మను తయారు చేశాను. పొడవైన ఊలు దారాలతో జడను రూపొందించాను. బొమ్మకు చక్కగా డ్రెస్ కుట్టి తొడిగాను. ఈ బొమ్మను చూసి మా అమ్మాయి చాలా సంతోషించింది. చాలా రోజుల వరకూ దానితోనే ఆడుకుంది కూడా. దీంతో ఇలాంటి బొమ్మల తయారీ ప్రారంభించాలనే ఆలోచన వచ్చింది. వెంటనే 2022లో తారాస్ డాల్ హౌస్‌ని ఏర్పాటు చేశాను.

తయారీ ఇలా...

అమ్మాయి బొమ్మలతో పాటు అబ్బాయి బొమ్మలను కూడా తయారు చేస్తాం. బొమ్మలను తయారు చేయడానికి నాణ్యమైన మెత్తని బట్టలను ఉపయోగిస్తాం. బొమ్మల తయారీకి కావాల్సిన ముడిపదార్థాలు, వాటికి తొడిగే దుస్తులకోసం అవసరమయ్యే వస్త్రాలను ఢిల్లీ, సూరత్‌ల నుంచి తెప్పించుకుంటాం. చర్మం రంగు... మూడు రకాల టోన్లలో ఉండేలా బొమ్మలను రూపొందిస్తాం. అలాగే తల వెంట్రుకలను నాలుగు వేర్వేరు రంగుల్లో తీర్చిదిద్దుతాం. ప్రస్తుతం ఆరు, పన్నెండు, పద్దెనిమిది అంగుళాల పొడవున్న బొమ్మలను రూపొందిస్తున్నాము. పిల్లల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని ట్రావెల్ డాల్ హౌస్‌లు, స్లింగ్ బ్యాగ్ డాల్ క్యారియర్లు, డాల్ టెంట్లు, బొమ్మల వార్డ్‌రోబ్ సెట్‌లు కూడా తయారుచేస్తున్నాము. మా బొమ్మలకు ఢిల్లీ, పుణె, అహ్మదాబాద్, హైదరాబాద్, చెన్నై నగరాల్లో మంచి ఆదరణ ఉంది.

పర్యావరణ హితం...

బొమ్మల తయారీలో ప్లాస్టిక్, హానికరమైన రసాయన రంగులను ఉపయోగించము. స్టెన్సిల్ ట్రేసింగ్, కత్తిరించడం, కుట్టడం, తలకు వెంట్రుకలు అతికించడం, దుస్తులు కుట్టడం లాంటి ప్రక్రియలన్నింటినీ అత్యంత జాగ్రత్తగా నిర్వహిస్తాము. పిల్లలు ఎంతకాలం ఆడుకున్నప్పటికీ బొమ్మలు మన్నికగా ఉండేలా రూపొందిస్తాము.

మహిళా సాధికారతకు...

ప్రస్తుతం నెలవారీ 200 నుంచి 300 వరకు బొమ్మలు అమ్ముడవుతున్నాయి. వీటి నుంచి రెండు లక్షల వరకు ఆదాయం వస్తోంది. త్వరలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను ప్రారంభించాలనుకుంటున్నాము. అమెరికా సహా ఇతర పశ్చిమ దేశాల్లో వ్యాపారాన్ని విస్తరించాలనుకుంటున్నాము. దీనికి కొంత సమయం పట్టవచ్చు. తారాస్ డాల్ హౌస్ సంస్థ మహిళల సాధికారతకు ప్రాధాన్యమిస్తుంది. టైలరింగ్, బొమ్మల తయారీ, మార్కెటింగ్ విభాగాల్లో పూర్తిగా మహిళలే పనిచేస్తున్నారు. సంస్థ సహవ్యవస్థాపకుల్లో ఒకరు తప్ప మొత్తం బృంద సభ్యులంతా మహిళలే. నా అభిరుచి మరికొంతమంది మహిళలకు ఉపాధి మార్గం అయినందుకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంది. భవిష్యత్తులో మరింతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తా."





ఏపీలో 133 చదరపు కిలోమీటర్ల అటవీ భూముల కబ్జా

- 12వ స్థానంలో నిలిచిన రాష్ట్రం
- దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల్లో 13 వేల చదరపు కి.మీ. కబ్జా
- ఢిల్లీ, సిక్కిం, గోవా రాష్ట్రాల విస్తీర్ణం కన్నా ఇది ఎక్కువ
- వివరాలివ్వని రాష్ట్రాల్లో తెలంగాణ..

వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దేశవ్యాప్తంగా అటవీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని కేంద్ర పర్యావరణ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తం 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 13 వేల చదరపు కిలో మీటర్ల అటవీ భూములు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపింది. ఇది.. ఢిల్లీ, సిక్కిం, గోవాల భౌగోళిక విస్తీర్ణంకన్నా ఎక్కువగా ఉందని పేర్కొంది. ఏపీలో 133 చదరపు కిలోమీటర్ల మేర అటవీ భూముల ఆక్రమణ జరిగిందని, ఇది దేశవ్యాప్తంగా జరిగిన ఆక్రమణలలో 12వ రాష్ట్రంగా నిలిచిందని తెలిపింది. అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించి 25 రాష్ట్రాలు, కొన్ని కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే వివరాలు వెల్లడించాయని, మరో పది రాష్ట్రాలు వివరాలు సమర్పించలేదని పేర్కొంది. అటవీ భూముల ఆక్రమణలపై వచ్చిన వార్తలను గత ఏడాది జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో సుమోటోగా విచారణకు ఆదేశించింది. కాగా, గత ఏడాది కేంద్రం ఇచ్చిన నివేదిక ప్రకారం.. 7,50,648 హెక్టార్ల అటవీ భూమి ఆక్రమణలకు గురైంది. ఇది ఢిల్లీ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణానికి ఐదు రెట్లు ఎక్కువగా ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ తమ అటవీ విస్తీర్ణాల ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీంతో గత వారం కేంద్ర పర్యావరణ శాఖ గత ఏడాది మార్చి వరకు 25 రాష్ట్రాలు, కొన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన అటవీ ప్రాంతాల కు సంబంధించిన నివేదికను ఎన్జీటీకి అందించింది. దీని ప్రకారం 13,056 చదరపు కిలో మీటర్ల అటవీ ప్రాంతం ఆక్రమణకు గురైనట్టు వివరించింది. ఆయా రాష్ట్రాల్లో ఏపీ, మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, పంజాబ్, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్, యూపీ, సిక్కిం, మధ్యప్రదేశ్ వంటివి ఉన్నాయి. ఇక, ఇప్పటికీ సమాచారం ఇవ్వని రాష్ట్రాల్లో తెలంగాణ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ వంటివి ఉన్నాయని నివేదికలో పేర్కొంది.

నివేదికలోని కీలక అంశాలు

- మధ్యప్రదేశ్‌లో భారీ ఎత్తున అటవీ భూముల ఆక్రమణలు జరిగాయి. ఏకంగా 5,460.9 చదరపు కిలోమీటర్ల మేర భూములు ఆక్రమణకు గురయ్యాయి.
- ఈశాన్య రాష్ట్రం అసోం తర్వాత స్థానంలో నిలిచింది. ఇక్కడ 3,620.9 చదరపు కిలోమీటర్ల మేరకు అటవీ భూములను ఆక్రమించుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లో 133.18 చదరపు కిలో మీటర్ల అటవీ భూములు ఆక్రమణలకు గురయ్యాయి.
- మొత్తం ఆక్రమిత అటవీ భూముల్లో 409.77 చదరపు కిలో మీటర్లను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

అక్రమబద్ధీకరణకు రెక్కలు!

(మొదటిపేజీ తరువాయి)


జీవో నంబరు 59 తీసుకొచ్చినప్పుడు ఇందులో 600 చదరపు గజాలను క్రమబద్ధీకరించుకున్నారు. ఇక్కడి 600 గజాల్లో 360 గజాల్లో నిర్మాణాలు ఉన్నాయని చెబితే అధికారులు గుడ్డిగా అనుమతులు ఇచ్చేశారు. ఆ పేరుతో ఇక్కడి రెండెకరాల స్థలాన్ని మొత్తం తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. 2022లో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి 59 జీవో కింద దరఖాస్తులను ఆహ్వానించగా.. గతంలో 600 చ.గజాలను క్రమబద్ధీకరించుకున్న కుటుంబమే ఈసారి ఏకంగా 3,635 చ.గజాలు క్రమబద్ధీకరించాలంటూ దరఖాస్తు చేసింది. కుటుంబంలో ఐదుగురి పేర్ల మీద ఒకరికి 820 చ.గజాలు, మరొకరికి 820 చ.గజాలు, ఇంకొకరికి 850 చ.గజాలు, ఇంకో ఒకరికి 850 చ.గజాలకు దరఖాస్తు చేశారు. అంతేకాదు.. 2015లో 600 చ.గజాలు క్రమబద్ధీకరించుకున్న వ్యక్తి కూడా మరో 300 చ.గజాల ప్రభుత్వ స్థలాన్ని దక్కించుకోవడానికి దరఖాస్తు చేయడం గమనార్హం. నిజానికి, అక్కడ ఆ స్థాయిలో నిర్మాణాలు లేవు. కానీ, ప్రభుత్వం జీవో 59ని ఎన్నిసార్లు తీసుకొస్తే అన్నిసార్లూ తమ పలుకుబడితో క్రమబద్ధీకరణకు ప్రయత్నాలు చేశారు.

నిర్మాణాలు లేకపోయినా గ్రీన్ సిగ్నల్

జీవో 59 కింద ఇక్కడ 600 చదరపు గజాలను క్రమబద్ధీకరించడమే కాకుండా.. మూడు విడతల్లో అంటే.. 2023 నవంబరు 5న, డిసెంబరు 6న, 2024 జనవరి 6న దాదాపు 3,635 చ.గజాలను క్రమబద్ధీకరించడానికి రెవెన్యూ అధికారులు ఫీజులు తీసుకున్నారు. ఈ అక్రమబద్ధీకరణపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో, ఆయన ఆదేశాల మేరకు 2023 డిసెంబరు 8న అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్, గిర్దావర్ పరిశీలన చేసి తుది నివేదికను అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఖాళీగా ఉన్న ఆ స్థలంలో 40 చ.గజాల్లో, 30 చ.గజాల్లో చిన్న చిన్న నిర్మాణాలు మాత్రమే ఉన్నాయని, కానీ, రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని పూర్తిగా తమ ఆధీనంలో పెట్టుకున్నారని, జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయడం ఏ మాత్రం సరికాదని ఆ నివేదికలో తహశీల్దార్ నిర్ధారించారు.

స్థలం ఒకచోట.. నిర్మాణం మరోచోట

సర్వే నంబరు 24లో క్రమబద్ధీకరించుకున్న 600 చదరపు గజాల్లో గ్రౌండ్ ప్లస్ రెండంతస్తుల నిర్మాణానికి 2017లో పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీకి దరఖాస్తు చేశారు. కన్వేయన్స్ డీడ్ ఆధారంగా పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ భవన నిర్మాణానికి అనుమతులు జారీ చేసింది. కానీ, క్రమబద్ధీకరించుకున్న 600 చ.గజాల్లో కాకుండా ప్రభుత్వ భూమిలోనే మరోచోట దీనిని నిర్మించారు. ఈ అంశాన్ని గుర్తించిన పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ అధికారులు 2019 మే 30న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి క్రమబద్ధీకరించుకున్న 1-92/1/ఏ ఇంటి నంబరు స్థలంలో నిర్మాణం చేయకుండా మరో ప్రాంతంలో ఏవిధంగా చేస్తారని ప్రశ్నించారు. అనుమతులు పొందిన స్థలానికి, నిర్మాణం చేసిన స్థలానికి పొంతన లేదని, వారం రోజుల్లో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ణీత గడువులో స్పందించకపోవడంతో 2019 మే 12న నిర్మాణ అనుమతులు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



PROCEEDING OF THE COMMISSIONER PEDDA AMBERPET MUNICIPALITY
Ranga Reddy District

Present Sri. L.V. Ravinder Rao,

Proc. No.G1/1731/PAM/2019. Date: 12 -06- [illegible]


Sub:-Pedda Amberpet Municipality – Town Planning – Permission for construction of G+2 Residential building in Sy. No.24 Situated at Kuntloor(V) – Permission obtained misleading the facts – Permission revoked – Order Issued – Reg.

Ref:-1. This office proceedings No. 3040/W14/2017/0812, Dt.19.03.2018.
2. Complaint filed by Smt. Chama Sampoorna Vijayshekar Reddy Dt.17.04.2019.
3. This office show cause notice No. G1/1731/2019 Dt. 30.05.2019.

ఒకచోట క్రమబద్ధీకరణ చేసుకుని.. మరోచోట ఇంటి నిర్మాణం చేపట్టడంతో ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తూ మునిసిపల్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వు

బట్లూనిబాయి కుంటకు ఎసరు

కుంట్లూరు సర్వే నంబరు 24ను ఆనుకునే రెండు రహదారులు వెళుతున్నాయి. అత్యధిక నివాసాలూ ఇక్కడే వచ్చాయి. దాంతో, ఇక్కడ చదరపు గజం భూమి లక్షల్లోనే పలుకుతోంది. ఇక, క్రమబద్ధీకరించాలని భావిస్తున్న స్థలంలో బట్లూనిబాయి కుంట ఉంది. హెచ్ఎండీఏ సైతం సర్వే చేసి చెరువు కుంటకు ఐడీ 1900/ఈఎన్/19ను నిర్ధారించింది. దీని విస్తీర్ణం 1.9 ఎకరాలుగా ఉంది. అక్రమబద్ధీకరణ ప్రక్రియతో చెరువు కుంట కూడా కనుమరుగయ్యే ప్రమాదముంది.



GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT

From:
K. Ravinder Datt,
Tahsildar, Abdullapurmet Mandal,
Ranga Reddy District.

To
The District Collector,
Ranga Reddy District.

Lr. No.[illegible], Dated: [illegible]

Madam,

Sub: Government lands - Ranga Reddy District - Ibrahimpatnam Division - Abdullapurmet Mandal - Kuntloor Village - Sy.No.24 - Regularisation of Government land under GOMS No.59 - Objection petition filed by Smt. Chama Sampoorna Vijayshekar Reddy, Vice Chair Person, Pedda Amberpet Municipality - Report called for - Submitted - Reg.

Ref: 1). Telephonic instructions of the District Collector, Ranga Reddy District, Dated: 07-12-2023.
2). Report of the Mandal Girdhawar, Abdullapurmet, Dated: 07-12-2023

However, due to huge vacant land & small structures (40 Sq. Yards & 30 Sq. Yards) and also objectable and under litigations, the applications for GOMS No.59 may not be considered.

This is submitted for favour of kind information and necessary action in the matter.

Yours faithfully,
Tahsildar,
Abdullapurmet Mandal,
Ranga Reddy District.

Copy submitted to the Revenue Divisional Officer, Ibrahimpatnam Division for favour of kind information.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసిన భూముల్లో నిర్మాణాలు నిబంధనల మేరకు లేవని, జీవో 59 కింద పరిశీలించరాదని తహసీల్దార్ నివేదిక

ఓ ఎమ్మెల్యేను మచ్చిక చేసుకోవడంతో లైన్ క్లియర్..?

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు జరుపుకొన్న పేదలకు.. వారి పేరిటే ఆ స్థలాలను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 59 కొందరు పెద్దలకు వరంగా మారిన సంగతి తెలిసిందే. పేదల కోసం తీసుకొచ్చిన జీవోను అడ్డు పెట్టుకుని కోట్ల రూపాయల విలువజేసే భూములను కొందరు బడా నేతలు గద్దల్లా తన్నుకుపోయారు. ఎలాంటి నిర్మాణాలూ లేకపోయినా ఈ జీవో కింద అప్పనంగా కట్టబెట్టారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో జరిగిన ఈ అక్రమబద్ధీకరణలపై 'ఆంధ్రజ్యోతి' ఇప్పటికే వరుస కథనాలను ప్రచురించింది. దీంతో, రేవంత్ ప్రభుత్వం అక్రమబద్ధీకరణలకు బ్రేకులు వేసింది. గత ప్రభుత్వంలో జారీ చేసిన అక్రమబద్ధీకరణ స్థలాల కన్వేయన్స్ డీడ్‌లను సైతం నిలిపివేసింది. వాటి ఆధారంగా క్రయ, విక్రయాలను ఆపేసింది. భవన నిర్మాణాలకు అనుమతులివ్వకూడా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు ఆదేశాలు జారీ చేసింది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. కానీ, కుంట్లూరులో మాత్రం తమ 3,635 చ.గజాలను క్రమబద్ధీకరించుకోవడానికి దరఖాస్తుదారులు రంగారెడ్డి జిల్లాలోని ఓ ఎమ్మెల్యేను మచ్చిక చేసుకున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో ఎలాంటి విధానాన్ని అనుసరించారో.. ఈ ప్రభుత్వంలోనూ దానినే అనుసరించి స్థలాలను కొట్టేసేందుకు తెర వెనక పావులు కదుపుతున్నారన్న ఆరోపణలు ఆ పార్టీ నేతల నుంచే వస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా పలుకుబడి కలిగిన వ్యక్తులకు ఎమ్మెల్యేలైనా.. అధికార యంత్రాంగమైనా.. జీ హుజూరు అనే పరిస్థితి ఉందని వాపోతున్నారు.



మ్యూజియం భవన నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

నవంబరు 15న రాష్ట్రానికి ప్రధాని మోదీ !


- రాంజీ గోండ్ గిరిజన మ్యూజియం ప్రారంభానికి రాక

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబరు 15న తెలంగాణ వచ్చే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో నిర్మితమవుతున్న 'రాంజీ గోండ్ గిరిజన మ్యూజియం'ను ప్రధాని ఆరోజున ప్రారంభిస్తారని విశ్వసనీయంగా తెలిసింది. గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని నవంబరు 15న భారతదేశం.. జన్ జాతీయ గౌరవ్ దివస్ జరుపుకుంటుంది. అదే రోజున హైదరాబాద్‌లో రాంజీ గోండ్ మ్యూజియంను ప్రధాని చేతులమీదుగా ప్రారంభింపజేయాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ.. రాష్ట్ర గిరిజన శాఖకు ఇటీవల సూచించిందని సమాచారం. ఈ మేరకు నవంబరు 15 లోగా మ్యూజియం నిర్మాణం, ఇతర పనులను పూర్తి చేయడంపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బుధ, గురువారాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. కాగా, దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన గిరిజనుల త్యాగాలకు గుర్తుగా మ్యూజియంలు ఏర్పాటు చేయాలని 2016 ఆగస్టు 15న ప్రధాని మోదీ ప్రకటించారు. తొలివిడతలో దేశవ్యాప్తంగా 10 గిరిజన మ్యూజియంలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే, తొలి విడతలో మ్యూజియం కోసం తెలంగాణ చేసిన ప్రతిపాదనను తిరస్కరించిన కేంద్రం.. 2018-19లో చేసిన ప్రతిపాదనకు సమ్మతించింది. హైదరాబాద్, అబిడ్స్‌లోని 30 గుంటల ప్రభుత్వ భూమిలో రూ.35 కోట్ల వ్యయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సెల్లార్, గ్రౌండ్ ప్లస్ మూడు అంతస్తులతో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

చిత్రజ్యోతి

SINCE 1965

మరో 30 రోజుల్లో..



నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హిట్: ద థర్డ్ కేస్'. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. విజయవంతమైన 'హిట్' ఫ్రాంచైజీలో మూడో భాగంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మే 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం '30 డేస్ కౌంట్‌డౌన్' పోస్టర్ రిలీజ్ చేసింది. నాని ఇంటెన్స్ లుక్‌లో సిగరెట్ కాలుస్తూ గన్ గురిపెట్టిన పోస్టర్ అదిరిపోయింది.

ఇది ప్రేక్షకుల విజయం

నాగవంశీ



నిర్మాత సూర్యదేవర నాగవంశీ సమర్పణలో సాయిసౌజన్య, హారికా సూర్యదేవర నిర్మించిన తాజా చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్ ప్రధాన పాత్రల్లో నటించారు. సినిమా ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన సందర్భంగా నాగవంశీ మాట్లాడుతూ "ఇందులోని వినోదం నచ్చడంతో యువత, కుటుంబ ప్రేక్షకులు సినిమా థియేటర్లకు క్యూ కడుతున్నారు. ముందుగానే చెప్పినట్లు ఇది ప్రేక్షకులను నవ్వించడానికి చేసిన ప్రయత్నం. ఈ సినిమా విజయం ప్రేక్షకులదే. రివ్యూ అనేది ఒకరి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. సినిమాలకు నిజాయితీగా ఇచ్చే రివ్యూలను స్వాగతిస్తాము. కానీ సినిమాను చంపేయాలనే ఉద్దేశంతో కొందరు లేనిపోనివి రాస్తూ.. దెబ్బతీస్తున్నారు. సినిమా బతికితేనే మనమందరం బాగుంటాం అనే విషయాన్ని గ్రహించాలి" అని అన్నారు.

ఆ సినిమాలపై క్లారిటీ


"అల్లు అర్జున్, త్రివిక్రమ్ సినిమా పూర్తిగా పురాణాల నేపథ్యంలో సాగనుంది. అక్టోబరు నుంచి రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుంది. విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' సినిమాలో యాక్షన్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఇందులోని పోరాట ఘట్టాలు 'కేజీఎఫ్' సినిమా స్థాయిలో ఉంటాయి. రవితేజ నటిస్తున్న 'మాస్ జాతర' సినిమాను జూలైలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని నాగవంశీ చెప్పారు.



మెగా గ్యాంగ్ పరిచయం

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం (మెగా 157-వర్కింగ్ టైటిల్) ఉగాది నాడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విషయం తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలనూ, చిత్రబృందాన్ని పరిచయం చేస్తూ వినూత్నమైన వీడియోను మంగళవారం అనిల్ రావిపూడి విడుదల చేశారు. వీడియో ప్రారంభంలో దర్శకత్వ విభాగం సభ్యులు చిరంజీవి పంచబోయే వినోదాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాస్టర్ పాటపాడుతూ ఎంట్రీ ఇవ్వగా, చిరంజీవి 'గోదారి గట్టు' పాట నుంచి కొన్ని లైన్లు ఆలపించి ఎంటర్‌టైన్ చేశారు.

ఎంపురాన్‌కు మరోసారి సెన్సార్



మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన 'ఎల్2: ఎంపురాన్'లోని కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన నేపథ్యంలో దర్శక నిర్మాతలు మరోసారి సెన్సార్ బోర్డును ఆశ్రయించారు. చిత్రంలోని 24 సన్నివేశాలను తొలగించాలని సెన్సార్ బోర్డు చెప్పింది. కొన్ని చోట్ల ఆడియో మ్యూట్ చేయాలని, కొన్ని పేర్లు మార్చాలని ఆదేశించింది. సెన్సార్ బోర్డు సూచనల మేరకు సినిమాలో కీలక పాత్ర బాల్‌రాజ్ భజరంగీ పేరును బలదేవ్‌గా మార్చనున్నారు. థాంక్స్ కార్డులోని కేంద్ర మంత్రి సురేష్ గోపి పేరునూ తొలగించనున్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు సంబంధించిన సన్నివేశాలు మ్యూట్‌లో ప్రదర్శితమవుతాయి. అయితే రివైజ్డ్ వెర్షన్‌ను ఎప్పటి నుంచి ప్రదర్శిస్తారనే విషయాన్ని చిత్రబృందం ప్రకటించలేదు.

పరిపూర్ణమైన తెలుగు సినిమా



ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకుడు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈనెల 18న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ వేడుకలో మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ "నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌తో ఇది నాకు మూడో సినిమా. కుటుంబసమేతంగా చూడదగ్గ హాస్యభరిత చిత్రమిది. ఈ సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని అన్నారు. "చాలా రోజులుగా మంచి తెలుగు సినిమా తీయాలనుకుంటున్నాను. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. కేవలం జాతకాలనే నమ్మకూడదు.. మనం చేయాల్సిన పనులను వందశాతం నిబద్ధతతో చేయాలని చెప్పే సినిమా ఇది" అని శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు.

'మిథునం' తర్వాత మరోసారి



'మిథునం' లాంటి క్లాసికల్ చిత్రం తర్వాత నటుడు తనికెళ్ల భరణి మరోసారి మెగాఫోన్ పట్టబోతున్నారు. దర్శకుడిగా తన కొత్త సినిమాకు సంబంధించిన విశేషాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. ప్రతిభావంతులైన నూతన నటీనటులను ఎంపిక చేసి, వారితో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు ఆయన చెప్పారు.

భావోద్వేగాలతో నిండిన ప్రేమకథ

సాయి అభిషేక్



నూతన నిర్మాత సాయి అభిషేక్ రూపొందించిన చిత్రం '28 డిగ్రీస్ సెల్సియస్'. నవీన్‌చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా 'పొలిమేర' ఫేమ్ అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించారు. ఈనెల 4న సినిమా విడుదలవుతున్న సందర్భంగా సాయి అభిషేక్ మీడియాతో ముచ్చటించారు. "దర్శకుడు అనిల్‌తో కలిసి ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందిద్దామని చేసిన ప్రయత్నమే ఈ థ్రిల్లర్. భావోద్వేగాలతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. కథపై పూర్తి నమ్మకం ఉండడంతో నిర్మాణపరంగా రాజీపడలేదు. నవీన్ చంద్ర ఈ సినిమాకు ప్రాణం పెట్టి పనిచేశారు. ఓ తీవ్ర అనారోగ్య సమస్య నుంచి హీరోయిన్‌ను హీరో ఎలా రక్షించుకున్నాడు అనేది కథాంశం. విభిన్న జానర్స్‌లో సాగుతూ ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేసే అద్భుత ప్రేమకథ ఇది" అని చెప్పారు.

క్లాప్..

సరికొత్త థ్రిల్లర్



వికాస్ వశిష్ఠ, దీయరాజ్, ఇనయ సుల్తానా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఫ్రైడే'. ఈశ్వర్‌బాబు ధూళిపూడి దర్శకత్వంలో కేసనకుర్తి శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సరికొత్త థ్రిల్లర్ కథాంశంతో సినిమా అందరినీ అలరిస్తుందని పేర్కొన్నారు.

టీనేజ్ లవ్‌స్టోరీ



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రాజేశ్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. ఎం. బంగార్రాజు నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 18న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. 1990 నేపథ్యంలో సాగే టీనేజ్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కిందని మేకర్స్ తెలిపారు.

విభిన్నమైన కథతో...



'బింబిసార' ఫేమ్, దర్శకుడు మల్లిడి వశిష్ఠ సోదరుడు మల్లిడి కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నూతన నటుడు కుశాల్ రాజు కథానాయకుడిగా డా.లతా రాజు ఈ సైన్స్ ఫిక్షన్ డ్రామాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి స్క్రిప్టును అందజేయగా దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్ కొట్టారు. దర్శకుడు మల్లిడి వశిష్ఠ గౌరవ దర్శకత్వం వహించారు.

స్పోర్ట్స్

వరంగల్ ● బుధవారం 2 ఏప్రిల్ 2025

లఖ్‌నవూపై 'పంజా'

చెలరేగిన ప్రభ్‌సిమ్రన్, శ్రేయాస్
అర్ష్‌దీప్‌నకు మూడు వికెట్లు
కింగ్స్ చేతిలో పంత్‌సేన ఓటమి



ప్రభ్‌సిమ్రన్ సింగ్ (34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 69)

లఖ్‌నవూ: ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ అదరగొడుతోంది. బౌలింగ్, బ్యాటింగ్‌లో తిరుగులేని ప్రదర్శన కనబర్చుతూ ప్రత్యర్థులకు సవాల్ విసురుతోంది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 69), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 52 నాటౌట్) మెరుపు అర్ధసెంచరీలతో మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. పంజాబ్‌కిది వరుసగా రెండో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 44), ఆయుష్ బదోని (33 బంతుల్లో ఓ ఫోర్, 3 సిక్సర్లతో 41), మార్‌క్రమ్ (18 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 28), అబ్దుల్ సమద్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27) రాణించారు. ఛేదనలో పంజాబ్ 16.2 ఓవర్లలో 2 వికెట్లకు 177 పరుగులు చేసి గెలిచింది. నేహల్ వధేరా (25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 43 నాటౌట్) చెలరేగాడు. స్పిన్నర్ దిగ్వేష్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ప్రభ్‌సిమ్రన్ నిలిచాడు.

బ్యాటర్ల దూకుడు: ఛేదనలో పంజాబ్ ఆది నుంచే దూసుకెళ్లింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ లఖ్‌నవూ బౌలర్లను ఆడేసుకున్నాడు. ఎలాంటి బంతినైనా ఎడాపెడా బాదేస్తూ బౌండరీల వరద పారించాడు. శ్రేయాస్, నేహల్ వధేరా సైతం బ్యాట్లు ఝుళిపించడంతో మరో 22 బంతులుండగానే పంజాబ్ గెలుపు సంబరాలు చేసుకుంది. తొలి ఓవర్‌లోనే సిమ్రన్ 4,6తో పరుగులకు తెర లేపాడు. మరో ఓపెనర్ ప్రియాన్ష్ (8)ను మూడో ఓవర్‌లో స్పిన్నర్ దిగ్వేష్ అవుట్ చేసినా సిమ్రన్ జోరు ఆగలేదు. బిష్ణోయ్ ఓవర్‌లో అతను వరుసగా 4,4,6 బాదగా జట్టు పవర్‌ప్లేలో 62/1 పరుగులు సాధించింది. మరో ఎండ్‌లో శ్రేయాస్ చక్కటి సహకారం అందిస్తూ ఎక్కువగా ప్రభ్‌సిమ్రన్‌కే స్ట్రయికింగ్ వచ్చేలా చూశాడు. ఈక్రమంలో ప్రభు 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ మైదానంలో ఎవరికైనా ఇదే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ కావడం విశేషం. అయితే చక్కటి షాట్లతో దూసుకెళుతున్న అతడిని 11వ ఓవర్‌లో దిగ్వేష్ దెబ్బతీశాడు. ఆ ఓవర్ తొలి బంతికి సిమ్రన్ ఆడిన స్లాగ్ స్వీప్ సిక్సర్ ఖాయమనిపించినా.. బదోని బంతిని లోనికి విసిరి రోప్ దాటాడు. అంతలోనే బిష్ణోయ్ ఆ బాల్‌ను అందుకున్నాడు. ఆ తర్వాత కూడా పంజాబ్ జోరు తగ్గలేదు. శ్రేయాస్‌తో పాటు నేహల్ ఎదురుదాడికి దిగాడు. 14వ ఓవర్‌లో వధేరా 6,4,6తో బిష్ణోయ్ 16 రన్స్ సమర్పించుకున్నాడు. అటు శ్రేయాస్ తర్వాతి ఓవర్‌లోనే 4,6 బాదడంతో పంజాబ్ ఛేదన సులువైంది. ఇక 30 బంతుల్లో 17 రన్స్ కావాల్సిన వేళ వధేరా 16వ ఓవర్‌లోనే 6,6,4తో 16 రన్స్ రాబట్టగా.. శ్రేయాస్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. అలాగే 30 బంతుల్లోనే అజేయ హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేశాడు.

ఆదుకున్న పూరన్-బదోని: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్ పేలవంగా ఆరంభమైంది. పంజాబ్ బౌలర్ల పకడ్బందీ బంతులకు 35 పరుగులకే 3 వికెట్లను కోల్పోయింది. అయితే నికోలస్ పూరన్, ఆయుష్ బదోని అండగా నిలిచే ప్రయత్నం చేయడంతో జట్టు స్కోరు ఫర్వాలేదనిపించింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ మార్ష్‌ను పేసర్ అర్ష్‌దీప్ తొలి ఓవర్‌లో గోల్డెన్ డకౌట్‌గా అవుట్ చేశాడు. అటు మరో ఓపెనర్ మార్‌క్రమ్ మూడో ఓవర్‌లో మూడు ఫోర్లతో 13 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే వరుసగా 4,6తో వహ్వా అనిపించినా అతడిని ఫెర్గూసన్ బౌల్డ్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు పూరన్‌తో మార్‌క్రమ్ 31 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక కెప్టెన్ పంత్ (2) మరోసారి తీవ్రంగా నిరాశపరిచాడు. మ్యాక్స్‌వెల్ ఓవర్‌లో అతడు చాహల్‌కు క్యాచ్ ఇవ్వడంతో జట్టు పవర్‌ప్లేలో 39/3 స్కోరుతో నిలిచింది. తొలి ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన పూరన్ పరిస్థితులకు తగ్గట్టు ఆరంభంలో సంయమనం చూపాడు. కాస్త కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపిస్తూ పదో ఓవర్‌లో 4,4,6తో చెలరేగి 15 రన్స్ రాబట్టాడు. ఆ వెంటనే స్టొయినిస్ ఓవర్‌లో 6,4 బాదాడు. కానీ అతను మరింత ప్రమాదకరంగా మారకముందే 12వ ఓవర్‌లో పూరన్‌ను చాహల్ వెనక్కిపంపాడు. దీంతో నాలుగో వికెట్‌కు బదోనితో అతను జోడించిన 54 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం మిల్లర్ (19) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా బదోని-సమద్ జోడీ వేగంగా ఆడి ఆరో వికెట్‌కు 47 పరుగులు జత చేర్చింది. ముఖ్యంగా సమద్ 18వ ఓవర్‌లో 6,4,4తో పాటు బదోని 4తో 20 రన్స్ సమకూరాయి. వీరి జోరుకు జట్టు స్కోరు కూడా 150 దాటింది. కానీ చివరి రెండు ఓవర్లలో పంజాబ్ బౌలర్లు నియంత్రించారు. 19వ ఓవర్‌లో పేసర్ జాన్సెన్ 8 పరుగులే ఇవ్వగా.. ఆఖరి ఓవర్‌లో బదోని, సమద్‌ల వికెట్లు తీసిన అర్ష్‌దీప్ 7 పరుగులే ఇచ్చాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	2	2	0	0	4	2.266
పంజాబ్	2	2	0	0	4	1.485
ఢిల్లీ	2	2	0	0	4	1.320
గుజరాత్	2	1	1	0	2	0.625
ముంబై	3	1	2	0	2	0.309
లఖ్‌నవూ	3	1	2	0	2	-0.150
చెన్నై	3	1	2	0	2	-0.771
హైదరాబాద్	3	1	2	0	2	-0.871
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
కోల్‌కతా	3	1	2	0	2	-1.428

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



శ్రేయాస్ (52 నాటౌట్) నేహల్ (43 నాటౌట్)

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x గుజరాత్	రా.7.30	వేదిక: బెంగళూరు

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (బి) ఫెర్గూసన్ 28, మార్ష్ (సి) జాన్సెన్ (బి) అర్ష్‌దీప్ 0, నికోలస్ పూరన్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) చాహల్ 44, పంత్ (సి) చాహల్ (బి) మ్యాక్స్‌వెల్ 2, బదోని (సి) మ్యాక్స్‌వెల్ (బి) అర్ష్‌దీప్ 41, మిల్లర్ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) జాన్సెన్ 19, సమద్ (సి) ఆర్య (బి) అర్ష్‌దీప్ 27, శార్దూల్ (నాటౌట్) 3, అవేశ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 171/7; వికెట్ల పతనం:** 1-1, 2-32, 3-35, 4-89, 5-119, 6-166, 7-167; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-43-3, ఫెర్గూసన్ 3-0-26-1, మ్యాక్స్‌వెల్ 3-0-22-1, జాన్సెన్ 4-0-28-1, స్టొయినిస్ 2-0-15-0, చాహల్ 4-0-36-1.

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (సి) శార్దూల్ (బి) దిగ్వేష్ రాఠి 8, ప్రభ్‌సిమ్రన్ (సి) బిష్ణోయ్ (బి) దిగ్వేష్ రాఠి 69, శ్రేయాస్ అయ్యర్ (నాటౌట్) 52, నేహల్ వధేరా (నాటౌట్) 43, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 16.2 ఓవర్లలో 177/2; వికెట్ల పతనం:** 1-26, 2-110; **బౌలింగ్:** శార్దూల్ ఠాకూర్ 3-0-39-0, అవేశ్ ఖాన్ 3-0-30-0, దిగ్వేష్ రాఠి 4-0-30-2, రవి బిష్ణోయ్ 3-0-43-0, సిద్దార్థ్ 3-0-28-0, సమద్ 0.2-0-6-0.

అయ్యర్‌కు మళ్లీ సెంట్రల్ కాంట్రాక్ట్?

న్యూఢిల్లీ: భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్‌కు మళ్లీ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కే అవకాశాలున్నాయి. దేశవాళీ క్రికెట్ ఆడాలనే బోర్డు సూచనలను పెడచెవిన పెట్టడంతో 2023-24కు గాను అయ్యర్‌తోపాటు ఇషాన్ కిషన్‌కు బోర్డు కాంట్రాక్ట్‌లు దక్కలేదు. కానీ, శ్రేయాస్ మళ్లీ జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడంతో అతడిపై సానుకూల దృక్పథం ఏర్పడింది. దీంతో త్వరలో ప్రకటించనున్న 2024-25 కాంట్రాక్ట్‌ల జాబితాలో అయ్యర్ పేరు ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇషాన్ మాత్రం మరికొన్ని రోజులు వేచిచూడాల్సిన పరిస్థితి. ఇప్పటికే టీ20లకు గుడ్‌బై చెప్పిన సీనియర్లు రోహిత్ శర్మ, కోహ్లీలకు మరోసారి ఏ+ కాంట్రాక్ట్ ఖాయమని తెలుస్తోంది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి కూడా బోర్డు కాంట్రాక్ట్ దక్కనున్నట్టు సమాచారం.

టాప్-100లో స్నేహిత్



ప్రపంచ టీటీలో తెలుగు కుర్రాడికి 89వ ర్యాంక్

47వ స్థానానికి మానవ్

న్యూఢిల్లీ: తెలుగు క్రీడాకారుడు ఫిడేల్ ఆర్ స్నేహిత్ ప్రపంచ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. అంతర్జాతీయ టీటీ సమాఖ్య మంగళవారం విడుదలజేసిన ర్యాంకింగ్స్‌లో స్నేహిత్ సింగిల్స్‌లో ఏకంగా 34 స్థానాలు ఎగబాకాడు. ఓవరాల్‌గా 89వ ర్యాంకులో నిలిచి తొలిసారి టాప్-100లో చోటు దక్కించుకున్నాడు. ఓ తెలుగు ఆటగాడు టాప్-100లోపు ర్యాంక్ సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. గతవారం చెన్నై వేదికగా జరిగిన డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీలో స్నేహిత్ ప్రీక్వార్టర్స్‌లో వెటరన్ స్టార్ శరత్ కమల్‌ను ఓడించి సంచలన ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. ఇక ఇదే టోర్నీతో ఆటకు వీడ్కోలు పలికిన శరత్ కమల్ 80వ ర్యాంక్‌తో కెరీర్‌ను ముగించాడు. చెన్నై టోర్నీలో సెమీస్ చేరి రికార్డుకెక్కిన భారత స్టార్ మానవ్ టక్కర్ 47వ ర్యాంకుతో తన కెరీర్‌లో అత్యుత్తమస్థానాన్ని దక్కించుకున్నాడు.

లక్ష్య పరాజయం

ప్రపంచ బాక్సింగ్ కప్

న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్ కప్‌లో తొలిరోజు భారత ఆటగాడు లక్ష్య చాహర్‌కు నిరాశ ఎదురైంది. బ్రెజిల్‌లోని ఫోజ్ డొ గువాకులో మంగళవారం జరిగిన 80 కిలోల విభాగం ఆరంభ బౌట్‌లో లక్ష్య 0-5తో స్థానిక బాక్సర్ వాండెర్లీ పెరీరా చేతిలో ఓటమి పాలయ్యాడు. రెండోరోజు పోటీల్లో భారత బాక్సర్లు జదుమాని సింగ్ (50 కిలోలు), నిఖిల్ దూబే (75 కిలోలు), జుగ్నూ (85 కిలోలు) తలపడనున్నారు.

ఆర్చర్లు ధీరజ్, చికితకు వీసా కష్టాలు





హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1 పోటీల్లో పాల్గొనాల్సిన తెలుగు ఆర్చర్లు బొమ్మదేవర ధీరజ్, తానిపర్తి చికితరావుకు వీసా కష్టాలు మొదలయ్యాయి. అమెరికా ఆతిథ్యమిస్తున్న ఈ వరల్డ్‌కప్ టోర్నీ ఈనెల 8న ప్రారంభం కానుంది. జ్యోతి సురేఖ, ధీరజ్, చికిత సహా 23 మంది భారత ఆర్చర్లు బరిలోకి దిగుతున్నారు. వీరిలో ధీరజ్, చికితతో పాటు మరో 9మంది వీసాలకు దరఖాస్తు చేస్తున్నప్పుడు సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో నిర్దిష్ట గడువులోపు దరఖాస్తులు పంపకపోవడంతో వీసాలు మంజూరు కాలేదు. ఈనెల 5వ తేదీలోపు అక్కడికి చేరుకోవాలి. విమాన టిక్కెట్లు బుక్ అయ్యాయి కానీ వీసాలు మంజూరవలేదు. తెలుగు రాష్ట్రాల కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్ నాయుడు, చంద్రశేఖర్ ఈ విషయంలో చొరవ తీసుకోవాలని ఆర్చర్లు సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్‌తో మాట్లాడి తమకు వీసాలు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

హాకీకి వందన వీడ్కోలు




న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన వెటరన్ స్ట్రయికర్ వందన కటారియా (32).. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. కెరీర్‌లో 320 మ్యాచ్‌లు ఆడిన వందన 158 గోల్స్ సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంతో చరిత్ర సృష్టించిన భారత జట్టులో ఆమె కూడా సభ్యురాలు. కెరీర్‌లో అత్యున్నత స్థాయిలో ఉండగా గుడ్‌బై చెప్పాలనుకొన్నానని మంగళవారం సోషల్ మీడియా ద్వారా కటారియా తెలిపింది. హాకీ ఇండియా లీగ్‌లో మాత్రం ఆడతానని చెప్పింది. ఉత్తరాఖండ్‌కు చెందిన వందన.. 2009లో అరంగేట్రం చేసింది. తనదైన ప్రతిభతో అనతికాలంలోనే భారత జట్టులో కీలక సభ్యురాలిగా ఎదిగింది. ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ గోల్స్ సాధించిన తొలి భారత మహిళా ప్లేయర్‌గా కటారియా రికార్డు సృష్టించింది. 2018 ఆసియా క్రీడల్లో రజతం.. 2013, 2018 ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన భారత జట్టులో కటారియా సభ్యురాలు. ప్రభుత్వం పద్మశ్రీ, అర్జున అవార్డులతో ఆమెను సత్కరించింది.

వచ్చే వరల్డ్‌కప్ ఆడతా..



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ తన భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించాడు. దీంట్లో భాగంగా 2027లో జరిగే వన్డే వరల్డ్‌కప్‌లోనూ ఆడాలనుకుంటున్నట్టు తెల్పాడు. చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు విజేతగా నిలిచాక రోహిత్, విరాట్ వన్డే కెరీర్‌పై సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ ఈ ఫార్మాట్ నుంచి ఇప్పట్లో తప్పుకొనే ఆలోచన లేదని ముంబైలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో విరాట్ తెలిపాడు. రాబోయే వన్డే వరల్డ్‌కప్ గెలుచుకునేందుకు ప్రయత్నించడమే తన ముందున్న పెద్ద లక్ష్యంగా స్పష్టం చేశాడు. గతేడాది టీ20 వరల్డ్‌కప్ గెలిచాక రోహిత్, విరాట్, జడేజాలు ఆ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.

బంగారంగరం!



- రూ.94,000 దాటిన 10 గ్రాముల పసిడి
- ఒక్కరోజే రూ.2,000 పెరుగుదలతో సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి..
- గత 2 నెలల్లో ఇదే అతిపెద్ద పెరుగుదల

న్యూఢిల్లీ: పసిడి ధరలు మంగళవారం సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై ఏకంగా రూ.2,000 పెరిగి రూ.94,150కి చేరింది. దేశీయంగా మేలిమి బంగారం రూ.94,000కు చేరడం ఇదే ప్రప్రథమం. అంతేకాదు, ఈ విలువైన లోహం రేటు పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. అంతర్జాతీయంగా దీని ధరలు వేగంగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.2000 పెరుగుదలతో ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.93,700కు ఎగబాకింది. దాదాపు 2 నెలల్లో గోల్డ్‌కు ఇదే అతిపెద్ద ఒక్కరోజు పెరుగుదల. ఈ ఫిబ్రవరి 10న తులం పసిడి రూ.2,400 పెరుగుదలను నమోదు చేసింది. ఈ జనవరి 1న రూ.79,390 పలికిన బంగారం.. గడిచిన మూడు నెలల్లో రూ.14,760 (18.6 శాతం) మేర పుంజుకుంది. వెండి విషయానికొస్తే, కిలో రూ.500 తగ్గుదలతో రూ.1,02,500కు పరిమితమైంది.

అంతర్జాతీయ మార్కెట్లోనూ కొత్త రికార్డు

ట్రంప్ సుంకాలు వాణిజ్య యుద్ధాలకు దారి తీయనున్నాయన్న భయాందోళనలతో ఇన్వెస్టర్లు ఈక్విటీల్లోని పెట్టుబడులను ఈ విలువైన లోహాల్లోకి మళ్లిస్తున్నారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,149.03 డాలర్లు, జూన్ డెలివరీ గడువుతో కూడిన కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు 3,177 డాలర్ల వద్ద ఆల్‌టైం గరిష్ఠాలను నమోదు చేశాయి. సిల్వర్ మాత్రం అర శాతానికి పైగా తగ్గి 33.83 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఏడాది చివరినాటికి 4,000 డాలర్లకు!?

ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల సమయాల్లో మన పెట్టుబడులకు భద్రత కలిగించే సాధనంగా బంగారానికి పేరుంది. ట్రంప్ సుంకాల ప్రకటనలు అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితిని పెంచడంతో ఈ ఏడాది గోల్డ్ రేటు భారీగా పెరిగింది. ఈ మార్చి 14న ఔన్స్ బంగారం తొలిసారిగా 3,000 డాలర్లకు చేరింది. ప్రస్తుతం 3,150 డాలర్ల స్థాయిలో ట్రేడవుతోంది. ఈనెల 2 నుంచి అమలులోకి రానున్న ట్రంప్ సుంకాలు వాణిజ్య అనిశ్చితులను తీవ్రతరం చేయనుంది. ఇందుకు తోడు, అమెరికా మళ్లీ ఆర్థిక మాంద్యంలోకి జారుకునే అవకాశాలూ రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈనేపథ్యంలో గోల్డ్ ర్యాలీ మున్ముందూ కొనసాగవచ్చని, ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ 4,000 డాలర్లకు చేరుకునే అవకాశాలున్నాయని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు.

బిజినెస్

మార్కెట్లో ట్రంప్ సుంకంపం!



భారీ నష్టాలతో 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం

సెన్సెక్స్ 1,390 పాయింట్లు పతనం

23,200 దిగువ స్థాయికి జారిన నిఫ్టీ

రూ. 3.44 లక్షల కోట్ల సంపద ఉఫ్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరానికి (2025-26) భారీ నష్టాలతో స్వాగతం పలికాయి. ఈ నెల 2 నుంచి ట్రంప్ పరస్పర సుంకాలు అమలు చేయనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై భారీగా అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో ప్రామాణిక సూచీలు కుప్పకూలాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 1,390.41 పాయింట్లు (1.80 శాతం) క్షీణించి 76,024.51 వద్దకు జారుకుంది. ఒక దశలో సూచీ 1,502 పాయింట్ల మేర క్షీణించి 76,000 స్థాయిని సైతం కోల్పోయినప్పటికీ, తిరిగి నిలబెట్టుకోగలిగింది. కొవిడ్ సంక్షోభ కాలమైన 2020లో చవిచూసిన మార్కెట్ పతనం తర్వాత సెన్సెక్స్‌కు ఆర్థిక సంవత్సర ప్రారంభం రోజున ఇదే అతిపెద్ద నష్టం. అంతేకాదు, సూచీకి గడిచిన నెల రోజుల్లో ఇదే అతి పెద్ద ఒక్కరోజు క్షీణత కూడా. నిఫ్టీ విషయానికొస్తే, 353.65 పాయింట్ల (1.50 శాతం) పతనమై 23,165.70 వద్ద స్థిరపడింది. అమ్మకాలు పోటెత్తడంతో ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.44 లక్షల కోట్లు తగ్గి రూ.409.43 లక్షల కోట్లకు (4.78 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్ 3.87 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా 3 శాతానికి పైగా పతనమయ్యాయి. బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా స్టాక్స్ 2.81 శాతం వరకు నష్టపోగా.. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.77 శాతం తగ్గింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్ మాత్రం 5.11 శాతం ఎగిసి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.04 శాతం నష్టపోగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ అతి స్వల్ప లాభాన్ని నమోదు చేసింది. రంగాలవారీ సూచీల్లో టెలికాం, ఆయిల్ అండ్ గ్యాస్ మినహా అన్నీ నేలచూపు చూశాయి. రియల్టీ ఇండెక్స్ 3.05 శాతం క్షీణించగా.. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఫోకస్డ్ ఐటీ రెండు శాతానికి పైగా పతనమయ్యాయి.

వొడాఫోన్ ఐడియా షేరు 19 శాతం అప్

ప్రైవేట్ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా షేరు దాదాపు 19 శాతం పెరిగి రూ.8.10 వద్ద ముగిసింది. కంపెనీ చెల్లించాల్సిన రూ.36,950 కోట్ల బకాయిలను కేంద్ర ప్రభుత్వం సంస్థలో ఈక్విటీ వాటాగా మార్చుకున్న నేపథ్యంలో షేరుకు డిమాండ్ భారీగా పెరిగింది.

కాగ్నిజెంట్ జీసీసీ సర్వీస్ గ్లోబల్ హెడ్‌గా శైలజ జోస్యుల

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ టెక్నాలజీ, ప్రొఫెషనల్ సేవల సంస్థ కాగ్నిజెంట్ తన జీసీసీ సర్వీస్ లైన్‌కి కొత్త గ్లోబల్ హెడ్‌ను నియమించింది. ఇప్పటికే కాగ్నిజెంట్‌లో వివిధ ఉన్నత పదవులు నిర్వహించిన శైలజ జోస్యులను ఈ విభాగం గ్లోబల్ హెడ్‌గా నియమించినట్టు తెలిపింది. ఆమె ఈ హోదాలో హైదరాబాద్ నుంచి పని చేస్తారు. శైలజ తన 30 ఏళ్ల ఉద్యోగ జీవితంలో కాగ్నిజెంట్, ఈవై, థామ్సన్ రాయిటర్స్, హెచ్ఎస్‌బీసీ వంటి పలు ప్రముఖ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.

హైదరాబాద్‌లో ఎక్స్‌పీరియన్ జీఐసీ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డేటా, టెక్నాలజీ కంపెనీ ఎక్స్‌పీరియన్ హైదరాబాద్‌లోని తన గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ (జీఐసీ)ను 85,000 చదరపు అడుగులకు విస్తరించింది. ఇప్పుడున్న సామర్థ్యం కంటే ఇది రెట్టింపునకు పైగా ఎక్కువని తెలిపింది. ఈ జీఐసీ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ ఖాతాదారులకు క్లౌడ్ మైగ్రేషన్, ఏఐ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ప్రాసెస్ అడ్వాన్స్‌మెంట్ సేవలు అందిస్తామని పేర్కొంది.

మార్చి జీఎస్‌టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

- గత నెలలో 9.9% పెరిగిన వసూళ్లు
- తెలంగాణలో రూ.5,401 కోట్లు
- ఏపీలో రూ.4,033 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి నెలలోనూ జీఎస్‌టీ వసూళ్లు పెరిగాయి. గత నెల మొత్తానికి ఈ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 9.9 శాతం ఎక్కువ. మార్చి నెల మొత్తానికి సీజీఎస్‌టీ రూపంలో రూ.38.100 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూపంలో రూ.49,900 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూపంలో రూ.95,900 కోట్లు, జీఎస్‌టీ సెస్సు రూపంలో రూ.12,300 కోట్లు వసూలయ్యాయి. రిఫండ్స్ తీసివేస్తే గత నెల మొత్తానికి నికరంగా జీఎస్‌టీ వసూళ్లు రూ.1.76 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 7.3 శాతం ఎక్కువ.

2024-25లో రూ.22.08 లక్షల కోట్లు

మార్చి ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా జీఎస్‌టీ వసూళ్లు రూ.22.08 లక్షల కోట్లకు చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.4 శాతం ఎక్కువ. రిఫండ్స్‌ని తీసివేసినా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.19.56 లక్షల కోట్ల జీఎస్‌టీ వసూలైంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 8.6 శాతం ఎక్కువ.

తెలుగు రాష్ట్రాల్లో అంతంతే

గత నెల జీఎస్‌టీ వసూళ్లు దేశవ్యాప్తంగా 9.9 శాతం పెరిగినా, రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం పెద్దగా ఎదుగుబొదుగూ లేదు. రెండు రాష్ట్రాల నుంచి గత నెల రూ.9,434 కోట్ల జీఎస్‌టీ వసూలైంది. ఇందులో ఏపీ నుంచి రూ.4,033 కోట్లు, తెలంగాణ నుంచి రూ.5,401 కోట్లు వసూలయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఏపీలో వసూళ్లు ఒక శాతం పడిపోగా తెలంగాణాలో జీరో శాతం వృద్ధి రేటు నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) మొత్తానికి చూసినా ఏపీలో 1.2 శాతం పెరిగి రూ.44,825 కోట్లకు, తెలంగాణాలో 5.1 శాతం వృద్ధి రేటుతో రూ.62,987 కోట్లకు చేరాయి.

ఆటో అమ్మకాల వృద్ధి అంతంతే...

మారుతి, హ్యుండయ్ అమ్మకాల్లో క్షీణత

న్యూఢిల్లీ: దేశంలో ప్రముఖ కార్ల తయారీదారులైన మారుతి సుజుకీ, హ్యుండయ్ మార్చి నెలలో నిరాశావహమైన అమ్మకాలు నమోదు చేశాయి. ఇన్వెంటరీలో దిద్దుబాటు, డిమాండ్ క్షీణత ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలంటున్నాయి. ఇదే సమయంలో ఎస్‌యూవీలకు ఏర్పడిన డిమాండుతో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ గత ఏడాది మార్చితో పోల్చితే అమ్మకాల్లో వృద్ధిని సాధించాయి. మార్చి నెలలో మారుతి సుజుకీ అమ్మకాలు 1 శాతం తగ్గి 1,50,743కి పరిమితం అయ్యాయి. గత ఏడాది మార్చిలో కంపెనీ 1,52,718 యూనిట్లు విక్రయించింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కంపెనీ దేశీయ విక్రయాలు స్వల్పంగా పెరిగి 17,60,767కి చేరాయి. 2023-24 సంవత్సరంలో విక్రయాలు 17,59,881గా ఉన్నాయి.

అమ్మకాలు

కంపెనీ	2025 మార్చి	2024 మార్చి	2024-25	2023-24
హ్యుండయ్ మోటార్స్	51,820 (-)	53,001	5,98,666 (-)	6,14,721
మహీంద్రా	48,048 (+)	40,631	5,51,487 (+)	4,59,877
టాటా మోటార్స్	51,872 (+)	50,297	5,56,263 (-)	5,73,495
కియా ఇండియా	25,,525 (+)	21,400	2,55,207 (+)	2,45,634
టయోటా కిర్లోస్కర్	30,043 (+)	27,180	3,37,148 (+)	2,63,512
జేఎస్‌డబ్ల్యూ మోటార్	5,500 (+)	5,050	-----	-----
హోండా కార్స్	7,228 (+)	7,071	1,26,151 (+)	1,24,173
అశోక్ లేలాండ్	24,060 (+)	22,736	-----	-----

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	450
వరంగల్	427	గోదావరి	425
చిత్తూరు	520	విశాఖపట్నం	440
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	146	విజయవాడ	152
వరంగల్	146	గుంటూరు	152
కరీంనగర్	146	ఒంగోలు	152
మహబూబ్‌నగర్	146	చిత్తూరు	117
కర్నూలు	146	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	122
గోదావరి	152		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	92,840 ▲	85,100 ▲	1,14,000 ▲
విజయవాడ	94,200 ▲	88,000 ▲	1,03,000 ▲
విశాఖపట్నం	89,310 ▲	81,870 ▲	1,00,600 ▼
రాజమండ్రి	92,840 ▲	85,100 ▲	1,03,100 ▼
ప్రొద్దుటూరు	93,100 ▲	85,840 ▲	1,00,800 ▼
ముంబై	91,150 ▲	83,461 ▲	99.641 ▼


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

నేడే బీసీల పోరుగర్జన

- 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు..
- న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోరు
- బీసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- హాజరు కానున్న రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, అఖిలేశ్ యాదవ్, కనిమొళి, అసదుద్దీన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పార్లమెంట్ ఆమోదించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు బీసీ సంఘాలు పోరుకు సిద్ధమయ్యాయి. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 'బీసీల పోరుగర్జన, మహాధర్నా' కార్యక్రమాన్ని బుధవారం చేపడుతున్నాయి. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, 29 రాష్ట్రాల ఓబీసీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు రాష్ట్ర మంత్రులు మంగళవారం రాత్రే ఢిల్లీ చేరుకున్నారు. మరోవైపు ఈ మహాధర్నాను జయప్రదం చేసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి 1500 మంది బీసీ నేతలతో సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన ప్రత్యేక రైలు మంగళవారమే ఢిల్లీ చేరుకుంది. ఇక, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఢిల్లీలో పలువురు నేతలను కలిసి ధర్నాకు ఆహ్వానించారు. కాగా, బీసీ రిజర్వేషన్లపై బీజేపీ తీరు గల్లీలో ఒకలా, ఢిల్లీలో మరోలా ఉందని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడిన జాజుల.. బీసీ రిజర్వేషన్ల బిల్లులకు తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ మద్దతు పలికిందని తెలిపారు. కానీ, బీసీల్లో ముస్లింలు ఉన్నందున బిల్లులను అడ్డుకోవాలని కేంద్ర మంత్రి అమిత్‌షా తమ పార్టీ నేతలను ఆదేశించారని వివరించారు. జంతర్ మంతర్ వేదికగా 12 బీసీ సంఘాలు 'బీసీల పోరు గర్జన మహాధర్నా' చేస్తున్నాయని తెలిపారు. కేంద్రం సహకరించకపోతే దేశవ్యాప్తంగా మరో మండల్ కమిషన్ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఇక, బీసీల న్యాయమైన హక్కుల కోసం సంఘీభావంగా చేపడుతున్న 'బీసీల పోరు గర్జన'లో విపక్షాలన్నీ భాగస్వామ్యం అవ్వాలని కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షట్కర్, అనిల్‌కుమార్ యాదవ్ విలేకరుల సమావేశంలో అన్నారు. కాగా, మహాధర్నా అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖల నేతృత్వంలో బీసీ ఎమ్మెల్యేలు.. రెండు బిల్లులకు మద్దతు కోసం కేంద్ర మంత్రులు, జాతీయ పార్టీల నేతలను కలవనున్నారు.

సన్నాలకు రైతులు సై!



- ఈ ఖరీఫ్‌లో 50 లక్షల ఎకరాలు దాటే అవకాశం
- సన్నాల సాగుకు రైతుల ఆసక్తి
- బోనస్‌తో పెరిగిన సన్న ధాన్యం ధరలు
- సన్నబియ్యం పంపిణీతో మరింత ధీమా

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు సన్నాల సాగుకు సై అంటున్నారు. ఇంతకాలం దొడ్డురకాలకు, సన్నరకాలకు ఒకే కనీస మద్దతు ధర ఉండటంతో గిట్టుబాటు కాదని భావించిన రైతులు... బోనస్ పథకం అమలులోకి రావటంతో సన్నాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ పథకం కూడా ప్రారంభం కావటంతో రైతులకు మరింత ధీమా వచ్చింది. వచ్చే వానాకాలంలో వరి సాగులో 80 శాతం వరకు సన్నాలే సాగవుతాయని, సన్నరకాల సాగు విస్తీర్ణం 50 లక్షల ఎకరాలు దాటే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. 2023-24 వానాకాలంలో 25 లక్షల ఎకరాలు, యాసంగిలో 14 లక్షల ఎకరాల్లో సన్నరకాలు సాగయ్యాయి. 2024-25 సంవత్సరానికి వచ్చేసరికి ఈ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వానాకాలంలో 40.55 లక్షల ఎకరాలు, యాసంగిలో 22.68 లక్షల ఎకరాల్లో సన్నరకాలు సాగు చేశారు. 2024-25 వానాకాలంలో మొత్తం వరి సాగు విస్తీర్ణం 65.50 లక్షల ఎకరాలు కాగా... ఇందులో 62 శాతం విస్తీర్ణంలో సన్నాలు సాగయ్యాయి. ఇక యాసంగిలో వరి సాగు విస్తీర్ణం 56.69 లక్షల ఎకరాలు కాగా 40 శాతం విస్తీర్ణంలో సన్నాలు సాగు చేశారు. వచ్చే వానాకాలంలో (2025-26) వరి సాగు విస్తీర్ణం 67 లక్షల ఎకరాలు ఉంటుందని... ఇందులో సన్నాల విస్తీర్ణం 50 లక్షల ఎకరాలు దాటుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బోనస్ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. సన్నరకాలకు కనీస మద్దతు ధరపై క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,300 ఉండగా దానికి రూ.500 కలపడంతో రూ.2,800కు చేరింది. దీంతో బహిరంగ మార్కెట్లో ధరలు కూడా ఒక్కసారిగా పెరిగాయి. గత వానాకాలం సీజన్‌లో జైశ్రీరాం లాంటి డిమాండ్ ఉన్న ధాన్యాన్ని రైతులు క్వింటాలుకు రూ.3 వేల చొప్పున విక్రయించారు. వానాకాలంలో గిట్టుబాటు కావటం, బోనస్ పథకం కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించటంతో రైతులు యాసంగిలో కూడా సన్నాల విస్తీర్ణం పెంచారు. 2023- 24 యాసంగితో పోలిస్తే 2024- 25 యాసంగిలో సన్నాల సాగు విస్తీర్ణం సుమారు 9 లక్షల ఎకరాలు పెరిగింది. ఈ క్రమంలో వచ్చే ఖరీఫ్‌లో సన్నాల విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలున్నాయి.


సిరిసిల్లలో బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్


యాదగిరిగుట్టలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సన్నబియ్యం సంబరం

(మొదటిపేజీ తరువాయి)

సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో అన్ని మండలాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు సచివాలయం నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బియ్యం నాణ్యత, పరిమాణం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఇప్పటికే 50 శాతానికి పైగా బియ్యం కోటా రేషన్ డిపోలకు చేరిందని, రెండు రోజుల్లో మిగిలిన కోటాను కూడా సరఫరా చేస్తామని తెలిపారు. కాగా, రైస్‌మిల్లుల్లో కస్టమ్ మిల్లింగ్ చేయించిన బియ్యాన్ని మధ్యంతర గోదాముల్లో నిల్వ చేశారు. అక్కడి నుంచి రేషన్ షాపులకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ షాపులకు చేరింది. మరో లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం రెండు రోజుల్లో చేరుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో గత వానాకాలం సీజన్‌లో సేకరించిన 24 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యంతో 16 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరిగింది. ఇవి 8 నెలల కోటాకు సరిపోతాయి. మరో నాలుగు నెలలకు యాసంగిలో సేకరించిన ధాన్యంతో బియ్యం సరఫరా చేయనున్నారు.


నల్లగొండ జిల్లా జి.యడవల్లిలో సన్నబియ్యంతో మహిళల సంబురం

మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం హాజరు..

రాష్ట్రవ్యాప్తంగా 17,311 చౌకడిపోలు ఉన్నాయి. మంగళవారం 7,623 చౌకడిపోల్లో బియ్యం పంపిణీ చేపట్టారు. జగిత్యాల, నారాయణపేట జిల్లాల్లో మాత్రమే బియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కరీంనగర్ జిల్లాలో మంత్రి పొన్నం ప్రభాకర్ బియ్యం పంపిణీలో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు.. లబ్ధిదారులతో కలిసి సన్నబియ్యం అన్నంతో సహపంక్తి భోజనం చేశారు. భువనగిరిలో సన్నబియ్యం పంపిణీ వేదికపై పెట్టిన ఫ్లెక్సీలో ప్రధానమంత్రి ఫొటో లేదని కొందరు బీజేపీ కార్యకర్తలు ప్రశ్నించారు. అయితే మోదీ ఫొటో ఉందని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి సర్ది చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు మోదీ ఫొటో విషయంలో స్వల్పంగా ఘర్షణ పడ్డారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యం బాగున్నాయంటూ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా గరిడేపల్లి, కనగల్‌లో బియ్యం తీసుకోగానే లబ్ధిదారులు వంట చేసుకున్నారు. గతంలో మార్కెట్లో కొనుగోలు చేసి తీసుకున్న బీపీటీ, సోనా మసూరి తరహాలోనే ఈ సన్నబియ్యం ఉన్నాయని తెలిపారు. దొడ్డుబియ్యం వండితే అన్నం ముద్ద అయ్యేదని, సన్నబియ్యం అన్నం పొడిపొడిగా బాగుందని అన్నారు.

తొలిరోజే ఖాళీ అయిన స్టాక్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సన్నబియ్యం పంపిణీలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సన్న బియ్యం కోసం లబ్ధిదారులు ఉదయం నుంచే బారులు తీరగా పంపిణీలో కొంత జాప్యం జరగడం, ఎండ వేడిమి కారణంగా ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల లబ్ధిదారుల మధ్య స్వల్పవాగ్వాదాలు జరిగాయి. అయితే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు షాపుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సన్న బియ్యం పంపిణీ జరుగుతున్న క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటాలను రేషన్ షాపుల వద్ద ప్రదర్శించలేదని, దీనిపై ప్రచారం లేదంటూ పలు చోట్ల బీజేపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల మోదీ ఫొటోలను వారే ఏర్పాటు చేశారు. కాగా, ఈ నెల 15 వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సన్నబియ్యం ఇస్తామని రేషన్ డీలర్లు తెలిపారు. గతంతో పోలిస్తే మొదటి రోజు జనం తాకిడి పెరిగిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల డీలర్లు అన్నారు. కాగా, హైదరాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఏప్రిల్ 29 వరకు అమల్లో ఉండడంతో.. సన్నబియ్యాన్ని మే నెల నుంచి పంపిణీ చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. అయితే పోర్టబిలిటీ సౌకర్యం ఉండటంతో.. కొందరు రేషన్ వినియోగదారులు పొరుగున ఉన్న మేడ్చల్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వెళ్లి సన్నబియ్యం తీసుకున్నారు. దీంతో ఈ జిల్లాల పరిధిలోని కొన్ని రేషన్ షాపుల్లో మొదటిరోజే స్టాక్ అయిపోయిందని డీలర్లు తెలిపారు. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో రెండో విడత స్టాక్‌ను పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.


హనుమకొండ తొమ్మిదో డివిజన్ రాయపురలో సన్న బియ్యం కోసం వచ్చిన లబ్ధిదారులు

'డబుల్' బెంబేలు!

- డబుల్ ఇళ్ల నిర్మాణంపై చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు
- నిధుల విడుదల లేనే లేదు
- లెక్కలు తేల్చాలని జీహెచ్ఎంసీకి కాంట్రాక్టర్ల లేఖలు
- అసంపూర్తి పనులకు 3 వేల కోట్లు కావాలి
- రెండేళ్లుగా అరకొరగా నిధుల విడుదల



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంపై కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు.. అరకొర మినహా రెండేళ్లుగా నిధులు రాకపోవడం.. బకాయిలు చెల్లించకపోవడంతో కొన్ని కాంట్రాక్టు సంస్థలు పనులు మానేశాయి. అప్పులు తెస్తూ ఇళ్లు కట్టడం తమ వల్ల కాదని.. ఇప్పటిదాకా చేసిన పనులకు సంబంధించిన లెక్కలు తేల్చి.. పేరుకుపోయిన బకాయిలు ఇవ్వాలంటూ జీహెచ్ఎంసీ అధికారులకు కాంట్రాక్టర్లు విజ్ఞప్తిచేస్తున్నారు. ఇప్పటికే దాదాపు పది మంది కాంట్రాక్టర్లు అధికారులకు లేఖలు అందజేసినట్లు సమాచారం. బీఆర్ఎస్ హయాంలో గ్రేటర్ పరిధిలో రూ.9,714.59 కోట్లతో లక్ష రెండు పడకల ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. 97 వేలకుపైగా. ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా 69 వేలకు పైగా పూర్తయ్యాయి. వీటిలో సుమారు 65 వేల ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించారు. మరో 28 వేల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు నిలిచిపోయిన పనులు చాలాచోట్ల తిరిగి ప్రారంభం కాలేదు. రూ.200 కోట్లకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్టు జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం.. నిధుల విడుదల నిలిచిపోవడంతో ఇళ్ల నిర్మాణంలో అయోమయం నెలకొంది.

రూ.3 వేల కోట్లకుపైగా...

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి గ్రేటర్‌తోపాటు శివార్లలోని 109 ప్రాంతాలు గుర్తించారు. జీ ప్లస్ త్రీ, స్టిల్ట్ ప్లస్ 5, 9, 10, 11 అంతస్తులుగా భవనాలు నిర్మించారు. ఒక్కో ఇంటికి అంతస్తులను బట్టి రూ.7.5, రూ.8.5, రూ.8.65 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం ఇంటికి రూ.1.5 లక్షల చొప్పున ఇవ్వనుండగా.. మిగతా వ్యయం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. పూర్తయి కేటాయింపునకు సిద్ధంగా మరో 4,600 ఇళ్లు ఉన్నాయి. వివిధ దశల్లో ఉన్న 28 వేల ఇళ్ల నిర్మాణానికి రూ.2823.49 కోట్లు అవసరం అని అంచనా వేశారు. 2016, 17 సంవత్సరాల్లో జరిగిన అగ్రిమెంట్లు కావడంతో అప్పటి స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) ప్రకారం ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుత ధరల ప్రకారం రూ.3000 కోట్లకుపైగా అవసరం అని ఓ అధికారి తెలిపారు. కాంట్రాక్టర్ల లేఖల నేపథ్యంలో విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఒకవేళ కాంట్రాక్ట్ ఏజెన్సీలు తప్పుకొంటే అసంపూర్తి పనులకు సంబంధించి తిరిగి ప్రతిపాదనలు రూపొందించి టెండర్ ప్రకటిస్తామని చెప్పారు. పనులు చేసినట్టు జీహెచ్ఎంసీ ఇచ్చే ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ కావాలనుకునే సంస్థలు మినహా ఇతర ఏజెన్సీలు పనుల నుండి తప్పుకుంటున్నట్టు సమాచారం.

కేటాయించిన ఇళ్లలో..

గతంలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలో కనీస వసతులు లేవు. విద్యుత్తు, తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు లేకపోవడంతో 70 శాతం ఇళ్లలోకి లబ్ధిదారులు వెళ్లలేదు. చోరీకి గురైన నల్లాలు, విద్యుత్తు వైర్లు తిరిగి అమర్చడంతోపాటు.. పాడైన లిఫ్టులు, మోటార్లను మరమ్మతు చేస్తున్నారు. ఇందు కోసం రూ.100 కోట్లు వెచ్చిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా లబ్ధిదారుల ఎంపిక జరగ్గా... వసతుల విషయాన్ని అప్పట్లో పట్టించుకోలేదు. ఆ ఇళ్లలో ఉండలేమంటూ కొందరు ఇప్పటికే అమ్ముకోవడం గమనార్హం.

ఇదీ లెక్క...

- గ్రేటర్‌లో నిర్మించాలనుకున్న రెండు పడకల ఇళ్లు - 100000
- అంచనా వ్యయం - రూ.9,714.59 కోట్లు
- ఖర్చు చేసిన నిధులు - రూ.6,891.10 కోట్లు
- పనులు ప్రారంభించనవి - 97,629 (108 ప్రాంతాలు)
- పనులు మొదలు పెట్టాల్సిన ఇళ్లు - 2,371
- పూర్తయిన ఇళ్లు - 69,633 (73 ప్రాంతాలు)
- జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లు - 64,348
- కేటాయింపునకు సిద్ధంగా ఉన్న ఇళ్లు - 1,933
- గ్రేటర్ ఆవలి ప్రాంతాల్లో స్థానిక కోటా ఇళ్లు - 3,352
- ఇందులో కేటాయించిన ఇళ్లు - 713
- కేటాయింపునకు సిద్ధంగా ఉన్న ఇళ్లు- 2,639
- అసంపూర్తిగా ఉన్న ఇళ్లు - 27,996
- వీటిని పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులు - రూ.2823.49 కోట్లు


ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో వరంగల్‌జిల్లా నాయకులతో సమావేశమైన కేసీఆర్

కాంగ్రెస్‌ది వింత పాలన

- ఇబ్బందుల్లో అన్ని వర్గాల ప్రజలు
- మార్పు కోరుకున్న రైతులకు కన్నీళ్లే
- ఈ దుస్థితిని కలలో కూడా ఊహించలేదు
- 10 లక్షల మందితో వరంగల్‌లో భారీ సభ: కేసీఆర్

గజ్వేల్/మర్కుక్/హైదరాబాద్/వరంగల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వింతగా ఉందని, అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. మార్పు కోరుకున్న రైతులకు కన్నీళ్లే మిగిలాయని, వారికి ఈ దుస్థితి వస్తుందని తాను కలలో కూడా ఊహించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలతో ప్రజలంతా మనోధైర్యం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు స్పందించాలని, ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ సర్కారుపై పోరాటం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఆ జిల్లా నేతలు, పార్టీ ముఖ్యులతో మంగళవారం ఎర్రవెల్లిలోని తన ఫాంహౌస్‌లో కేసీఆర్ సమావేశమయ్యారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారని, బహిరంగ సభకు వారు స్వచ్ఛందంగా తరలివస్తారని చెప్పారు. 10 లక్షల మంది పాల్గొనేలా విస్తృత ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్కతుర్తిలో బహిరంగ సభ కోసం గుర్తించిన స్థలంలో బుధవారం మధ్యాహ్నం భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. ఎండాకాలం కావడంతో సభకు హాజరయ్యే వారికి చిన్నపాటి ఇబ్బంది కూడా కలగకుండా చూడాలన్నారు. ఈ మేరకు 10 లక్షల చొప్పున మజ్జిగ ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లు అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా 1500 మంది వాలంటీర్లను నియమించాలని, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా మార్చి 28న 'ఆంధ్రజ్యోతి' వరంగల్ జిల్లా సంచికలో 'గడబిడల గులాబీ' శీర్షికన ప్రచురితమైన కథనంపై సమావేశంలో ప్రస్తావన వచ్చింది. దీంతో పార్టీలో విభేదాలను పక్కన పెట్టాలని జిల్లా నేతలకు కేసీఆర్ సూచించారు.

154 ఎకరాల్లో సభా ప్రాంగణం..

బీఆర్ఎస్ రజతోత్సవ సభను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, ఎల్కతుర్తి వద్ద ఎంపిక చేసిన చోట సభా ప్రాంగణం మొత్తం 154 ఎకరాల్లో ఉంటుందని వరంగల్ జిల్లా నేతలు తెలిపారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాలను కలిపే జాతీయ రహదారి 563, 763కు జంక్షన్‌ను కేంద్రంగా చేసుకొని స్థలాన్ని ఎంచుకున్నామన్నారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశం మేరకు అక్కడ 1,213 ఎకరాలను చదును చేశామని, ఇందులో 154 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ ప్రాంగణం ఉంటుందని వివరించారు. 50 వేల వాహనాలు నిలిపేందుకు వీలుగా 1,059 ఎకరాల స్థలంలో పార్కింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఉద్యమ సమయంలో అనేక భారీ సభలను సమరంగా నిర్వహించి విజయవంతం చేశామని, వరంగల్‌లో సభ నిర్వహణ తమ పార్టీకి కలిసొచ్చే అంశమని చెప్పారు.


పాత మల్కాజిగిరిలో హనుమాన్ దేవాలయాన్ని సందర్శించిన సినీహీరో సుమన్

ఆలయాలకు సంప్రదాయంగా వెళ్లండి

- మేకప్, నగలు వద్దు
- మహిళలకు హీరో సుమన్ సూచన

మల్కాజ్‌గిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆలయాలకు సంప్రదాయబద్ధంగా వెళ్లాలని, సినిమా షూటింగ్‌కు వెళ్తున్నట్టుగా మేకప్‌లు, నగలు వేసుకుని వెళ్లకూడదని సినీహీరో సుమన్ అన్నారు. మంగళవారం పాత మల్కాజిగిరిలో పునర్నిర్మాణంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఆయన దర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి ఆసక్తికర సూచనలు చేశారు. సాంప్రదాయ పద్ధతుల్లో మామూలుగానే ఆలయాలకు వచ్చి దైవదర్శనం చేసుకోవాలని కోరారు. మేకప్‌లు వేసుకుని, నగలు ధరించి వస్తే దేవుడు కరుణించడని అన్నారు. భక్తిమార్గంలోనే హిందూధర్మాన్ని పాటిస్తూ దైవదర్శనాలు చేసుకోవాలని సూచించారు. ఎవరిని తాను కించపర్చాలన్న ఉద్దేశంతో ఈ మాటలు చెప్పడం లేదని అన్నారు. గుడికి వస్తున్నప్పుడు డ్రెస్‌కోడ్‌తో రావాలని, ఫ్యాషన్ షోలకు వెళ్తున్నట్టు ఉండకూడదని చెప్పారు. ఆలయాలకు యువత మద్యం సేవించి వస్తున్నారని అలాంటి వారిని ఆలయ నిర్వాహకులు గుర్తించి తరిమేయాలని అన్నారు..

ఎల్ఆర్ఎస్‌లో ఈ నెల కూడా 25% రాయితీ

- గడువు పొడిగింపుపై నేడు ఉత్తర్వులు!

హైదరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)లో 25 శాతం రాయితీని ఈ నెల కూడా కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిసింది. గత నెల 25 శాతం రాయితీని ప్రకటించిన ప్రభుత్వం.. 31వ తేదీ వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుందని ప్రకటించింది. దరఖాస్తుదారుల విజ్ఞప్తితో ఈ గడువును మరో నెల రోజులు పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు రానున్నాయని పురపాలక శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మార్చి 31న 43,700 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. ఆ ఒక్క రోజే ఫీజు కింద రూ.124 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటివరకు 4,43,000 మంది ఫీజు చెల్లించారు. అధికారులు మంగళవారం (ఏప్రిల్ 1న) కూడా ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని వర్తింపజేశారు.

విద్యార్థులకు నష్టం చేసే పని రేవంత్ చేయడు

- అద్దంకి దయాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నష్టం వాటిల్లే పనిని సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో చేయబోడని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. హెచ్‌సీయూ 400 ఎకరాల భూమిని హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో పోరాటం చేసి మరీ సాధించారన్నారు. హెచ్‌సీయూ పక్కన సర్వే నెంబరు 25లోని 400 ఎకరాల భూమి కోసం సీఎం రేవంత్‌రెడ్డి.. కోర్టుల్లో కొట్లాడిన విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. దాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయాన్ని తెచ్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నడన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఆ భూములను వేలం వేసి ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించాలని చూస్తే.. తామే పోరాటం చేసి అడ్డుకున్నామని చెప్పారు. విద్యార్థుల్లో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని బీజేపీ చూస్తోందన్నారు. వర్సిటీకి సెంటు భూమి ఇవ్వని ఆ పార్టీ.. దొంగ నాటకాలు ఆడుతోందన్నారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎం, మంత్రుల సరదా ముచ్చట్లు!

- సెల్‌ఫోన్‌లో బంధించిన సీతక్క

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూ వివాదంపై ఇక్కడి కమాండ్ కంట్రోల్‌లో అందుబాటులో ఉన్న మంత్రులతో మంగళవారంనాడు భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి.. అనంతరం కమాండ్ కంట్రోల్ ఆవరణలోనే సరదాగా గడిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సరదాగా మాట్లాడుకున్నారు. ఈ ఆసక్తికర సన్నివేశాన్ని అక్కడే ఉన్న మంత్రి సీతక్క.. తన సెల్‌ఫోన్‌లో బంధించారు. బయటికి వచ్చిన ఆ వీడియో.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మంత్రివర్గంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిథ్యం కల్పించండి

- ఖర్గేకు జానారెడ్డి లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిథ్యం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కోరారు. ఈ రెండు జిల్లాల పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం వల్ల పార్టీకి, ప్రజలకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉపయోగం ఉంటుందని పేర్కొంటూ ఖర్గేకు ఆయన లేఖ రాశారు. కాగా మంత్రివర్గంలో చోటు కోసం ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి ప్రయత్నాలు చేసుకుంటున్న ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజా ప్రతినిధులు తాజాగా జానారెడ్డిని మద్దతు కోరారని, వారి అభ్యర్థన మేరకే జానారెడ్డి లేఖ రాసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

బీఆర్ఎస్ సర్కారు ఉన్నా..ఆ భూమిని
స్వాధీనం చేసుకునేది

- అప్పటి నుంచి ఇప్పటికీ అది ప్రభుత్వ భూమే:మహేశ్‌గౌడ్
- అంగుళం భూమిని కూడా సర్కారు తీసుకోలేదు:చనగాని
- హెచ్‌సీయూ భూములపై రాజకీయ కుట్ర: చామల



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి అనాటి నుంచీ ప్రభుత్వానిదేనని, ఇప్పుడు బీఆర్ఎస్ సర్కారులో ఉన్నా.. ఆ భూమిని స్వాధీనం చేసుకునేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆ భూమి హెచ్‌సీయూది కాదని ఆయన స్పష్టం చేశారు. ఆ భూమికి ప్రత్యామ్నాయంగా గతంలోనే హెచ్‌సీయూకి 397 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఇచ్చినట్లు చెప్పారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా కొనసాగిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల దోస్తీ.. హెచ్‌సీయూ భూముల విషయంలో మరోమారు బయట పడిందన్నారు. విద్యార్థులకు కూడా ఆ 400 ఎకరాలు ప్రభుత్వ భూమి అని తెలుసునని, అయితే.. వారిని రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "ఈ భూమి ఉన్న సర్వే నంబర్ 25లోనే కేటీఆర్ ఓ 50 ఎకరాల భూపంచాయితీని సెటిల్ చేశారు. ఆయన బినామీ అయిన మైహోం రామేశ్వర్‌రావుకు ఆ భూమిని బదిలీ చేయించారు. మైహోం సంస్థ అక్కడ విహంగ పేరుతో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించింది. అప్పటి ప్రభుత్వం ఆ భవనాలకు 100 అడుగుల రోడ్లను వేయించింది. అప్పట్లో ఆ ప్రాంతంలో నెమళ్లు, జింకలు తిరుగుతున్న ఆనవాళ్లు, పచ్చదనం, చెట్లు కేటీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి కనిపించలేదా? అప్పట్లో పర్యావరణ అంశం గుర్తుకు రాలేదా??" అని నిలదీశారు. హెచ్‌సీయూకు సంబంధించిన అంగుళం భూమి కూడా ప్రభుత్వం తీసుకోదని, ప్రతిపక్ష పార్టీలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 2000 ఎకరాలను ధారదత్తం చేశారని, ఉస్మానియా యూనివర్సిటీ భూములను కూడా బెదిరించి కబ్జాలకు గురి చేశారని ఆరోపించారు. హెచ్‌సీయూ భూములపై రాజకీయ కుట్ర జరుగుతోందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆ 400 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికే దక్కాలని గతంలో వైఎస్‌తో సహా.. సీఎంలుగా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య, కేసీఆర్ కూడా ఆ భూమి రాష్ట్ర ప్రభుత్వానికి దక్కాలని న్యాయస్థానాల్లో పోరాటం చేశారని వివరించారు.

విధ్వంసమే మీ ఎజెండానా?: కేటీఆర్



"పర్యావరణ పరిరక్షణంటూ పేదప్రజల ఇళ్లను బుల్డోజర్లతో కూలగొట్టించావ్. ఎండిన భూముల అభివృద్ధి పేరిట గిరిజన గూడేలపై పడ్డావ్. ఇప్పుడు నోరులేని జీవాలపైకి బుల్డోజర్లను వదులుతున్నావ్. రేవంత్‌రెడ్డీ.. నువ్వు నడుపుతున్నది ప్రభుత్వాన్నా? బుల్డోజర్ కంపెనీనా? విధ్వంసమే నీ ఎజెండానా? నువ్వు ప్రజాప్రతినిధివా? రియల్ ఎస్టేట్ ఏజెంట్‌వా?" అంటూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎంపై మండిపడ్డారు. ఇది ప్రజాపాలన కాదని, ప్రజలను హింసించే పాలన అని విమర్శించారు. చదువు చెప్పేచోట విధ్వంసం సృష్టిస్తూ.. విలువైన భూములపై వికృత క్రీడ సాగిస్తున్నారని ఆరోపించారు. "హెచ్‌సీయూ భూముల వెనక నువ్వు దాస్తున్న నిజమేంటి? సెలవు రోజుల్లో.. అర్ధరాత్రి నీ బుల్డోజర్లు ఎందుకు నడుస్తున్నాయి? కోర్టులంటే నీకంత భయమెందుకో చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

ఆ భూములు సర్కారువే

(మొదటిపేజీ తరువాయి)

పెద్దఎత్తున అవకాశాలు ఉంటాయని స్పష్టం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మరోవైపు, అడవి అనగల అన్ని అర్హతలు ఆ ప్రాంతానికి ఉన్నాయని, ప్రస్తుతం ఉన్నట్లుగానే ఆ స్థలాన్ని ఉండనివ్వాలని హెచ్‌సీయూ అధికారులు, పర్యావరణవేత్తలు ప్రభుత్వానికి సూచించారు. అయితే, భూమిపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేసిన ప్రభుత్వం.. తమ అభీష్టం మేరకే ముందుకు వెళతామన్న విషయమై ఎలాంటి స్పష్టమైన నిర్ణయం వెలువర్చలేదు. అన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకుని తదుపరి అడుగు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఈ భూమికి సంబంధించి ఆందోళనలు, ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశంలో చర్చించిన అంశాల ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది.



భూమికి సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులు, పత్రాలను మీడియాకు చూపిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

400 ఎకరాలను అన్యాక్రాంతం కాకుండా కాపాడాం

కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా, ప్రభుత్వం న్యాయపరంగా కొట్లాడి సాధించుకున్నదని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రజా విజయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ఆ భూమిని పూర్తిగా గాలికొదిలేసిందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో సమీక్ష తర్వాత మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో కలిసి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించి, భూమికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. "హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఇంచు భూమిని కూడా మా ప్రభుత్వం గుంజుకోలేదు. కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లో ఉన్న 400 ఎకరాలు యూనివర్సిటీకి సంబంధించినది కాదు. ఈ భూమిని ప్రభుత్వం లాక్కుని ప్లాట్లు చేసి, విక్రయించుకుంటోందంటూ ప్రచారం జరుగుతోంది. ఈ భూమి మాదేనని హెచ్‌సీయూ భావిస్తోంది. కానీ, 2004 జనవరి 31న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ భూమిని బిల్లీరావు ప్రాతినిధ్యం వహించిన ఐఎంజీ ఫ్లోరిడాకు చెందిన ఐఎంజీ భారత్ అనే క్రీడా నిర్వహణ సంస్థకు కేటాయించింది. దానికి బదులుగా గోపనపల్లిలోని సర్వే నంబర్లు 36, 37ల్లోని 397 ఎకరాలను యూనివర్సిటీకి బదలాయించింది. దీనిపై అప్పటి వర్సిటీ రిజిస్ట్రార్, శేరిలింగంపల్లి ఎమ్మార్వో సంతకాలు చేశారు. అయితే, ఐఎంజీ భారత్ అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలను ప్రారంభించకపోవడంతో 2006 నవంబరు 21న అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం ఆ కేటాయింపును రద్దు చేసింది. దీనిపై ఐఎంజీ భారత్ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ రిట్ పిటిషన్‌పై అప్పటి ముఖ్యమంత్రులు రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి న్యాయస్థానంలో సీనియర్ అడ్వకేట్లను నియమించి ప్రభుత్వ వాదనలు వినిపించేలా చేశారు. కానీ, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం దశాబ్దాలుగా పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణలో అధికారంలోకి వచ్చిన గత పాలకులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోని ఈ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయలేదు. పదేళ్లపాటు అధికారంలో ఉండి కూడా ఆ భూమిని పట్టించుకోకుండా గాలికొదిలేశారు. కోట్లాది రూపాయల విలువైన ఈ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంటే.. దానిని తమ చేతుల్లోకి తెచ్చుకోవచ్చన్న కుట్ర చేశారు. అందుకే న్యాయస్థానంలో కొట్లాడలేదు. కానీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విలువైన భూమిని రాష్ట్ర సంపద, ప్రజల ఆస్తిగా భావించి, స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశమై భూమి స్వాధీనానికి న్యాయ పోరాటం చేయాలని యోచించింది. ఆ మేరకు న్యాయవాదులను నియమించి విజయం సాధించింది. ఇది ప్రభుత్వ, ప్రజా విజయం" అని భట్టి విక్రమార్క వివరించారు. విలువైన భూమిని కాపాడినందుకు ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి.. ప్రతిపక్షాలు విమర్శించడం విడ్డూరంగా ఉందని తప్పుబట్టారు. లక్షలాదిమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న తాపత్రయంతో ఈ భూమిని రెవెన్యూ శాఖ నుంచి టీజీఐఐసీకి అప్పగించామని, ఇందులో ఎవరికీ ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదని స్పష్టం చేశారు. టీజీఐఐసీ తయారు చేసిన డ్రాఫ్ట్ లే అవుట్‌లో ఈ భూమిలోని సహజసిద్ధమైన రాక్ ఫార్మేషన్స్, మష్రూమ్ రాక్‌ను మినహాయించామన్నారు. భూమిని కాపాడి ప్రజలకు ఆస్తిగా ఇవ్వడానికి ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని కొన్ని రాజకీయ పార్టీలు, వాటి మీడియా సంస్థలు సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు అర్థం చేసుకుని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కొంతమంది వ్యక్తుల ప్రయోజనాల కోసం రాష్ట్ర సంపదను తాకట్టు పెట్టబోమని, ప్రజల ఆస్తిని వారి చేతుల్లోకి పోనివ్వబోమని చెప్పారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం: పొంగులేటి

కంచ గచ్చిబౌలి భూమిపై నాలుగైదు రోజులుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఫెవికాల్ బంధాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్‌కు ఈ భూమిని కాపాడాలన్న ఆలోచన రాలేదని విమర్శించారు. భూమిని వారి సంస్థలకు అప్పగించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇప్పుడు పర్యావరణం గురించి మాట్లాడుతున్నారని, అప్పట్లో హైరైజ్ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చినప్పుడు పక్షులు, జంతువుల గురించి ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. జంతువులు చనిపోయినట్లు తప్పుడు వీడియోలు సృష్టిస్తున్నారని, ఇది నీచాతి నీచమైన ప్రచారమని తప్పుబట్టారు. ఇప్పటి వరకు వర్సిటీలో పక్షులు, జంతువులు చనిపోయినట్లు చిన్న ఘటన కూడా చోటు చేసుకోలేదన్నారు. వర్సిటీకి ఎంత భూమి ఉంటే... అంత భూమికి టైటిల్ డీడ్ ఇవ్వాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు.

వర్సిటీ భూమిలో ఇంచు కూడా తీసుకోలేదు: శ్రీధర్‌బాబు

కంచ గచ్చిబౌలి భూములపై బీఆర్ఎస్, బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా రాజకీయాలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. వర్సిటీకి చెందిన ఇంచు భూమిని కూడా ప్రభుత్వం కబ్జా చేయలేదన్నారు. ఇప్పటి వరకు ఒక్క ఎకరంపై కూడా వర్సిటీకి చట్టబద్ధ హక్కులు లేవని, ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నారని తెలిపారు. కానీ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోలేదని, ఇప్పుడేమో పని గట్టుకుని తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. వారం రోజుల కిందట వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌తో తాము ప్రత్యేకంగా సమావేశమయ్యామని, వారి విజ్ఞప్తి మేరకు దాదాపు 1500 ఎకరాల యూనివర్సిటీ భూములపై చట్టబద్ధ హక్కులు కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నామని వెల్లడించారు.

ఆ భూములు వర్సిటీ స్వాధీనంలోనే ఉన్నాయా!?
సర్వే నంబరు 36, 37ల్లో ఉన్నదెంత? పంచిందెంత!?

- ఇక్కడే 477 ఎకరాలు టీఎన్జీవోల ఇళ్ల స్థలాలకు పంపిణీ
- దాదాపు 250 ఎకరాలు టీఐఎఫ్ఆర్‌కు.. 20 ఎకరాలు లాయర్లకు
- మిగిలిన భూమిపై దృష్టిసారించిన ప్రతిపక్షాలు, సంఘాలు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుని.. అందుకు బదులుగా గోపన్‌పల్లిలోని సర్వే నంబర్లు 36, 37ల్లో 397 ఎకరాలను అప్పటి ప్రభుత్వం హెచ్‌సీయూకు స్వాధీన పరిచిందని, దానిపై అప్పటి రిజిస్ట్రార్ వై.నర్సింహులు సంతకం చేశారంటూ ప్రభుత్వం ఒక ఆధారాన్ని విడుదల చేసింది. సోమవారం విలేకరుల సమావేశంలో మంత్రులూ ఇదే విషయం చెప్పారు. మరి, ఆ 397 ఎకరాలూ ఇప్పుడు యూనివర్సిటీ అధీనంలోనే ఉన్నాయా!? అయితే.. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై వివాదం ఎందుకు!? ప్రతి ఒక్కరి మదిలో మెదులుతున్న ప్రశ్నలివి. నిజానికి, గోపనపల్లి సర్వే నంబర్లు 36, 37ల్లో 884 ఎకరాలు ఉన్నాయని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. వీటిలో 477 ఎకరాలను 1991లోనే టీఎన్జీవోలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు వివిధ సంస్థలకు ఇక్కడ కేటాయింపులు చేశాయి. ఇక్కడే టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చి (టీఐఎఫ్ఆర్) ఏర్పాటు చేశారు. దీనికి దాదాపు 250 ఎకరాలను కేటాయించారు. ఇక, ఈ సర్వే నంబర్లలో 90 ఎకరాలు తనదంటూ ఓ ప్రైవేటు వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. ఇక్కడే ఒక రిసెర్చి ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. లాయర్ల సంఘానికి 20 ఎకరాలు కేటాయించారు. ఈ కేటాయింపులన్నిటినీ పరిశీలిస్తే.. ఆయా సర్వే నంబర్లలో యూనివర్సిటీకి కేటాయించిన భూమి ఉందా!? అది వర్సిటీ అధీనంలోనే ఉందా!? అనే అనుమానాలను పర్యావరణవేత్తలు, ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేస్తున్నాయి. ఇక్కడ ఇంకా ఎన్ని ఎకరాల భూములు విగిలి ఉన్నాయనే అంశాన్ని తేల్చే విషయంపై దృష్టి సారించాయి. నిజానికి, విశ్వ విద్యాలయానికి భూములు స్వాధీనం చేసినా.. ఈ భూములపై వర్సిటీకి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడం.. ప్రభుత్వానికే సర్వ హక్కులు ఉండడంతో పలు సంస్థల ఏర్పాటుకు, పరిశ్రమలకు, ప్రభుత్వ అవసరాలకు ఇక్కడి భూమినే కేటాయిస్తూ వస్తోంది. అయితే, ఇక్కడి భూముల్లో వర్సిటీకి ఎన్ని ఎకరాలకు చట్టబద్ధత కల్పించాలనే అంశంపై 2016లో ఐదుగురు ఐఏఎస్ అధికారుల బృందంతో ప్రభుత్వం అధ్యయనం చేయించింది. వారు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు కూడా!!

'చలో హెచ్‌సీయూ' ఉద్రిక్తం

ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు.. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్ట్

- బీజేఎల్పీ నేత ఏలేటి గృహ నిర్బంధం
- సర్కారుది కోర్టు ధిక్కరణ: సంజయ్
- కేటీఆర్, హరీశ్ ఇళ్ల వద్ద పోలీసులు
- వర్సిటీలోకి వెళ్లేందుకు బీజేవైఎం, సీపీఐ నాయకుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట
- వేలాన్ని అడ్డుకుంటాం: విద్యార్థులు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



హెచ్‌సీయూ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

హైదరాబాద్/సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వేలాన్ని నిలిపివేయాలంటూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఆందోళనలు ఉధృతరూపం దాల్చుతున్నాయి. జీవరాశులకు ఆలవాలమైన భూమిని వేలం వేసి, పచ్చటి వాతావరణాన్ని దెబ్బ తీయొద్దని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. అయితే, ఆ భూమి తమదేనని, వర్సిటీకి సంబంధం లేదని ప్రభుత్వం చెబుతోంది. మూడు రోజులుగా టీజీఐఐసీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తుతో భూమిని చదును చేయిస్తుండడంతో విద్యార్థులు నిరసనలు తెలుపుతున్నారు. పనుల్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ, విద్యార్థులకు మద్దతుగా మంగళవారం వివిధ పార్టీల నాయకులు తలపెట్టిన 'చలో హెచ్‌సీయూ' ఉద్రిక్తంగా మారింది. వర్సిటీ ప్రాంగణానికి వెళ్లేందుకు బయలుదేరిన వారిని ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడంతో యుద్ధ వాతావరణం నెలకొంది. వర్సిటీలోని 400 ఎకరాల భూముల వేలాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. పార్టీ ఎమ్మెల్యేలను, స్థానిక నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద భారీగా పోలీసుల బలగాలను మోహరించారు. బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, సూర్యనారాయణగుప్తా హెచ్‌సీయూకు వెళ్లేందుకు సిద్ధమవగా పోలీసులు అడ్డుకున్నారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. వేలం వేయాలనుకుంటున్న 400 ఎకరాలు అటవీ శాఖవేనని స్పష్టం చేశారు. ఈ భూమిపై హైకోర్టులో కేసు నడుస్తోందని, ఈ నెల 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిందని చెప్పారు. ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం భూములను చదును చేయడమంటే కోర్టు ధిక్కరణకు పాల్పడడమేనన్నారు.

సర్కారుది రియల్ ఎస్టేట్ దందా: ఏలేటి

కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ దందా చేస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. వర్సిటీ భూములను కూడా వదలిపెట్టడం లేదన్నారు. ఏ గుంటనక్క కోసం హెచ్‌సీయూ భూములను చదును చేస్తున్నారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌లోని అహంకారం సీఎం రేవంత్‌లో కనిపిస్తోందని బీజేఎల్పీ ఉపనేత పాయల శంకర్ విమర్శించారు. భూములను అమ్ముకుంటూ పోతే భవిష్యత్తులో ప్రాజెక్టులకు ఎక్కడి నుంచి భూములు తెస్తారని ఎమ్మెల్యే సూర్యనారాయణగుప్తా నిలదీశారు.

యూనివర్సిటీ బంద్‌కు పిలుపు..

పోలీసులు, టీజీఐఐసీ అధికారులు జేసీబీలతో చెట్లను తొలగించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు మంగళవారం హెచ్‌సీయూ బంద్‌కు పిలుపునిచ్చారు. హెచ్‌సీయూ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి ర్యాలీగా బయలుదేరిన విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "హెచ్‌సీయూ మాది.. వర్సిటీ సంపదను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటాం. విద్యార్థులతో పెట్టుకుంటే గద్దె దిగేంతవరకు పోరాడతాం" అంటూ వన్యప్రాణులకు నిలయమైన కంచ ప్రాంతం గురించి వర్సిటీ పూర్వ విద్యార్థులైన ప్రస్తుత మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబుకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రధాన గేటు వరకు వచ్చిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన బీజేవైఎం, సీపీఎం నాయకులు క్యాంపస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారినీ అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ రాజ్యం పేరుతో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ పీఎస్‌యూ తలపెట్టిన చలో హెచ్‌సీయూ ఉద్రిక్తంగా మారింది. సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రధాన గేటులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకుని రాజేంద్రనగర్ స్టేషన్‌కు తరలించారు.

బీఆర్ఎస్ నేతల ఇళ్ల వద్ద పోలీసులు..

హెచ్‌సీయూ ఆందోళనల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకుల ఇళ్ల వద్ద ఉదయం నుంచి పోలీసులు భారీగా మోహరించారు. వారు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. హెచ్‌సీయూలో విద్యార్థులను అరెస్ట్ చేయడం అమానుషమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.

హెచ్‌సీయూ భూమిని నోటిపై చేసేలా చూస్తాం: బల్మూరి

హెచ్‌సీయూ వివాదంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ టీఎన్‌జీవో కాలనీలోని మైహోం విహంగ వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. వర్సిటీ భూమి సుమారు 2500 ఎకరాలు ఉందని, అందులోని ఒక బిట్టులో 20 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఐఎంజీ భారత్ అనే సంస్థకు భూమి కేటాయించిందన్నారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కేటీఆర్ బినామీ రామేశ్వరరావుకు అందులో 50 ఎకరాలకు సంబంధించి అన్ని అనుమతులూ ఇచ్చి సహకరించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతోనే మైహోం విహంగ నిర్మించారన్నారు. గతంలో 50 ఎకరాలు కేటాయించినట్లుగానే 400 ఎకరాలను కూడా మైహోంకు దక్కేలా చూడాలనే బీజేపీ, బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నాయని ఆరోపించారు. మైహోం విహంగ నిర్మించినప్పుడు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు అవి వర్సిటీ భూములని, పర్యావరణం దెబ్బతింటుందని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. విద్యార్థి నాయకుడిగా వర్సిటీ భూమిని ప్రభుత్వం నోటిపై చేసేలా చూస్తామన్నారు.



భూపేంద్ర యాదవ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీలు

ఆక్రమణను అడ్డుకోండి

- అటవీ భూములను రక్షించండి.. కేంద్ర మంత్రులకు బీజేపీ ఎంపీల వినతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు బీజేపీ తెలంగాణ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. 700 రకాల ఔషధ మొక్కలు, 220 రకాల పక్షులు, ఇతర జీవరాశులను కలిగి ఉన్న కంచ గచ్చిబౌలి భూములు హైదరాబాద్ పర్యావరణ సమతుల్యతకు ఎంతో అవసరమని కేంద్ర మంత్రులకు వివరించారు. ఆ భూములను రక్షించాలని కోరారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఆధ్వర్యంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ, రఘునందన్ రావు, గోడం నగేశ్ కేంద్ర విద్య, పర్యావరణ మంత్రులతో భేటీ అయ్యారు. హెచ్‌సీయూ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి.. రూ.వేల కోట్లు దండుకోవాలని సర్కారు చూస్తోందని భూపేంద్ర యాదవ్, ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎంపీలు వివరించారు. కాగా, కంచ గచ్చిబౌలి భూములపై తక్షణమే నివేదిక పంపాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ సంబంధిత శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. నివేదిక అందిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీలకు హామీ ఇచ్చారు.

ఢిల్లీకి కప్పం కట్టేందుకు వేలం: ఎంపీలు

హెచ్‌సీయూ భూములను అమ్ముకుని ఢిల్లీకి కప్పం కట్టాలని చూస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై ఎంపీలు ఈటల, అర్వింద్ మండిపడ్డారు. పర్యావరణంతో అలరారే భూముల్లో నెమళ్లు, ఔషధ మొక్కలను చంపేసి.. ఆ స్థలాలను కాంక్రీట్ జంగల్‌గా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన 400 ఎకరాల భూమి విలువ రూ.40 వేల కోట్లు అని అన్నారు. మంగళవారం ఢిల్లీలో బీజేపీ ఈటల, అర్వింద్ మీడియాతో మాట్లాడారు. భూములను అమ్మి, కమీషన్లు తినాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ ఉన్నారని మండిపడ్డారు.

లాఠీచార్జ్ అమానుషం: కిషన్‌రెడ్డి

హెచ్‌సీయూ ప్రస్తుతం స్వర్ణోత్సవ సంబరాలను జరుపుకుంటోందని.. ఇలాంటి సమయంలో భవిష్యత్ తరాల కోసం అవసరమైన పచ్చని వాతావరణం, అభివృద్ధి పనులు, పరిశోధనలు, యూనివర్సిటీ విస్తరణకు భూములు అవసరమని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమతో అన్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 400 ఎకరాలను ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ టీజీఐఐసీ చేసిన ప్రకటనను హెచ్‌సీయూ రిజిస్ట్రార్ తప్పుపట్టారని తెలిపారు. భూములను చదును చేయడానికి పదుల సంఖ్యలో యంత్రాలను మోహరించి రెండు రోజులుగా అర్ధరాత్రిళ్లు కూడా ఆక్రమణ పనులను చేపడుతుండటం దుర్మార్గమని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వందలాది మంది విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని, ఇది ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు.

పార్లమెంటు అండగా నిలవాలి: లక్ష్మణ్



హెచ్‌సీయూ భూములను వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేంద్ర సంస్థల సమగ్రతను దెబ్బతీసిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. రాజ్యసభలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఆర్ఆర్ఆర్(రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి) రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. భూముల వేలాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయ భూముల హద్దులను పారదర్శకంగా నిర్ణయించాలని కోరారు. విద్యార్థులకు, రాజ్యాంగ, పర్యావరణ పరిరక్షణకు పార్లమెంటు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. భూముల యజమాన్య హక్కులపై చట్టపరమైన స్పష్టత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలని ఎలా ప్రయత్నిస్తోందని లక్ష్మణ్ ప్రశ్నించారు.

కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిల్

చెట్ల నరికివేత, భూమి చదును ఆపించండి.. నిపుణుల కమిటీ ద్వారా సర్వే చేయించలేదు

- హైకోర్టులో మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం
- నేడు వాదనలు వింటామన్న డివిజన్ బెంచ్

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలో రాష్ట్ర ప్రభుత్వం విక్రయించతలపెట్టిన 400 ఎకరాల భూమిలో చెట్ల నరికివేత, భూమి చదును చేసే పనులు ఆపాలని కోరుతూ హైకోర్టులో మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విశ్రాంత శాస్త్రవేత్త కలపల బాబూరావు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆ భూముల్లో ఇంటర్నేషనల్ మాస్టర్ ప్లాన్ లేఅవుట్ చేసి దశలవారీగా ప్లాట్లు విక్రయించాలని ప్రభుత్వం చూస్తోందని.. రూ.75 కోట్లకు ఎకరం చొప్పున దాదాపు రూ.30 వేల కోట్ల ఆదాయం ఆర్జించాలని భావిస్తోందని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అటవీ సంరక్షణ నిబంధనలు-2023లోని 16(1) ప్రకారం నిపుణుల కమిటీ వేయకుండానే భూములను జీవో 54 ద్వారా టీజీఐఐసీకి అప్పగించడం చట్టవిరుద్ధమని.. కనుక ఆ జీవోను కొట్టివేయాలని అభ్యర్థించారు. నిపుణుల కమిటీ ద్వారా సర్వే చేయించకుండా, అటవీ భూముల రికార్డు సిద్ధంచేయకుండా జీవో ఇవ్వడం ఇటీవల సుప్రీంకోర్టు 'అశోక్ కుమార్ శర్మ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా అటవీ భూములను ఇతర అవసరాలకు కేటాయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని తెలిపారు. దీనిపై అత్యవసరంగా వాదనలు వినాలని పిటిషనర్ తరఫు న్యాయవాది తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం ఎదుట ప్రస్తావించగా.. బుధవారం విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. ఇదే అంశంపై లాభాపేక్ష రహిత పర్యావరణ సంస్థ 'వట ఫౌండేషన్' దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు ఇప్పటికే ప్రభుత్వానికి ఇప్పటికే నోటీసులు జారీచేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్ ఈనెల 7న విచారణకు రానుంది.


కొందుర్గు ఆస్పత్రిలో విద్యార్థినులకు వైద్యం చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి

నిద్రిస్తున్న విద్యార్థినులను కొరికిన ఎలుకలు

- కొందుర్గు కస్తూర్బా బడిలో 10 మందికి గాయాలు

చౌదరిగూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులను ఎలుకలు కొరకడం కలకలం రేపింది. ఉగాది పండుగకు వెళ్లి వచ్చిన బాలికలు ఇంటి దగ్గరి నుంచి భక్ష్యాలను తెచ్చుకున్నారు. సోమవారం రాత్రి వాటిని తినే క్రమంలో పిండి వంటల ముక్కలు, బెల్లం, చక్కెర కిందపడ్డాయి. వాటిని విద్యార్థినులు తొక్కడం వల్ల కాళ్లకు అంటుకున్నాయి. అనంతరం బాలికలు కాళ్లు కడుక్కోకుండానే నిద్రపోయారు. తీపి పదార్థాల వాసన రావడంతో గదిలోకి వచ్చిన ఎలుకలు.. విద్యార్థినుల కాళ్లను కరిచాయి. దీంతో 10 మంది గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పాఠశాల ప్రత్యేకాధికారి నిస్సీ మంగళవారం ఉదయం బాలికలను కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించారు. అనంతరం షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి టీటీ, యాంటీ రెబీస్ ఇంజెక్షన్లు ఇచ్చారు.

జైళ్ల శాఖకు స్కోచ్ అవార్డు

హైదరాబాద్, సైదాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు సొంతం చేసుకుంది. "సమాజంలో ఖైదీల పునరావాసం, సమీకరణం" అనే అంశంపై ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డును జైళ్ల శాఖ అందుకుంది. న్యాయపరమైన ప్రణాళికలు, ఆర్థిక న్యాయాన్ని మలుపుతిప్పే అంశాలపై దృష్టి సారిస్తూ 100వ స్కోచ్ సమ్మిట్ న్యూఢిల్లీలో మంగళవారం జరిగింది. ఈ సమ్మిట్‌ను స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్ ప్రారంభించారు. తెలంగాణ జైళ్ల శాఖకు లభించిన పురస్కారాన్ని జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా స్వీకరించారు. ఖైదీల పునరావాసం, శిక్ష అనంతరం జైలు నుంచి విడుదలైన తర్వాత వారి జీవితాన్ని మెరుగుపరిచే విధానాల్లో తెలంగాణ జైళ్ల శాఖ చూపిన కృషికి ఈ అవార్డు సముచిత గుర్తింపుగా నిలిచిందని సౌమ్య మిశ్రా తెలిపారు.

ఐబీపీఎస్ పీవో, క్లర్క్ మెయిన్ ఫలితాల విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఐబీపీఎస్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పలు ఉద్యోగ నియామకాల పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఐబీపీఎస్ క్లర్క్(కస్టమర్ సర్వీస్ అసోసియేట్స్) మెయిన్ ఫలితాలతో పాటు పీవో ఉద్యోగాలకు మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూలు పూర్తిచేసిన వారికి సంబంధించిన ఫలితాలను ibps.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ ఫలితాలు అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వ రిజర్వేషన్ల నియమ నిబంధనల ప్రకారం ప్రొవిజనల్ ఆర్డర్ విడుదల చేసినట్లు ఐబీపీఎస్ తెలిపింది.

ఏపీలో బర్డ్‌ఫ్లూతో రెండేళ్ల చిన్నారి మృతి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ మళ్లీ కలకలం రేపింది. ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా/హెచ్5ఎన్1) మరణం నమోదైంది. పట్టణంలోని బాలయ్య నగర్‌కు చెందిన పెండ్యాల జ్యోతి అనే రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూతో చనిపోయినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మంగళవారం ధ్రువీకరించారు. గత నెలలో చిన్నారి అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు ఆమెను చికిత్స కోసం మంగళగిరిలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. ఆ చిన్నారి అక్కడ చికిత్స పొందుతూ గత వారం ప్రాణాలు విడిచింది. అయితే బర్డ్‌ఫ్లూ లక్షణాలుగా అనుమానించిన వైద్యులు చిన్నారి శాంపిల్స్‌ను పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. ఈ పరీక్షల్లో జ్యోతికి బర్డ్‌ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నేతృత్వంలో వైద్య సిబ్బంది స్థానికంగా సర్వేలెన్స్ చేపట్టారు.

నేడు సిట్ ముందుకు శ్రవణ్‌రావు



- ఫోన్ ట్యాపింగ్ కేసు.. ముఖాముఖి విచారణకు అవకాశం
- గతంలో అరెస్టయిన పోలీసుకు నోటీసులు?
- గత ప్రభుత్వ పెద్దలపైనే ఫోకస్!!

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మీడియా సంస్థ యజమాని శ్రవణ్‌రావు బుధవారం మళ్లీ సిట్ ముందు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన విచారణలో ఆయన పోలీసులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో.. మరోసారి రావాలంటూ దర్యాప్తు అధికారులు నోటీసులు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పరారీలో ఉన్న ప్రభాకర్‌రావుతోపాటు ఇప్పటి వరకు అరెస్టయిన వారంతా పోలీసు అధికారులే..! శ్రవణ్‌రావు మాత్రమే ప్రైవేట్ వ్యక్తి. శ్రవణ్‌రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎందుకు తలదూర్చారు? ఆయనను ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్ అధికారులకు పరిచయం చేసిందెవరు? ప్రణీత్‌రావు ఏకంగా శ్రవణ్‌రావు ఆఫీసులోనే హ్యాకింగ్ పరికరాలను ఏర్పాటు చేయడానికి కారణమేంటి? వీరంతా ఎంతమంది సంభాషణలను విన్నారు? అలా చేయడం వల్ల ఆర్థిక లబ్ధిపొందారా? అనే విషయాలపై దర్యాప్తు అధికారులకు శ్రవణ్‌రావు నుంచి స్పష్టమైన సమాధానాలను రాబట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ నేతలు, వారి అనుచరులు, రేవంత్ రెడ్డి సన్నిహితుల ఫోన్ నంబర్లను ట్యాపింగ్ టీంకు ఎందుకు ఇచ్చారు? ఆయా నంబర్లను శ్రవణ్‌రావుకు ఇచ్చిందెవరు? శ్రవణ్‌రావు గత ప్రభుత్వంలోని ముగ్గురు మంత్రులకు ఇచ్చిన సమాచారమేవిటి? అనే విషయాలను నిర్ధారించుకోవడానికి మరోసారి విచారణ తప్పలేదని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు. ఈ కేసులో గతంలో అరెస్టు అయిన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, శ్రవణ్‌రావులను ముఖాముఖి కూర్చోబెట్టి విచారించాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం తనకు ప్రణీత్‌రావుతోనే పరిచయం ఉందని శ్రవణ్‌రావు చెబుతున్నప్పటికీ.. రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్నలకు ఆయన చేసిన ఫోన్‌కాల్స్, వాట్సాప్ చాట్‌లను పోలీసులు సేకరించారు. ఈ నేపథ్యంలో వీరితో శ్రవణ్‌రావును ముఖాముఖి విచారించేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వీరికి కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

భూకంపాలను ముందే పసిగట్టేస్తా

మయన్మార్ భూకంపం గురించి ముందే చెప్పా

- ముందస్తు గుర్తింపునకు ప్రత్యేక అల్గారిథమ్
- 5 వేల కిలోమీటర్ల దూరంలోనూ అంచనా వేయొచ్చు
- వారం-నెల ముందే గుర్తించవచ్చు
- 100 అంచనాలలో 18 నిజమయ్యాయి
- త్వరలో ధర్మశాల, తవాంగ్‌లో.. భారీ భూకంపాలు వచ్చే ప్రమాదం
- యువ ఇంజనీర్ శివ సీతారామ్ వెల్లడి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మయన్మార్ భూకంపం మూడు వేలమందిని బలిగొంది. ఆకాశ హర్మ్యాలు పేక మేడల్లా కూలిపోయాయి. అయితే.. తుఫానులు, సునామీల మాదిరిగానే.. భూకంపాలనూ ముందుగానే గుర్తించే వ్యవస్థ అందుబాటులోకి వస్తే ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. సరిగ్గా ఇదే ఆలోచనతో పనిచేసిన యువ ఇంజనీరు శివ సీతారామ్ ఇప్పుడు భూప్రకోపాన్ని ముందస్తుగా గుర్తించగలుగుతున్నారు. ఇందుకోసం ఎన్నో పరిశోధనలు చేసిన ఆయన.. సొంతంగా ఓ అల్గారిథమ్‌ను రూపొందించుకుని, హెచ్చరికలు చేస్తున్నారు. తన వెబ్‌సైట్ https://www. seismo.in/ లో.. ముందస్తు అంచనాలను పోస్టు చేస్తున్నారు. మయన్మార్ భూకంపంపైనా ఆయన నెల రోజుల ముందే హెచ్చరికలు చేశారు. ఈ అల్గారిథమ్ కోసం 19 ఏళ్ల పరిశోధించిన శివ సీతారామ్‌తో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకంగా మాట్లాడింది. ఆయన ఇంటర్వ్యూ వివరాలు..

ముందుగానే భూకంపాలను అంచనా వేయడం ఎలా సాధ్యం?

సాధ్యం కానిదేదీ లేదు. ఒకప్పుడు చంద్రుడి పైకి వెళ్లడం అసాధ్యమనుకున్నారు. ఇప్పుడు అది సాధ్యమైంది కదా? 2004లో సునామీ తర్వాత.. నాకు భూకంపాలను ముందుగానే అంచనా వేయాలనే ఆలోచన వచ్చింది. 2005లో జమ్మూకశ్మీర్‌లో సంభవించిన భారీ భూకంపం తర్వాత.. నా పరిశోధనలు మొదలయ్యాయి. 2017 వరకు దీనిపై పనిచేస్తూ.. ప్రత్యేక అల్గారిథమ్‌ను రూపొందించా. దీని ద్వారా కచ్చితత్వంతో భూకంపాలను అంచనా వేస్తున్నా.

ఎన్ని రోజుల ముందు గుర్తించొచ్చు?

ప్రపంచవ్యాప్తంగా భూభౌతిక శాస్త్రవేత్తలు కొన్ని సెకన్ల ముందే భూకంపాలను గుర్తిస్తున్నారు. నా అల్గారిథమ్ మాత్రం ఎక్కడ.. ఎంత తీవ్రతతో భూకంపం వస్తుందో నెలరోజుల ముందే చెబుతుంది. నా అంచనాల్లో 100కు 18 నిజమయ్యాయి. పరిశోధనల్లో ఇది మంచి సక్సెస్ రేటుగా చెప్పవచ్చు. 2023 నేపాల్ భూకంపం, ఈ ఏడాది జనవరిలో టిబెట్, జపాన్ భూకంపాలను ముందుగానే అంచనా వేశాను. చిన్న భూకంపాలను కాకుండా.. తీవ్రత 5 కంటే ఎక్కువ ఉండే వాటినే గుర్తించగలుగుతున్నాం. 2020 నుంచి నేను గుర్తించిన అంచనాల డాటా నా వెబ్‌సైట్‌లో ఉంది.

ధర్మశాలలో భూకంపం అని మీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు కదా..?

అవును. నా అల్గారిథమ్ తదుపరి అంచనా ధర్మశాల. అక్కడ 7 అంత కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపం వచ్చే ప్రమాదముంది. తవాంగ్ రీజియన్‌లో కూడా భూమి ప్రకోపించనుంది. ఈ రెండూ కొన్ని నెలల్లో జరగవచ్చు. అయితే.. సమయం, తేదీల విషయంలో కచ్చితత్వం రావాల్సి ఉంది.

ప్రకృతి కూడా ముందే హెచ్చరిస్తుందా?

అవును.. ప్రకృతి ముందుగానే హెచ్చరిస్తుంది. భూకంపం రావడానికి మూడు నుంచి ఆర్నెల్ల ముందుగానే ఆ సూచనలు అందుతాయి. శాస్త్రవేత్తలకు కూడా ఆ విషయం తెలుసు. అయితే, ఆ సూచనలను పసిగట్టి, నిజంగానే విపత్తు వస్తుందా అని చెప్పడం కష్టమే..! మేము 20 అంశాలను పరిగణనలోకి తీసుకుంటాం. వాటిల్లో కీలకమైనది భూమిలోంచి రాడాన్, మిథేన్ గ్యాస్ విడుదలవ్వడం. విద్యుదయస్కాంత తరంగాల్లో హెచ్చుతగ్గులుండడం. భూమి లోపల లావా నిరంతరం ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ ఒత్తిడిని భరించలేనప్పుడు భూ ఫలకాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. దీంతోపాటు.. వాతావరణంలో మార్పులను పరిగణనలోకి తీసుకుంటాం. ఇలా భారత్‌తోపాటు.. 50 దేశాల్లో భూకంపాలను ముందుగానే అంచనా వేయగలుగుతున్నాం.

గ్రహాల కూటమికి.. భూకంపాలకు సంబంధముందా?


గ్రహాల కూటమి వల్ల ప్రకృతిలో మార్పులు వస్తాయి. కానీ, భూకంపాలు వస్తాయని కచ్చితంగా చెప్పలేం.

ప్రభుత్వ/ప్రైవేటు సహకారం ఉందా?

నేను సొంతంగానే పరిశోధనలు చేస్తున్నా. నా అంచనాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రభుత్వానికి 70-80% కచ్చితత్వంతో ఉన్న అంచనాలు కావాలి. నా అల్గారిథమ్ ఆ స్థాయికి చేరేలా పరిశోధనలు చేస్తున్నాం. అయితే.. నా కుటుంబ సభ్యుల సహకారం చాలా ఉంది. హైదరాబాద్ సైనిక్‌పురిలో సెసిమో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, పరిశోధనలు చేస్తున్నా. దేశంలో మూడు చోట్ల అబ్జర్వేటరీలున్నాయి. నా పరిశోధనలు నచ్చి, కొందరు నిధులను సమకూరుస్తున్నారు.

డిప్లొమా చేసి ఈ స్థాయిలో పరిశోధనలెలా?

మా స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు. సీఆర్ రెడ్డి కాలేజీలో పాలిటెక్నిక్ డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్) చేశాను. సైయెంట్ సంస్థలో కొన్నాళ్లు పనిచేశాను. పరిశోధనల కోసం 2014-15లో ఉద్యోగం మానేశాను. 2018 తర్వాత పూర్తిస్థాయిలో పరిశోధనలకు అంకితమయ్యాను.



దక్షిణాదికీ ముప్పు

బి.రామలింగేశ్వరరావు, ఎన్‌జీఆర్ఐ విశ్రాంత శాస్త్రవేత్త



మన దేశంలో దక్షిణాదికి కూడా భూకంపాల ముప్పు ఉందని ఎన్‌జీఆర్ఐ విశ్రాంత శాస్త్రవేత్త, 2002లో భారత భూకంప జోన్ల నిర్ధారణలో అత్యంత కీలక పాత్ర పోషించిన బి.రామలింగేశ్వరరావు వెల్లడించారు. ఆయనను 'ఎర్త్ క్వేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కూడా వ్యవహరిస్తారు. 1762 నుంచి 2014 సంవత్సరం వరకు భూకంపాల చరిత్ర ప్రకారం ఆయన ఓ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఉత్తర భారత సరిహద్దు ఫలకం, దక్షిణ భారత శిలాసంధి మధ్య క్రియాశీల-నిష్క్రియాశీల భూకంప కాలచక్రం కొనసాగుతున్నట్లు గుర్తించామని ఆయన వెల్లడించారు. "అంటే.. ఒకట్రెండు సంవత్సరాలు అటూ ఇటుగా.. పాతికేళ్ల పాటు ఉత్తరాదిలో భూకంపాలు వస్తే.. ఆ తర్వాత పాతికేళ్లు దక్షిణాదిలో ప్రకంపనలు వస్తాయి. 1850-1900 మధ్యకాలంలో భూకంపాలను గమనిస్తే ఈ విషయం అర్థమవుతుంది. 2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు(2025) ఉత్తరాదిలో భూకంపాలు వచ్చాయి. ఇప్పుడు ఉత్తరాది భూకంప కాలచక్రం పూర్తికావొస్తోంది. దీంతో.. దక్షిణ భారతంలో ప్రకంపనాలకు అవకాశాలుంటాయి. అయితే.. ఉత్తరాదిలో భూకంప తీవ్రత 7.7గా ఉంటే.. దక్షిణాదిలో 6 వరకు ఉండే అవకాశాలున్నట్లు మా పరిశోధనలో తేలింది" అని ఆయన వివరించారు.

హైదరాబాద్‌లో విదేశీ యువతిపై అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి)

వివరాల ప్రకారం.. మీర్‌పేట ప్రాంతానికి చెందిన యువకుడు ఇటలీలో ఉన్నత చదువులు చదువుతున్నాడు. అతనికి గత ఏడాది జర్మనీకి చెందిన యువతి, యువకుడితో స్నేహం ఏర్పడింది. మీర్‌పేట యువకుడు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గురించి తరచూ తన స్నేహితులతో చెప్తుండేవాడు. దాంతో వారు హైదరాబాద్ వస్తామని చెప్పేవారు. ఈ నేపథ్యంలో జర్మనీ యువతి, యువకుడు గత నెల 4న హైదరాబాద్ వచ్చారు. మీర్‌పేటలోని స్నేహితుడి ఇంట్లో ఉంటూ పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. సోమవారం రంజాన్ పండుగ రోజున స్థానికంగా ఓ కాలనీలో కూరగాయల సంతను చూద్దామని జర్మనీ యువతి, యువకుడు సాయంత్రం 6:30 సమయంలో బయటకు వచ్చారు. అదే సమయంలో మహ్మద్ అబ్దుల్ అస్లాం అనే వ్యక్తి ఐదుగురు మైనర్లను తీసుకుని కారులో షికారుకు బయల్దేరాడు. రోడ్డుమీద ఉన్న విదేశీయులు ఇద్దర్నీ చూసి కారు ఆపాడు. అస్లాంకు గతంలో దుబాయ్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో ఇంగ్లిష్‌లో మాట్లాడి విదేశీయులను పరిచయం చేసుకున్నాడు. వారు దగ్గరలోని కూరగాయల సంతకు వెళ్లాలని చెప్పడంతో తీసుకెళ్తానని కారులో ఎక్కించుకున్నాడు. కొద్దిదూరం వెళ్లగానే కారులో పెట్రోల్ పోయించి కొన్ని ముఖ్యమైన ప్రదేశాలు చూపిస్తానంటూ నమ్మించి మామిడిపల్లివైపు తీసుకెళ్లాడు. అక్కడ అందరికీ ఫొటోలు తీస్తానని చెప్పి కారులోంచి దింపాడు. ఫొటోలు తీసిన తర్వాత జర్మనీ యువకుడితో సెల్ఫీలు దిగండి... తాను ఇప్పుడే వస్తానంటూ మైనర్లకు చెప్పి.. ఆ యువతిని కారులో ఎక్కించుకుని కొద్దిదూరంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆ యువతిని బెదిరించి కారులోనే అత్యాచారానికి పాల్పడ్డాడు. తిరిగి మైనర్లు ఉన్న చోటుకు వస్తున్న క్రమంలో కారును స్లో చేయగా.. ఆ యువతి కారులోంచి దూకేసి జరిగిన దారుణాన్ని తన స్నేహితుడికి చెప్పింది. వెంటనే ఇద్దరూ ఆటోలో మీర్‌పేటకు చేరుకుని స్థానిక స్నేహితుడిని కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన జరిగిన ప్రాంతం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. డీసీపీ సునీతారెడ్డి పర్యవేక్షణలో పోలీసులు సీసీటీవీ కెమెరాల సాయంతో నిందితుడు యాకుత్‌పురాకు చెందిన అస్లాంను గుర్తించి.. అరెస్టు చేశారు. అతను దుబాయ్ నుంచి వచ్చిన తర్వాత ఏడాది కాలంగా హైదరాబాద్‌లోనే ఖాళీగా ఉంటున్నాడు. రంజాన్ రోజు లాంగ్ డ్రైవ్ యాప్‌లో కారును అద్దెకు తీసుకుని స్థానిక స్నేహితులతో (9 నుంచి 12 ఏళ్లు) కలిసి షికారుకు వెళ్లాడు. మార్గమధ్యలో విదేశీ యువతి కనిపించగానే.. మాటలు కలిపి అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. కాగా, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులు బాధిత యువతిని కలిసి పరామర్శించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, దీనికి ప్రభుత్వం, పోలీసుల వైఫల్యమే కారణమని విమర్శించారు. నిందితుడితో పాటు కారులో ఉన్న మైనర్ల ఫొటోలు పోలీసులకు చూపించినా మంగళవారం రాత్రి వరకు వారిని అరెస్టు చేయలేదని ఆరోపించారు.

లాభసాటిగా ఆయిల్ పామ్ సాగు

- రూ.21,000కు చేరిన టన్ను గెలల ధర
- ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వ చర్యలు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ గెలల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో లాభసాటిగా మారిన ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. 2023 మార్చి నాటికి రూ.14,174గా ఉన్న టన్ను ఆయిల్ పామ్ గెలల ధర ప్రస్తుతం రూ.21,000కు పెరిగిందని తుమ్మల తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.8,500 మేర ధర పెరిగిందన్నారు. పెరిగిన ధరల వల్ల 64,582 మంది ఆయిల్ పామ్ రైతులకు అదనపు లబ్ధి చేకూరనుందని చెప్పారు. రాష్ట్రంలో పంట మార్పిడి ఆవశ్యకత, వంటనూనెలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణకు రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 14 కంపెనీలకు అనుమతులు ఇవ్వగా, ఇప్పటి దాకా సుమారు 2.43 లక్షల ఎకరాల ఆయిల్ పామ్ సాగులోకి వచ్చిందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ తోటల యాజమాన్యం, అంతర పంటల సాగు కోసం 45,548 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం రూ.72 కోట్లు జమ చేసిందని చెప్పారు. ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేసి కొత్త రైతులను ప్రోత్సహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదన మేరకు ముడి పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని కేంద్రం 27.5 శాతానికి పెంచడంతో ఆయిల్ పామ్ గెలల ధర గణనీయంగా పెరిగిందని తుమ్మల వివరించారు.

రాబడికి నూతన మార్గాలు!

- నిర్వహణలో లేని 25 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆదాయం సమకూర్చుకొనేందుకు ఎక్సైజ్ శాఖ కసరత్తు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆదాయాన్ని పెంచుకోవడానికి ఎక్సైజ్ శాఖ అధికారులు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ ప్రతిపాదనలకు అనుగుణంగా ఆదాయం సమకూర్చుకునేందుకు ఆ శాఖ కసరత్తు మొదలు పెట్టింది. అందులో భాగంగా రాష్ట్రంలో డిఫంక్ట్(నాన్ రెన్యూడ్) అయిన 40 బార్లను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ఆ ప్రాంతంలో మినహా రాష్ట్రంలోని మిగిలిన చోట్ల 25 బార్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడానికి ఆసక్తిగల వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తు రుసుం రూ.లక్ష చొప్పున నిర్ణయించి.. ఈ నెల 26వ తేదీ వరకు దాఖలు చేయడానికి గడువు ఇచ్చారు. ఒక్కో బార్‌కు అక్కడి రాబడి ఆధారంగా చేసుకుని రూ.30 నుంచి రూ.44 లక్షల వరకు సంవత్సరం ఫీజు నిర్ణయించారు. ఇలా ఏడాదికి రూ.10 కోట్లకుపైగా ఆదాయం వస్తుందని అంచనా. ఆయా బార్లలో మద్యం, బీర్ల అమ్మకాల వల్ల వచ్చే ఆదాయం ఇంకా ఎక్కువే ఉంటుంది. కాగా రాష్ట్ర వ్యాప్తంగా 2025-26లో రూ.27,623 కోట్ల ఆదాయం రాబట్టాలని ఎక్సైజ్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈసారి గత ఏడాదికంటే దాదాపు రూ.2 వేల కోట్ల వరకు అదనంగా లక్ష్యం నిర్ణయించారు. ఇటీవల బీర్ల ధరలు పెంచడంతో ప్రతి నెలా దాదాపు రూ.170 కోట్లకుపైగా ఆదాయం పెరుగుతుందని అంచనా. అంతేకాకుండా రాష్ట్రంలో అమ్మకాలు లేని దేశ, విదేశీ లిక్కర్, బీరు కంపెనీలు తమ బ్రాండ్ల మద్యం విక్రయించుకోవడానికి టీజీబీసీఎల్ దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా 2,620 రిటైల్ మద్యం దుకాణాలు(ఏ4) ఉండగా.. వాటికి 2023-25 ఎక్సైజ్ సంవత్సరానికి కేటాయించిన గడువు కూడా ఈ ఏడాది డిసెంబరుతో ముగియనుంది. నిర్ణీత గడువులోపు వాటికి నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల విక్రయం ద్వారా దాదాపు రూ.250 కోట్లు, లైసెన్స్ ఫీజు రూపంలో ఏడాదికి మరో రూ.400 కోట్లకుపైగా ఆదాయం వస్తుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.



ఇప్పపువ్వును నేతిలో వేయించి ఆరబెడుతున్న మహిళలు; ఇప్పపువ్వు లడ్డూలు తయారు చేస్తున్న మహిళలు

ఇప్పపువ్వు లడ్డూ!

- ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో తయారు చేస్తున్న ఆదివాసీ మహిళలు
- కిలో 400.. నెలకు 8లక్షల అమ్మకాలు
- ఈ లడ్డూతో రక్తహీనత సమస్యకు చెక్
- ఆరోగ్య పోషణమిత్రలో భాగంగా విద్యార్థినులకు సరఫరా
- లడ్డూ తయారీకి మోదీ ప్రశంసలు

ఉట్నూర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇప్పపువ్వుతో లడ్డూ! రుచికి రుచి.. అద్భుతమైన పోషక విలువలున్న ఈ మిఠాయి కావాలంటే ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో ఆదివాసీ మహిళలు ఈ లడ్డూలను తయారు చేస్తున్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ.. ఇప్పపువ్వు లడ్డూను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆదివాసీ మహిళలను ప్రశంసించడం గమనార్హం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన బాలికల్లో రక్తహీనత సమస్య ఎక్కువ. ఆదివాసీ మహిళలు సాధారణంగా ఇళ్లలో ఇప్పపువ్వు లడ్డూ తయారు చేసుకోవడం.. ఆ మిఠాయిలోని పోషక విలువల ద్వారా రక్తహీనత సమస్యకు చెక్‌పెట్టే అవకాశం ఉండటంతో లడ్డూ తయారీ కోసమే ప్రత్యేకంగా ఓ పరిశ్రమ పెడితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన ఐటీడీఏ అధికారులు చేశారు. అలా గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన దివ్య దేవరాజన్ చొరవతో 2019లో ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో రూ.14 లక్షలతో ఆదివాసీల ఆహార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆదివాసీ భీంబాయి మహిళా గ్రూప్‌నకు చెందిన 12మంది గిరిజన మహిళా సంఘం సభ్యులు ఇప్పపువ్వు లడ్డూలను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇప్పపువ్వును సేకరించి.. నెయ్యి, బెల్లం బాదంపప్పు, జీడిపప్పు, నువ్వులు, పల్లీలు సమపాళ్లలో కలిపి లడ్డూలను తయారు చేస్తున్నారు. తయారీ కోసం సరుకులను సొంతంగానే సమకూర్చుకుంటున్నారు. కిలో లడ్డూలను రూ.400కు విక్రయిస్తున్నారు. గిరిజన బాలికల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య పోషణమిత్ర పథకంలో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాల్లో తలా రెండు లడ్డూల చొప్పున ఇస్తున్నారు. ఈ లడ్డూ తయారీ గిరిజన మహిళలకు మంచి ఉపాధిగా మారింది.


ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ప్రధాని ప్రశంసించడం సంతోషంగా ఉంది



ఇప్పపువ్వుతో మేం తయారు చేస్తున్న లడ్డూల గురించి ప్రధాని మోదీ ప్రశంసించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ లడ్డూతో గిరిజన బాలికల్లో రక్తహీనత సమస్య తగ్గుతోంది. ఐటీడీఏ అధికారులు ఇప్పపువ్వు లడ్డూలను కొనుగోలు చేయడంతో మహిళలకు ఉపాధి లభిస్తోంది. ప్రతినెల రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల విలువైన అమ్మకాలు జరుగుతున్నాయి. ఖర్చులు పోనూ సభ్యులందరికీ తలా రూ.20 వేలదాకా ఆదాయం మిగులుతోంది.

\- భాగుబాయి, ఆదివాసీ ఆహార కేంద్రం అధ్యక్షురాలు, ఉట్నూర్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.